
ఒంగోలులో ఎంపీ మాగుంటకు స్వీట్ తినిపిస్తున్న ఆయన సతీమణి

ఓటర్లు తీర్పు ఇచ్చేశారు. అయితే ఫలితాలు వెల్లడయ్యేందుకు మరో 20రోజుల గడువు ఉంది. దీంతో కూడికలు, తీసివేతల్లో అభ్యర్థులు, నాయకులు తలమునకలయ్యారు. అంచనాలపై ఒక ఆలోచనతో పందెంరాయుళ్లు బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి నేతల్లో జోష్ కన్పిస్తుండగా.. వైసీపీ నాయకులు ఆశల పల్లకీలో ముందుకు సాగుతున్నారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని చూస్తే గత ఎన్నికల కన్నా మెరుగైన స్థితిలో టీడీపీ కూటమి ఉన్నట్లు కనిపిస్తోంది. ఈసారి ఎక్కువ స్థానాలు గెలుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు వైసీపీ నాయకులు గత ఆధిక్యతలకు గండిపడినా బొటాబొటీతోనైనా బయటపడతామన్న నమ్మకంతో ఉన్నారు. దాన్ని బట్టి చూస్తే వైసీపీ ఓట్లకు భారీగా గండిపడిందనే విషయం స్పష్టమైంది. ముఖ్యంగా పశ్చిమప్రాంతంలో కూటమి సీట్లు పెరిగే పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనాకు వచ్చారు.

కూటమిలో జోష్

- జిల్లాలో పెరగనున్న సీట్లు
- వివిధ వర్గాల్లో పెరిగిన ఆదరణపై టీడీపీ నేతల ధీమా
- ఓట్ల బదలాయింపుపై వారిలో గట్టి నమ్మకం
- వృద్ధులు, మహిళా ఓట్లు, డబ్బు పంపిణీ ప్రభావం చూపుతుందని వైసీపీ ఆశ
- పశ్చిమాన గత ఆధిక్యతలకు గండి
- మార్పునకు అదే సూచన


ఒంగోలులోని నివాసంలో దామచర్లకు స్వీట్ తినిపిస్తున్న ఆయన తల్లి


కనిగిరిలో టీడీపీ కార్యకర్తలను అభినందిస్తున్న డాక్టర్ ఉగ్ర

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాలో గతం కన్నా ఈ పర్యాయం పోలింగ్ శాతం భారీగా పెరిగింది. గత ఎన్నికల్లో సుమారు 79.74శాతం ఉండగా, ఈ పర్యాయం కొత్త ప్రకాశంలోనే పోలింగ్ శాతం 84.26కు చేరింది. ఇక ఉమ్మడి జిల్లాలోని మిగిలిన నాలుగు స్థానాల్లోనూ పోలింగ్ శాతం 80కిపైగా ఉండటం విశేషం. దీంతో ఓటర్లు జిల్లాలో గతం కన్నా ఉత్సాహంగా పోలింగ్‌కు రావడం గమనార్హం. పెరిగిన పోలింగ్ కూటమికి అనుకూలంగా ఉందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.


గిద్దలూరులో తన నివాసంలో కార్యకర్తలతో అశోక్‌రెడ్డి

గిద్దలూరులో విజయంపై టీడీపీ నమ్మకం

మార్కాపురం డివిజన్‌లో గత ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన ఆధిక్యతలకు భారీగా గండిపడిందనే విషయం తేటతెల్లమవుతోంది. గత ఎన్నికల్లో గిద్దలూరులో 81వేల ఓట్ల మెజారిటీతో వైసీపీ గెలుపొందింది. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థి గెలుపుపై ఆపార్టీ శ్రేణులు ధీమాతో ఉన్నాయి. వైసీపీ అభ్యర్థి నాగార్జునరెడ్డి కుటుంబసభ్యులు మార్కాపురంలో చేసిన భూదందాల వ్యవహారం ప్రజల నోళ్లలో విస్తృతంగా నానింది. ఇక జనసేన కలయిక ద్వారా అక్కడ బలమైన ఓటుబ్యాంకు కలిగిన కాపు సామాజికవర్గం నుంచి టీడీపీకి మంచి మద్దతు లభించింది. గిద్దలూరు నగర పంచాయతీ, రూరల్ మండలం, కంభం, రాచర్ల, కొమరోలు మండలాల్లో ఆధిక్యతపై టీడీపీ పూర్తి ధీమాతో ఉంది. బేస్తవారపేట, అర్థవీడు మండలాల్లో వైసీపీకి ఆధిక్యత వచ్చినా గతం అంత రాదనేది టీడీపీ శ్రేణుల నమ్మకం. గిద్దలూరు, కంభంలో కాపు, ఆర్యవైశ్య సామాజికవర్గాలతోపాటు బలహీనవర్గాల్లో టీడీపీకి బలం పెరిగింది. దీంతో గిద్దలూరు ప్రాంత ఆధిక్యతతో బయటపడగలమన్న ధీమా టీడీపీ శ్రేణుల్లో ఉంది.

ఓటర్లను ప్రభావితం చేసిన అంశాలు

సాధారణ ఓటర్లను పలు అంశాలు ప్రభావితం చేశాయి. ప్రభుత్వ అనుకూల అంశాల కన్నా, వ్యతిరేక అంశాలే ఓటర్లలో కనిపించాయని అంచనా వేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారానే ఉద్యోగులు ప్రభుత్వ వ్యతిరేకతను ప్రదర్శించారు. యువత, విద్యార్థుల్లో అది అధికంగా కనిపించింది. ప్రధానంగా మెగా డీఎస్సీ వేయకపోవడాన్ని నిరుద్యోగులు ప్రధానాంశంగా ప్రస్తావించారు. వ్యాపార వర్గాల్లోనూ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి కనిపించింది. తటస్థ ఓటర్లలో కూడా అదేరకమైన అభిప్రాయం వ్యక్తమైంది. టీడీపీతో జనసేన, బీజేపీ కూటమి కట్టడం టీడీపీ అభ్యర్థులకు బాగా కలిసివచ్చింది. ప్రధానంగా జిల్లాలో జనసేన ఓట్లు టీడీపీకి బదలాయింపు పూర్తిస్థాయిలో జరగడం స్పష్టంగా కనిపించింది. అదేసమయంలో కూటమి అధికారంలోకి వస్తే పశ్చిమప్రాంతంలో మార్కాపురం జిల్లా ఏర్పడుతుందన్న నమ్మకం, ఇటు అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలు జిల్లాలోకి వస్తాయన్న ఆశ ఆయా వర్గాల్లో కలిగింది.

దర్శిలో నువ్వానేనా..

దర్శిలో పోటీ నువ్వా?నేనా? అన్నట్లు సాగింది. టీడీపీ అభ్యర్థికి టీడీపీ, జనసేనలు ఐక్యంగా పనిచేయడం ప్లస్ అయ్యింది. వైసీపీ అభ్యర్థికి ఆపార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరగణం సహకరించలేదు. తాళ్లూరు మండలంలో వైసీపీ ఆధిక్యతకు, ముండ్లమూరు మండలంలో టీడీపీకి వచ్చే ఆధిక్యం సరిపోతుందని అంచనా. దొనకొండ మండలంలో ఎవరికైనా స్వల్ప ఆధిక్యత రావచ్చు. వైసీపీ అనుకున్నట్లు స్వల్ప ఆధిక్యత వారికి వచ్చినా కురిచేడులో టీడీపీ వచ్చే మెజారిటీ దానిని మింగేస్తుంది. దర్శి నగరపంచాయతీ, రూరల్ మండలాలల్లో ఆధిక్యతపై ఇరుపార్టీల్లోనూ ధీమా వ్యక్తమవుతున్నప్పటికీ.. టీడీపీ వైపు మొగ్గు కనిపిస్తోంది.

మార్కాపురంపై ఇరుపార్టీల్లోనూ ధీమా

మార్కాపురంలో విజయంపై ఇరు పార్టీల ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఆర్యవైశ్యుల ఓట్ల చీలిక ప్రధానంగా కలిసొస్తుందనేది వైసీపీ నాయకుల అంచనా. అదేసమయంలో ఎప్పుడూ టీడీపీ జెండా పట్టని పట్టణంలోని రెడ్డి సామాజికవర్గం వారు ప్రస్తుతం కూటమి పక్షాన చేరారు. మరో ముఖ్యమైన ముస్లింల ఓట్లపై వైసీపీ బలమైన ఆశతో ఉండగా టీడీపీ అభ్యర్థి నారాయణరెడ్డికి వ్యక్తిగత అనుబంధం ఆ వర్గంతో ఉంది. ఇక ఉద్యోగులు, విద్యాధికులు, వ్యాపారవర్గాలలో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత టీడీపీకి కలిసొస్తుంది. వైసీపీ అభ్యర్థి రాంబాబుకు పూర్వం నుంచి ఉన్న కొన్ని పరిచయాలు కలిసొస్తాయనేది ఆ పార్టీ నమ్మకం. దీంతో పట్టణంలో ఆధిక్యతపై ఇరు పార్టీలు ధీమాగా ఉన్నప్పటికీ టీడీపీకే మెజారిటీ వచ్చే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మార్కాపురం రూరల్, తర్లుపాడు మండలాల్లో టీడీపీకి ఆధిక్యతకు అవకాశాలు పెరిగాయి. పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో గత వైసీపీ ఆధిక్యతకు గండిపడటం స్పష్టంగా కనిపిస్తోంది.

సూపర్ సిక్స్ బాగా పనిచేసింది

ఓటర్ల నాడిని పసిగట్టే ప్రయత్నం చేసిన కొన్ని సంస్థల వారు ఆసక్తికర అంశాలను వెల్లడిస్తున్నారు. పింఛన్‌దారులైన వృద్ధుల్లో ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడం పట్ల వైసీపీకి ఆదరణ కనిపించిన మాట నిజమేకానీ అదేసమయంలో పింఛన్ నాలుగు వేలకు పెంపుదల చేస్తామని టీడీపీ హామీఇవ్వడం, బీసీలకు 50ఏళ్లకే పింఛన్ మంచి ఫలితాలు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. మహిళల్లో టీడీపీ ప్రకటించిన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రభావం కనిపించింది. ఇక అన్ని సామాజిక వర్గాల్లోని రైతుల్లో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పట్ల వ్యతిరేకత బహిర్గతమైంది.


దర్శిలో కార్యకర్తలతో డాక్టర్ లక్ష్మి

ఎర్రగొండపాలెంలో గట్టి పోటీ...

ఎర్రగొండపాలెంలో టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు ప్రజల్లోకి చొచ్చుకుపోగలిగారు. వైసీపీ అభ్యర్థి ఆ విషయంలో పూర్తిగా వెనుకబడిపోయారు. టీడీపీ కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయగా వైసీపీలో మంత్రి సురేష్ వర్గం కొన్నిచోట్ల సహకరించలేదు. పుల్లలచెరువులాంటి మండలంలో బలమైన రెడ్డి నాయకులు టీడీపీలో చేరిపోయారు. ఎరిక్షన్‌బాబు 25వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందుతానని ప్రకటించుకోగా వైసీపీ నాయకులు 10వేల ఓట్లతో గెలుపు మాదేనని ధీమాగా చెబుతున్నారు. ఒక అంచనా మేరకు పుల్లలచెరువు, వైపాలెం మండలాల్లో టీడీపీకి స్పష్టమైన ఆధిక్యత కనిపిస్తోంది. దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో వైసీపీకే ఆధిక్యత లభించే అవకాశాలున్నాయి. అయితే పెద్దారవీడు మండలంలో వైసీపీలోని ఒక వర్గం చాపకింద నీరులా టీడీపీకి సహకరించిందన్న ప్రచారం ఉంది. ఈ నాలుగు మండలాల్లో కొంత అంచనాలు అటుఇటు అయినా త్రిపురాంతకం మండలంలో ఆధిక్యత కీలకమయ్యే అవకాశాలున్నాయి. అక్కడ మెజారిటీపై రెండు పార్టీల్లోనూ ధీమా కనిపిస్తోంది.

పశ్చిమాన టీడీపీకి పెరిగిన బలం

జిల్లాలో పశ్చిమ ప్రాంతం వైసీపీకి గత ఎన్నికల్లో భారీ మెజారిటీ ఇచ్చింది. ప్రస్తుతం ఆ ఆధిక్యతలకు గండిపడిందనే అంశాన్ని వైసీపీ నాయకులు కూడా అంగీకరిస్తున్నారు. పశ్చిమంలోని ఐదు స్థానాల్లో కొన్ని టీడీపీ ఖాతాలో పడటం ఖాయమని తేలిపోయింది. కనిగిరిలో టీడీపీ విజయం ఖాయమన్న భావన అందరిలోనూ కనిపిస్తోంది. వైసీపీ శ్రేణులు ఐదువేల ఓట్ల ఆధిక్యతతో గెలుస్తామన్న ధీమాతో ఉండగా, టీడీపీ శ్రేణులు 15వేలకుపైగా ఆధిక్యత వస్తుందని చెప్తున్నాయి. పామూరు మండలం టీడీపీకి మంచి ఆధిక్యం రాబోతుంది. వీసీపల్లి, సీఎస్‌పురం మండలాల్లోనూ ఆ పార్టీకే ఆధిక్యత వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కనిగిరి పట్టణంలో టీడీపీకి మంచి ఆధిక్యత లభించబోతుంది. వెలిగండ్ల, హెచ్ఎంపాడు మండలాల్లో గట్టిపోటీ జరిగినా టీడీపీకి మెజారిటీ సాధించే అవకాలున్నాయి. ఇక్కడ ఓట్ల కొనుగోలులోనూ వ్యత్యాసం కనిపించడం లేదు.

- (మిగిలిన నియోజకవర్గాల విశ్లేషణ రేపటి సంచికలో)


ఒంగోలులో క్యూలో ఉన్న ఓటర్లు

భారీ పోలింగ్

87.17శాతం ఓటింగ్

- గత ఎన్నికలకంటే ఎనిమిది శాతం అధికం
- దర్శి సెగ్మెంట్‌లో అత్యధికంగా 91శాతం
- ఒంగోలు పార్లమెంట్ పరిధిలో 14,01,614 మంది ఓటుహక్కు వినియోగం

ఒంగోలు (కలెక్టరేట్), మే 14 : ఒంగోలు పార్లమెంట్ పరిధిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో జిల్లా ఓటర్లు భారీగా పాల్గొని ఓటుహక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలలో నిల్చొని మరీ ఓటు వేశారు. ఒకవైపు అనుకున్నంత స్పీడ్‌గా ఈవీఎంలు పనిచేయకపోవడం, ఇంకోవైపు కేంద్రాలకు ఓటర్లు భారీగా తరలిరావడంతో పోలింగ్ ఆలస్యమైంది. ఓటర్లు గంటల తరబడి క్యూలలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని నియోజకవర్గాల్లో సోమవారం అర్ధరాత్రి వరకు కూడా ఓటింగ్ జరిగింది. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 16,07,832 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 8,02,483 మంది, మహిళలు 8,05,242 మంది, థర్డ్ జెండర్ 107మంది. వీరిలో 14,01,614 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలా 87.17శాతం మంది ఓటేయడం జిల్లా చరిత్రలో ఇదే మొదటిసారి. ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 91శాతం మంది ఓటుహక్కును వినియోగించుకోగా, అత్యల్పంగా ఒంగోలు నియోజకవర్గంలో 84.56శాతం మంది ఓటేశారు.

మహిళల కంటే పురుష ఓటర్లే ఎక్కువ వినియోగం

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో మహిళల కంటే పురుష ఓటర్లే అధికంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 14,01,614 మంది ఓటు వేయగా అందులో పురుషులు 7,00,983 మంది, మహిళలు 7,00,565 మంది ఉన్నారు. మహిళల కంటే పురుషులు 418 మంది తమ ఓటుహక్కును అధికంగా వినియోగించుకున్నారు. కొన్నిచోట్ల మహిళలే ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకోగా, జిల్లావ్యాప్తంగా సరాసరిన చూస్తే పురుష ఓటర్లే స్వల్పంగా ముందున్నారు.

ఒంగోలు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే కీలకం

ఒంగోలు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే గెలుపోటములు నిర్ణయించనున్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఒంగోలులో 2,40,242మంది ఓటర్లు ఉండగా పురుషులు కేవలం 98,055 మంది ఓటు వేశారు. మహిళలు 1,05,050 మంది వినియోగించుకున్నారు. పురుషుల కంటే 6,995 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు.

నియోజకవర్గాల వారీ పోలైన ఓట్లు, పోలింగ్ శాతం వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జండర్	పోలైనవి	శాతం
వైపాలెం	2,07,214	93,944	91,296	02	1,85,242	89.40
దర్శి	2,26,370	1,03,765	1,02,227	01	2,05,993	91.00
ఒంగోలు	2,40,242	98,055	1,05,050	38	2,03,143	84.56
కొండపి	2,39,609	1,05,174	1,06,174	02	2,11,350	88.21
మార్కాపురం	2,14,608	95,195	92,750	07	1,87,952	87.58
గిద్దలూరు	2,39,710	1,00,318	1,02,809	09	2,03,136	84.74
కనిగిరి	2,40,079	1,04,532	1,00,259	07	2,04,798	85.30
మొత్తం	16,07,832	7,00,983	7,00,565	66	14,01,614	87.17

స్ట్రాంగ్‌రూంలకు చేరిన ఈవీఎంలు

- పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ సుమిత్


స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు (కలెక్టరేట్), మే 14 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజవర్గాల ఈవీఎంలను ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూంలకు బస్సులలో తీసుకువచ్చారు. అక్కడ ఆయా నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపర్చారు. ఒంగోలు పార్లమెంట్, అసెంబ్లీల ఈవీఎంలను వేర్వేరుగా ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత మార్కాపురం, కనిగిరి, దర్శి గిద్దలూరు, వైపాలెం నియోజకవర్గాల ఈవీఎంలను ఒంగోలులోని స్ట్రాంగ్‌రూంలకు ప్రత్యేక వాహనాల్లో భారీ బందోబస్తు మధ్య తీసుకొచ్చారు. రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను స్ట్రాంగ్‌రూములలో దించారు. జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌లు అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. స్ట్రాంగ్‌రూంల వద్ద ఆర్వోలు, సిబ్బందితో వారు మాట్లాడారు. ఆయా స్ట్రాంగ్‌రూంలలో భద్రపర్చిన అనంతరం సీల్ వేశారు.

స్ట్రాంగ్ భద్రత : ఎస్పీ



ఒంగోలు (క్రైం), మే 14 : స్ట్రాగ్‌రూంల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ పేర్కొన్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ స్థానానికి చెందిన ఈవీఎంలు రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూంలకు మంగళవారం చేర్చి సీల్ వేశారన్నారు. అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు, రూంల బయట ఆర్మ్‌డ్ రిజర్వుడ్ బలగాలు, బయట సివిల్ పోలీసులతో నిరంతరం నిఘా ఉంచామని చెప్పారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు సమష్టిగా పనిచేసినందున అక్కడక్కడా చెదురుమదరు సంఘటనలు మినహా ఓటింగ్ ప్రశాతంగా జరిగిందన్నారు. ఎన్నికల అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశామని, రాత్రులు గస్తీ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

మీరు టీడీపీకి ఓటేశారు.. నీళ్లివ్వం!

- మహిళను అడ్డుకున్న వైసీపీ కార్యకర్త
- నిలదీసిన టీడీపీ వర్గీయుడు
- వాదంపల్లిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- రాళ్లదాడి.. ఐదుగురికి గాయాలు
- ఎర్రగొండపాలెం వైద్యశాలలో చికిత్స


గాయపడిన చేకూరి చెన్నకేశవులు, దుగ్గినేని వెంకటేశ్వర్లు


గాయపడిన కన్నెబోయిన సాయికృష్ణ, వెంకటేశ్వర్లు

ఎర్రగొండపాలెం, మే 14 : 'మీరు టీడీపీకి ఓటు వేశారు. మీకు నీళ్ల ఇవ్వం' అంటూ మండలంలోని వాదంపల్లిలో ట్యాంకర్ నిర్వాహకుడిగా ఉన్న వైసీపీ కార్యకర్త ఓ మహిళకు నీళ్ల ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణ చోటుచేసుకొని ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వాదంపల్లి గ్రామానికి మంగళవారం ఉదయం ట్యాంకర్ వచ్చింది. దాని వద్ద గ్రామస్థులు నీటిని పట్టుకున్నారు. ఓ మహిళ అక్కడికి రాగా ఆ ట్యాంకర్ యజమాని కన్నెబోయిన వెంకటేశ్వర్లు అడ్డగించాడు. మీరు టీడీపీకి ఓటు వేశారని, మా నీళ్ల పట్టుకోవద్దని అన్నాడు. దీంతో ఆమెతోపాటు మరికొంత మంది వెనక్కు వెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న టీడీపీ కార్యకర్త చేకూరి చెన్నకేశవులు ట్యాంకర్ యజమానిని నిలదీశాడు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకొని ఘర్షణ మొదలైంది. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లదాడికి దిగారు. టీడీపీకి చెందిన చెన్నకేశవులతోపాటు దుగ్గినేని వెంకటేశ్వర్లు, చేకూరి వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. ఇక వైసీపీకి చెందిన కన్నెబోయిన సాయికృష్ణ కన్నెబోయిన వెంకటేశ్వర్లు గాయపడ్డారు. క్షతగాత్రులంతా ఎర్రగొండపాలెం వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నారు.

టీడీపీ కూటమికి మద్దతు తెలిపిన

ఓటర్లకు కృతజ్ఞతలు

పార్టీ శ్రేణులతో దామచర్ల మాటామంతీ..!

పోలింగ్ సరళిపై చర్చలు

చాలా రోజుల తర్వాత కుటుంబసభ్యులతో కలిసి భోజనం



కుటుంబసభ్యులతో కలిసి మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), మే 14: నలభై రోజులపాటు ఎన్నికల ప్రచారం. అందరూ ఒకే ఇంటిలో ఉన్నా, ఒకరినొకరు పలకరించుకునే తీరిక లేదు. కలిసి భోజనం చేసే అవకాశం రాలేదు. ఒకవైపు తన గెలుపు కోసం నిత్యం ప్రజల్లోకి దామచర్ల జనార్దన్. మరోవైపు భర్త కోసం నాగసత్యలత విరామం లేకుండా, విశ్రాంతి లేకుండా పర్యటించారు. ప్రజలను కలిసి, తాము చేసిన ప్రగతిని వివరించి ఓట్లు అభ్యర్థించారు. కాగా సోమవారంతో ఎన్నికల పోలింగ్ ముగియడంతో టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల మంగళవారం కుటుంబ సభ్యులతో గడిపారు. చాలా రోజుల తర్వాత ఒకే టేబుల్ దగ్గర కూర్చుని అందరూ కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దన్‌కు మాతృమూర్తి కుమారుడికి మిఠాయిలు తినిపించి పలు అంశాలపై మాట్లాడారు. రాబోయే ఎన్నికల ఫలితాల్లో తప్పకుండా విజయం వరిస్తుందని భరోసా ఇవ్వడంతో కుటుంబ సభ్యులందరూ సరదాగా మాట్లాడుకోవడంతో ఆ ఇంట్లో ఆనందాలు కనిపించాయి. అంతకముందు పార్టీ శ్రేణులతో సమావేశమైన దామచర్ల నియోజకవర్గంలో పోలింగ్ సరళిపై చర్చించారు. పార్టీ గెలుపుపై సమీక్షించారు. ఎన్నికల సందర్భంగా తనతో కలిసి నడిచి, తాను విజయం సాధించాలని ఆకాంక్షించి ప్రతి నిత్యం కష్టపడిన, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతోపాటు టీడీపీ కూటమికి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ జనార్దన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



ప్రభతో ఊరేగింపుగా వెళుతున్న యువకులు, చిన్నారులు

చీమకుర్తి, మే14 : చీమకుర్తి పట్టణంలోని గరికమెట్ట పరిధిలో వేంచేసి ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వేడుకగా నిర్వహించారు. కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర,సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రభను ఏర్పాటుచేసి ఊరేగింపుగా వెళ్లి మొక్కుబడులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో మేడగం వెంకటేశ్వరరెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి, మారం వెంకారెడ్డి, మేడగం బ్రహ్మరెడ్డి, పారా నాగార్జునరెడ్డి, కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగుంట, దామచర్ల భేటీ



మాగుంటతో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కలెక్టరేట్), మే 14: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్ సరళిపై తెలుగుదేశంపార్టీ ముఖ్యనాయకులు భేటీ అయ్యి చర్చించారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో మంగళవారం రాత్రి ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఒంగోలులో సోమవారం జరిగిన పోలింగ్ సరళితో పాటు డివిజన్ల వారీగా విశ్లేషించుకున్నట్లు సమాచారం. నగరంతో పాటు ఒంగోలు రూరల్ మండలం, కొత్తపట్నం మండలంలో తెలుగుదేశం పార్టీకి ఆధిక్యత వస్తుందని విశ్లేషించినట్లు సమాచారం. నగరంలో వైసీపీ వ్యవహరించిన దౌర్జన్యాలపై చర్చకు వచ్చినట్లు తెలిసింది. కార్యక్రమంలో దామచర్ల బావ రవికుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అమ్మపాట ఆవిష్కరణ



అమ్మపాటను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 14 : మరణం లేనిది అమ్మతనమని, సృష్టికి ప్రతిసృష్టి చేసేది మాతృదేవత అని పలువురు కొనియాడారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని సింహాద్రి జ్యోతిర్మయి రాసిన అమ్మపాటను గాయకుడు నూకతోటి శరత్‌బాబు పాడగా సంగీత దర్శకులు వెస్లీ నేపథ్యాన్ని అందజేశారు. స్థానిక సంతపేటలోని మెడికల్ హాలులో మంగళవారం రాత్రి డ్వామా ఏపీడీ జి.కాత్యాయనిదేవి అమ్మపాటను ఆవిష్కరించారు, ఇండియన్‌మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జాలాది మణిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నరసం రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, కుర్రా ప్రసాద్‌బాబు, రాజ్యలక్ష్మీ, కొల్లా మధు, మారెళ్ళ సుబ్బారావు, రాజేశ్వరి, కొమ్మి రమణయ్య, రాజేశ్వరి, కంకణాల ఆంజనేయులు, శ్రీదేవి, సుజాత, బీరం అరుణ, నాళం నరసమ్మ, షెహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెజార్టీపై లెక్కలు..!

బీఎన్ కార్యాలయం వద్ద ఎస్ఎన్‌పాడు ముఖ్యనేతల సందడి ● గ్రామాల వారీ పోలింగ్ శాతం, అధిక్యతపై విశ్లేషణ

శ్రమించిన టీడీపీ కూటమి కార్యకర్తలకు విజయకుమార్ కృతజ్ఞతలు



నాయకులతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఒంగోలు, మే 14 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు నియోజకవర్గంలో మరోసారి టీడీపీ కూటమి అభ్యర్థి గెలుపుపై ఎన్నికలకు ముందు నుంచే దీమాగా ఉన్న ఆ నియోజకవర్గ నేతలు ప్రస్తుతం మెజార్టీపై లెక్కలు వేస్తున్నారు. ఇదే విషయమై ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని పార్టీ అభ్యర్థి బీఎన్.విజయకుమార్ కార్యాలయం వద్ద నియోజకవర్గ ముఖ్యనేతలు అంతా విశ్లేషణలు చేస్తున్నారు. గత రాత్రి పొద్దుపోయే వరకు పోలింగ్ జరగ్గా మంగళవారం ఆయా మండల, క్లస్టర్ స్థాయి, అలాగే కొన్ని గ్రామాల ముఖ్యనాయకులు బీఎన్ కార్యాలయానికి వచ్చారు. తమ గ్రామాలు, పోలింగ్ బూతుల వారీ పోలైన ఓట్లు, అందులో టీడీపీకి అనుకూలంగా పోలైన తీరును బీఎన్‌కు వివరించారు. గత ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో లభించిన ఓట్లు, ప్రస్తుత ఎన్నికల్లో ఎన్ని వచ్చే అవకాశం ఉంది, ప్రత్యర్థి పార్టీకి ఎన్ని వస్తాయి, తద్వారా ఎక్కడ ఎంత అధిక్యత లభిస్తుందన్న దానిపై విశ్లేషణ చేస్తున్నారు. అలా వివిధ మండలాలు, గ్రామాల నాయకులతో బీఎన్ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. కాగా గత ఎన్నికల్లో ఓటమి చెందడానికి చీమకుర్తి మండలం ప్రధాన కారణం కాగా, ఈ సారి ఆ మండలం లో కూడా మెజార్టీ వస్తుందన్న దీమాను ఆ మండలం, చీమకుర్తి పట్టణ నాయకులు బీఎన్ దృష్టికి తెచ్చి అందుకు కారణాలను వివరించారు. అదే సమయంలో నాగులుప్పలపాడు మండలంలో ఈసారి భారీ అధిక్యం లభిస్తుందన్న అభిప్రాయంతో ఉన్న విజయకుమార్ గ్రామాల వారీ ఆ మండల నాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మద్దిపాడు, సంతనూతలపాడు మండలాల్లోనూ అధిక్యం వస్తుందని, మొత్తంగా దాదాపు 15వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తామన్న దీమాను ముఖ్యనేతలు వ్యక్తం చేస్తూ అందుకు సంబంధించిన సానుకూల అంశాలపై చర్చించారు. కాగా ఈ సారి గెలుపుఖాయమన్న విషయంలోను ఎన్నికలకు ముందుగానే గుర్తించానని ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ చెప్పిన విజయకుమార్ పార్టీ శ్రేణులు అలా కష్టపడి పనిచేశారని దాని వల్ల భారీ మెజార్టీ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక టీడీపీ శ్రేణులతో భాగస్వాములైన జనసేన, బీజేపీ, అలాగే ఎంఆర్‌పీఎస్, ఇతర పలు వర్గాల వారు సంపూర్ణ మద్దతు తెలిపి పనిచేశారని, వారందరికీ బీఎన్ కృతజ్ఞతలు తెలిపారు. వచ్చేనెల 4న జరగనున్న కౌంటింగ్‌కు ఏజెంట్ల నియామకం, ఇతర అంశాలపై దృష్టి సారించాలని పార్టీ నేతలకు బీఎన్ సూచించారు. ఈ భేటీల్లో బీఎన్ సోదరుడు, ఎన్నికల ప్రక్రియలో కీలకంగా పనిచేసిన టి.అనిల్‌కుమార్, వివిధ మండలాల నాయకులు మండవ జయంత్‌బాబు, తేళ్ల మనోజ్‌కుమార్, మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, మద్దినేని హరిబాబు, కాకర్ల చిన్నా, దివి పున్నారావు, మద్దినేని హరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో 87.55శాతం పోలింగ్

మహిళల ఓట్లు ఎక్కువగా నమోదు

98 కేంద్రాల్లో 90శాతంకు పైగా పోలింగ్

మంగమూరు, తిమ్మసముద్రం రెండు కేంద్రాల్లో వందశాతం నమోదు

ఓటింగ్‌పై పార్టీల నేతల విశ్లేషణలు

చీమకుర్తి, మే 14 : సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు మండలాల్లోని 256 పోలింగ్ కేంద్రాల్లో 87.55శాతం పోలింగ్ నమోదు అయింది. మొత్తం ఓటర్లు 2,14,638కాగా 1,87,912 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని ఆర్వో గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా 95,202మంది మహిళలు తమ ఓటుహక్కును వినియోగించుకొని అగ్రభాగాన నిలిచారు. పోలింగ్ బూత్ 98(మంగమూరు), 227 (తిమ్మసముద్రం)లో 100 శాతం పోలింగ్ నమోదు కావటం విశేషం. మొత్తం 256 పోలింగ్‌కేంద్రాల్లో 98 బూత్‌లలో 90శాతంకుపైగా పోలింగ్ నమోదు కావటం గమనార్హం. నాలుగు మండలాల్లోని ఇరు పార్టీలకు కీలకమైన కొన్ని పెద్దగ్రామాల్లో పోలింగ్ ఎక్కువగా నమోదు అయ్యింది. కాగా పోలింగ్‌సరళిపై లెక్కల్లో నాయకులు బిజీగా ఉన్నారు. ఏజెంట్ల ద్వారా తెప్పించుకున్న సమాచారం విశ్లేషించి తమ విజయంపై అంచనాకు వస్తున్నారు. మంగళవారం చీమకుర్తిలో జరిగిన సమావేశంలో వైసీపీ అభ్యర్థి మంత్రి మేరుగ నాగార్జున కీలకమైన నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళిపై చర్చించారు. నాయకత్వ లోపం, బూచేపల్లి కుటుంబం సేవలు చీమకుర్తికి దూరం కావటం, పోల్ మేనేజ్‌మెంట్‌లో అనుకున్నంత స్థాయిలో విజయవంతం కాకపోవటం, అలాగే టీడీపీ, జనసేన క్యాడర్ ఐక్యంగా చేసిన తీవ్ర కృషి వల్ల చీమకుర్తిలో గత ఎన్నికల్లో వైసీపీ వచ్చిన 6వేల మెజారిటీకి భారీగా గండిపడి ఉంటుందని భావిస్తున్నారు.

టీడీపీ క్యాడర్‌లో జోష్

మరో వైపు తెలుగుదేశం క్యాడర్ మాత్రం పోలింగ్ జరిగి న తీరుపట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ గెలుపునకు గుండెకాయ లాంటి చీమకు ర్తిలో చెక్ పెట్టగలిగామని భావిస్తున్నారు. కాపులు, క్రిస్టియన్స్, ముస్లింలు, బీసీల ఓటర్ల పోలరైజేషన్ లో విజయం సాధించామని, దీనివల్ల చీమకుర్తిలో వైసీపీ మెజారిటీకి గండికొట్టగలిగామని విశ్లేషించుకుంటున్నారు. అయితే మొత్తం మీద ఈసారి బీఎన్.విజయ్‌కుమార్ ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో 10వేల మెజారిటీతో విజయదుందుభి మోగించటం ఖాయమనే భావనలో టీడీపీ శ్రేణులు ఉన్నారు.

మేలిమి పొగాకుకు గిట్టుబాటు ధరలు

● బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



టంగుటూరులో పొగాకు కొనుగోలును పరిశీలిస్తున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

మద్దిపాడు, మే 14: అంతర్జాతీయంగా పొగాకు మార్కెట్ తగ్గుముఖం పట్టడంతో స్థానిక మార్కెట్‌లో పొగాకు ధరలు పెరిగాయని, ఈ ధరలు చూసి రైతులు ఎక్కువ ధరలకు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేయవద్దని గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన పొగాకు మంచి ధర పలుకుతుందని, రైతులకు పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉందన్నారు. ప్రత్యామ్నాయ పంటలతోనే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం ధరల చూసి అధిక పొగాకు సాగు చేస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు మాట్లాడుతూ పొగాకు రైతులు ప్రతికూల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు పొగాకు ధరలను ఆశాజనకంగా పెంచాలన్నారు. ఆర్ఎం లక్ష్మణరావు మాట్లాడుతూ వెల్లంపల్లి వేలం కేంద్రంలో రైతులకు ఆశాజనకంగా ధరలు వస్తున్నాయని, గరిష్ఠ ధర కిలో రూ.299 పలుకుతుందన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ, నారిపెద్ది వరహాలచౌదరి, రావి ఉమామహేశ్వరరావు, బోయపాటి వెంకయ్య చౌదరి, మండువ శ్రీరామ్మూర్తి, నల్లూరి రాంబాబు, మండువ రమేష్, పల్లకి సత్యనారాయణరెడ్డి, కాకర్ల విజయ్‌కుమార్, చెరుకూరి వాసుబాబు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్ల పరిశీలన

టంగుటూరు: టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాన్ని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, వైస్‌చైర్మన్ గుత్తా వాసుబాబు మంగళవారం సందర్శించారు. వేలం సరళిని, వివిధ గ్రేడ్‌లకు వ్యాపారులు చెల్లిస్తున్న ధరలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు రైతులతో మాట్లాడారు. వేలం కేంద్రానికి అన్ని రకాల పొగాకు గ్రేడ్లను తెచ్చుకోవాలని సూచించారు. పొగాకులో అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ కంపెనీల బయ్యర్లతో మాట్లాడుతూ అన్ని రకాల గ్రేడ్లు కొనుగోలు చేయాలని కోరారు. మంగళవారం గొర్లమిట్ట, మట్టిపాడు, మల్లవరప్పాడు, శివపురం గ్రామాల రైతులకు చెందిన 919 పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి అనుమతించారు. ఇందులో 861 బేళ్లు కొనుగోలు కాగా, మిగిలినవి వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ఠ ధర కిలోకు రూ.300, కనిష్ఠ ధర రూ.205 పలికింది. సరాసరి ధర రూ.261.69 దక్కింది. కొనుగోళ్లలో 14 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్ వెంట బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, టంగుటూరు వేలం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు ఉన్నారు.

ఎమ్మెల్యే స్వామితో నేతల సమాలోచనలు

సత్యను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎమ్మార్పీఎస్ నాయకులతో మాట్లాడుతున్న దామచర్ల సత్య

కొండపి, మే 14 : సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ ముగియడంతో మంగళవారం కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యను నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు. ఒంగోలులోని దామచర్ల సత్య నివాసంలో ఆయనతో ఎమ్మార్పీఎస్ నాయకులు భేటీ అయ్యారు. ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణకు ఎన్‌డీఏ కూటమి హామీ ఇచ్చిన నేపథ్యంలో తమ సామాజికవర్గం అంతా కూటమికి మద్దతుగా నిలిచిందని వివరించారు. నియోజకవర్గంలో మాదిగలు దాదాపు 28,104 మంది ఉండగా, ఎక్కువ మంది వర్గీకరణ అంశానికి ప్రభావితమయ్యారని వారు వివరించారు. తమ సామాజికవర్గం ఓట్లు టీడీపీ అభ్యర్థి స్వామికి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి అనుకూలంగా పడ్డాయన్న భావనను వారు వ్యక్తం చేశారు. అదేవిధంగా కొండపి ఎమ్మెల్యే స్వామిని మర్రిపూడి, కొండపి, సింగరాయకొండ, పొన్నలూరు, టంగుటూరు, జరుగుమల్లి మండలాలకు చెందిన పలు గ్రామాల నాయకులు ఉదయం నుంచి కలిసి ఎక్కడికక్కడ స్థానికంగా పోలింగ్ సరళి, విజయావకాశాలపై చర్చిస్తూనే ఉన్నారు. వైద్యశాలకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోవాలని స్వామి భావించినా జనం రాకతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని చర్చల్లో నిమగ్నమయ్యారు.

అవీ..ఇవీ..

ఓటర్లకు, కూటమి నేతలకు మాగుంట కృతజ్ఞతలు

ఒంగోలు(కలెక్టరేట్), మే 14 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి గెలుపు కోసం తనకు తోడుగా ఉండి అన్ని విధాలుగా సహకరించి పనిచేసిన నేతలు, కార్యకర్తలకు ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఒంగోలు పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల కోసం పనిచేసిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మరో వైపు సోమవారం జరిగిన పోలింగ్‌లో పోలింగ్ కేంద్రాలకు పురుషులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓట్లు వేయడం పట్ల మాగుంట ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో అఖండ విజయాన్ని కైవసం చేసుకుంటానని మాగుంట పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా ఎంతో సమన్వయంతో పనిచేసిన కూటమి నేతలను అభినందించారు.

రేపటి నుంచి ఏకేయూ పరీక్షలు

ఒంగోలు(విద్య), మే 14 : ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీ లా విభాగం పరీక్షలు ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి కేవీఎన్.రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలోని లా కళాశాలల్లో మూడు, ఐదు సంవత్సరాల ఎల్ఎల్‌బీ కోర్సు, రెండు సంవత్సరాల ఎల్ఎల్ఎం కోర్సు చదువుతున్న ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ఈనెల 24వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మార్కాపురంలోని ఐడీఎల్, కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యూనివర్సిటీ ఆవిర్భావం తర్వాత లా కోర్సులకు సంబంధించిన పరీక్షలను మొదటిసారి నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాజు తెలిపారు. పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారన్న సమాచారాన్ని మాత్రం గోప్యంగా ఉంచారు. లా కోర్సుల్లో పరిమిత సంఖ్యలో మాత్రమే విద్యార్థులు చేరడంతో ఆ సమాచారాన్ని మాత్రం బయటకు వెల్లడించలేదు.

22నుంచి ఉచిత శిక్షణ

ఒంగోలు(కలెక్టరేట్), మే 14: ఒంగోలులోని రూడ్ సెట్ సంస్థలో ఈనెల 22నుంచి పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు 19నుంచి 45 ఏళ్లలోపు యువకులు అర్హులని పేర్కొన్నారు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వారై గ్రామీణ ప్రాంతనిరుద్యోగ యువకులు అర్హులన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలని, శిక్షణ కాలంలో వసతి, భోజన సౌకర్యం ఉచితంగా కల్పిస్తామని, వివరాలకు 9492583484 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

గ్రామ పంచాయతీలపై బకాయిల బండ

● ఆవేదనలో సర్పంచ్‌లు

మద్దిపాడు, మే 14: గ్రామ పంచాయతీలు విద్యుత్ బిల్లుల భారంతో సతమతమవుతున్నాయి. పంచాయతీలకు కేటాయించిన నిధులు సర్కారు పక్కదారి పట్టించిందంటూ సర్పంచ్‌లు గతంలో గగ్గోలు పెట్టారు. పంచాయతీ ఖాతాలో కాసులు కానరాక పల్లె ప్రగతి పడకేసింది. కేంద్ర ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు తప్పితే రాష్ట్ర ప్రభుత్వ నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని పలువురు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్ శాఖ నోటీసులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ విడుదల చేసే నిధులు ఆయా పంచాయతీల పారిశుధ్య నిర్వహణ, ఇతర అభివృద్ధిలకు ఖర్చు చేసేది. జగన్ అధికారంలోకి వచ్చాక పంచాయతీలను నిర్వీర్యం చేశారు. పంచాయతీలు, సచివాలయాలు వేరు అని చెప్పిన సచివాలయాలు నిర్వహణ ఖర్చులు సైతం ఒక్కొక్క సమయంలో పంచాయతీలపై మోపింది. పైగా వాటికి విడుదలైన ఆర్థిక సంఘం నిధులు సర్పంచ్‌లు, కార్యదర్శులకు సంబంధం లేకుండా దొడ్డిదారిని తీసుకొని విద్యుత్ బకాయిలు చెల్లించింది. మద్దిపాడు మండలంలో 23 పంచాయతీల్లో నిధులు లేక సర్పంచ్‌లు అభివృద్ధి పనులు చేయలేక ఈ పదవులు కేవలం అలంకారప్రాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో భారీ పోలింగ్

● 87.55శాతంగా నమోదు

ఒంగోలు(కలెక్టరేట్), మే 14: సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో భారీగా పోలింగ్ జరిగింది. 87.55శాతంగా నమోదైంది. నియోజకవర్గంలో 2,14,638 మంది ఓటర్లు ఉండగా 1,87,912 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 92,708 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, మహిళలు 95,202 మంది తమ ఓటు వేశారు. థర్డ్ జెండర్ ఇరువురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

టెన్త్ విద్యార్థులకు పురస్కారాలు



మాట్లాడుతున్న కృష్ణారావు

ఒంగోలు (కార్పొరేషన్), మే 14 : జైశ్రీకృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పదో తరగతిలో ప్రతిభ చాటిన బీసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు సమితి వ్యవస్థాపకుడు ద్రావిడదేశం వి.కృష్ణారావు తెలిపారు. మంగళవారం ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు పురస్కారం అందించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 మండలాలకు సంబంధించిన యాదవ విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించినలో మొదటి ముగ్గురుకు ప్రథమ బహుమతి రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు, మూడవ బహుమతిగా రూ.1000 అందిస్తామని, ప్రతి ఒక్కరికీ కాలేజీ బ్యాగ్ ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే సీబీఎస్ సిలబస్‌లో కూడా ప్రతిభ చాటిన వారికి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమ వివరాలు త్వరలోనే తెలియజేస్తామన్నారు. వివరాలకు సెల్: 9381003348, 7680972666 నంబర్ల ద్వారా తెలుసుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, అడకా స్వాములు, బంకా చిరంజీవి, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపి నియోజకవర్గంలో 88.21శాతం పోలింగ్

కొండపి, మే 14 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం నియోజకవర్గంలో 88.21శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమేరకు ఈఆర్వో ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,39,609 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,18,624 మంది, మహిళలు 1,20,982 మంది, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అందులో 1,05,174మంది పురుషులు, 1,06,174మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లుతో కలిపి మొత్తం 2,11,350 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని కొండపి, జరుగుమల్లి, టంగుటూరు, మర్రిపూడి, పొన్నలూరు మండలాల్లోని గ్రామాల్లో సరిసరిన 90శాతం పోలింగ్ జరిగింది. సింగరాయకొండ మండలంలోని పలు పోలింగ్ బూత్‌ల్లో 65నుంచి 80శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఈఆర్వో వెల్లడించారు.

టంగుటూరులో 82.8 శాతం..

టంగుటూరు, మే 14 : మండల కేంద్రమైన టంగుటూరులో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 82.8శాతం పోలింగ్ నమోదైంది. టంగుటూరులో 17 పోలింగ్ కేంద్రాలున్నాయి. వాటిలో మొత్తం 13,401 ఓట్లు ఉండగా 11,101 (82.8 శాతం) పోలయ్యాయి. పోలింగ్ బూత్ నెంబర్ 192లో మొత్తం ఓట్లు 572 కాగా అందులో 514 (89.8శాతం)మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. బూత్ నెంబర్ 193లో ఉన్న 370ఓట్లలో 340 (91.8శాతం) పోలయ్యాయి. బూత్ నెంబర్ 194లో 887 ఓట్లు ఉండగా 733 (82.6శాతం) మంది ఓటు వేశారు. బూత్ నెంబర్ 195లో 720 ఓట్లు ఉండగా 575 (79.8శాతం) ఓట్లు పోలయ్యాయి. బూత్ నెంబర్ 196లో ఉన్న 667 ఓట్లలో 531 (79.6శాతం) మంది ఓటు వేశారు. 197లో 767 ఓట్లు ఉండగా 628 (81.8శాతం) ఓట్లు, 198లో ఉన్న 904 ఓట్లలో 730 (80.7శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. బూత్ నెంబర్ 199లో ఉన్న 1,136 ఓట్లలో 881 (77.5శాతం) పోలయ్యాయి. బూత్ నెంబర్ 200లో మొత్తం ఓట్లు 1,011 ఉండగా 791 (78.2శాతం) మంది ఓటు వేశారు. బూత్ నెంబర్ 201లో ఉన్న 813 ఓట్లలో 707 (86.9శాతం) పోలయ్యాయి. పోలింగ్ బూత్ నెంబర్ 202లో 821ఓట్లు ఉండగా 715 (87శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. బూత్ నెంబర్ 203లో ఉన్న 979 ఓట్లలో 792 (80.8శాతం) పోలయ్యాయి. బూత్ నెంబర్ 204లో ఉన్న మొత్తం 1,045 ఓట్లలో 896 (85.7శాతం) మంది ఓటు వేశారు. బూత్ నెంబర్ 205లో ఉన్న 363 ఓట్లలో 296 (81.5శాతం) పోలయ్యాయి. బూత్ నెంబర్ 206లో మొత్తం 1,240 ఓట్లు ఉండగా 1,020 (82.2 శాతం) మంది ఓటేశారు. బూత్ నెంబర్ 207లో 634 ఓట్లు ఉండగా 517 (81.5.శాతం) ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ బూత్ నెంబర్ 208లో మొత్తం 472 ఓట్లు ఉండగా 435 (92.1శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వలస ఓటర్ల ఓటెటు..?

● పార్టీ నాయకుల్లో విస్తృత చర్చ



ఓటు వేసేందుకు భారీగా హైదరాబాద్ నుంచి బయలుదేరిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

కొండపి, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌కు కొండపి నియోజకవర్గానికి చెందిన వలస ఓటర్లు భారీగా తరలివచ్చారు. పండుగకు వచ్చినట్లే సొంతూర్లకు చేరుకొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో వారి ఓటు ఎటువైపు వేశారన్న చర్చ రెండు ప్రధాన పార్టీల నేతల మధ్య విస్తృతంగా నడుస్తోంది. కొండపి నియోజకవర్గంలో దాదాపు 20 వేల మందికి పైగా వలస ఓటర్లు ఉన్నారు. వీరిలో అత్యధిక మందితోపాటు ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న ఎన్నారైలు కూడా మరో ఐదు వందల మందికి పైగా వచ్చి ఓట్లేశారు. ఎన్నారైలు మాత్రం అంతదూరం నుంచి వచ్చింది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసేందుకేనని తేటతెల్లం కాగా, ఇతర రాష్ట్రాల్లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఇదే దారిలో నడిచే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇకపోతే వ్యాపారులు, బేల్దారి పనులు చేసే కూలీలు భారీగా వచ్చారు. దీంతో కొండపి, మర్రిపూడి, జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో పోలింగ్ శాతం పెరిగింది. ఇప్పుడు వీరు ఏపార్టీకి ఓటేశారన్న విషయంపై నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. ముందుగానే వలస ఓటర్లకు పార్టీలు చార్జీలకు డబ్బులు ఇచ్చాయి. దీంతో ఏపార్టీకి ఆపార్టీ తమకే ఓటు వేశారని భావిస్తున్నా, తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీ ప్రభావం కూడా వీరిపై ఉందని అంటున్నారు. 2019 ఎన్నికలప్పుడు అప్పటి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్న వలస ఓటర్లు.. తాజాగా తెలంగాణలో అధికార పార్టీ మార్పునకు అనుగుణంగా ఆలోచనలు మార్చుకున్నారని అంటున్నారు. మొత్తంగా వలస ఓటర్లు తిరిగి వెళ్లిపోయారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది వచ్చారు. ఇప్పుడు ఓటింగ్ అయిపోయి వారు వెళ్లిపోయాక అధికార పార్టీ తీసుకువచ్చిన వారు కూడా వారికి వ్యతిరేకంగా ఓటు వేశారనే అనుమానాలు రావడంతో ఆందోళన చెందుతున్నారు. అవన్నీ ఏవేవో ఊహాగానాలే. తాము డబ్బులు ఇచ్చి పిలిపిస్తే వ్యతిరేకంగా ఓట్లు ఎందుకు వేస్తారులే? అని సమాధాన పరుచుకుంటున్నారు.

పల్లెపాలెంలో వైసీపీ దాడులు

● టీడీపీ వర్గీయుడికి గాయాలు


గాయపడిన దుర్గాప్రసాద్

కొత్తపట్నం(ఒంగోలు నగరం), మే 14: మండలంలోని కొత్తపట్నం పల్లెపాలెం గ్రామంలో ఎన్నికల అనంతరం వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. మంగళవారం సాయంత్రం వారి దాడిలో తెలుగుదేశం పార్టీకి చెందిన యువకుడికి గాయాలయ్యాయి. ఎన్నికల పోలింగ్ సందర్భంగా గ్రామంలో సోమవారం ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. గతంలో వైసీపీకి అనుకూలంగా ఉన్న కొన్ని కుటుంబాలు ఈ ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇచ్చాయి. ఇది జీర్ణించుకోలేని కొందరు వైసీపీ నాయకులు మంగళవారం స్థానికంగా వారిపై దాడులకు దిగారు. ఇరువర్గాల మధ్య మంగళవారం మధ్యాహ్నం, సాయంత్రం రెండుసార్లు ఘర్షణ జరిగింది. దాడిలో తెలుగుదేశం పార్టీకి చెందిన వల్లభుని దుర్గాప్రసాద్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో స్థానికులు అతనిని చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. గ్రామంలో ఇంకా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో కొత్తపట్నం ఎస్ఐ సాంబశివరావు తన సిబ్బందితో పల్లెపాలెం చేరుకుని శాంతిభద్రతలను పర్యవేక్షించారు. బాధితుడి ఒంగోలు రిమ్స్ అవుట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గెలుపు బాటలో మీరే భాగస్వాములు

టీడీపీ శ్రేణులకు కృతజ్ఞతలు చెప్పిన డాక్టర్ ఉగ్ర

కిక్కిరిసిన అమరావతి సభా ప్రాంగణం


కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, మే 14 : గెలుపు బాటలో మీరే భాగస్వాములని ఎన్డీయే కూటమి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మంగళవారం జరిగిన సభలో డాక్టర్ ఉగ్ర కార్యకర్తలు, నాయకులకు, శ్రేణులకు కృతజ్ఞతలు చెప్పారు. టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలవబోతుందంటూ నియోజవర్గంలోని వివిధ మండలాల్లోని నలుమూలల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి డాక్టర్ ఉగ్రకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఐదేళ్లుగా ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్న కార్యకర్తలు, నాయకుల కష్టానికి నిన్న జరిగిన ఎన్నికలు ఓ గుర్తింపుగా మారనున్నాయన్నారు. ప్రతి కార్యకర్త తానే పోటీలో ఉన్నట్లుగా భావించి అలుపెరగని కష్టం చేశారని కొనియాడారు. గతంలో కనిగిరి నియోజకవర్గం అంటేనే కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదన్నారు. అలాంటిది 2019 ఎన్నికల్లో వైసీపీ గాలిలో ఓటమి చెందానని చెప్పారు. ఆ కసిని నిన్నటి ఎన్నికల్లో టీడీపీ సైన్యం చూపించిన తీరు అభినందనీయమన్నారు. గతంలో ఎన్నడూ జరగని రీతిలో పోలింగ్ జరగటం టీడీపీ గెలుపునకు ప్రధాన సూచిక అని చెప్పారు. జూన్ 4న కౌంటింగ్ అనంతర విజయోత్సవ సభను జరుపుకుందామన్నారు. డాక్టర్ ఉగ్రను కలిసేందుకు వచ్చిన వారితో అమరావతి ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

పలు రైళ్లు రద్దు

గిద్దలూరు, మే 14 : గుంటూరు-గుంతకల్లు రైలు మార్గంలో రైల్వే డబ్లింగ్ పనుల నేపథ్యంలో రెండు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గిద్దలూరు మీదుగా తిరిగే రెండు రైళ్లను రద్దు చేశారు. హుబ్లీ-గిద్దలూరు- విజయవాడ (17329) రైలును ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు, విజయవాడ-గిద్దలూరు-హుబ్లీ (17330) రైలును ఈ నెల 17 నుంచి జూన్ 1 వరకు, గుంటూరు-గిద్దలూరు-కాచీగూడ (17251) రైలును ఈ నెల 16 నుంచి 31వరకు, కాచీగూడ-గిద్దలూరు-గుంటూరు(17252) రైలును ఈ నెల 17 నుంచి జూన్ 1వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు.

దర్శిలో అత్యధికంగా 90.91 శాతం పోలింగ్

దర్శి, మే 14 : దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 90.91 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కంటే ఇక్కడే అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,26,370 మంది ఓటర్లు ఉండగా 2,05,792 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 1,03,931 మంది ఓటు వేయగా మహిళలు 1,01,860 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడవ రకంకు చెందిన ఒక ఓటు నమోదైంది. నియోజకవర్గంలో అత్యధికంగా దర్శి మండలంలోని చిన్నఉయ్యాలవాడ పోలింగ్ బూత్‌లో 98.64 శాతం పోలింగ్ నమోదైంది. అతి తక్కువగా దర్శి పట్టణంలోని 113 నెంబరు బూత్‌లో 68.59 శాతం ఓట్లు పోలయ్యాయి. దర్శి మండలంలో మొత్తం 72,888 మంది ఓటర్లు ఉండగా 64,372 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలోనే అత్యధికంగా నియోజకవర్గంలో పోలింగ్ నమోదు కావటంతో రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారోనని అంచనా వేస్తున్నారు.

కురిచేడులో అర్ధరాత్రి వరకు ఓటింగ్

కురిచేడు, మే 14 : సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సోమవారం అర్ధరాత్రి వరకూ వేచి ఉన్నారు. కురిచేడు మండలంలో మొత్తం 32,330 మంది ఓటర్లు ఉండగా వారిలో 29,390 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 90.90 ఓటర్ల శాతం నమోదైంది. గంగదొనకొండ 74వ పోలింగ్ స్టేషన్లో 97.63 శాతం ఓట్లు నమోదై మండలంలో అత్యధికంగా ఓటింగ్ జరిగిన గ్రామంగా నిలిచింది.

వెంగముక్కపాలెంలో ఉద్రిక్తత

టీడీపీ వర్గీయుల ఇంటిపై వైసీపీ మూకల దాడి ● నాలుగు కేసులు నమోదు చేసిన పోలీసులు ● పికెట్ ఏర్పాటు


గ్రామంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న పోలీసు అధికారి

ఒంగోలు(క్రైం), మే 14: ఎన్నికల పోలింగ్ ప్రారంభం నుంచి వెంగముక్కపాలెంలో వైసీపీ నేతల హల్‌చల్‌తో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సోమవారం ఉదయం నుంచి బాలినేని శ్రీనివాస రెడ్డి కోడలు కావ్యారెడ్డి గ్రామంలో గల పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని అక్కడి టీడీపీ వర్గీయులు ఆరోపించారు. దీంతో మొదట వలేటి ధనలక్ష్మీపై కావ్యారెడ్డి పక్కనే ఉన్న వైసీపీ మూకలు దాడిచేశారు. అదేక్రమంలో మరలా సాయత్రం ఆరు గంటల తర్వాత కూడ కావ్యారెడ్డి పోలింగ్ బూత్‌లోకి వెళ్లడం, టీడీపీ ఏజెంట్‌ను బెదిరించడంతో మరలా వివాదం నెలకొంది. అలాగే వలేటి ధనలక్ష్మీ కుమారుడు అఖిల్‌పై దాడి చేశారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు ధనలక్ష్మి కుమారుడు అఖిల్, కుమార్తె స్రవంతిలు ఆసుపత్రికి వెళ్లి అర్ధరాత్రి ఇంటికి తిరిగి వచ్చారు. ఆ సమయంలో వైసీపీ మూకలు వారి ఇంటికి వెళ్లి గందరగోళం సృష్టించారు. ఇంటి కిటికీ అద్దాలు పగలకొట్టడంతో పాటుగా ఇంట్లో ఉన్న స్రవంతి, అఖిల్‌ను చంపుతామని బెదిరించారు. అడ్డుకున్న చుట్టుపక్కల వారిపై దౌర్జన్యం చేశారు. ఇలా ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా టీడీపీ వర్గీయులపై వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. అంతేకాకుండా ఒకే కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని రాత్రి పొద్దుపోయే వరకు దాడులు కొనసాగించారు. ఈ నేపథ్యంలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడు కేసులు నమోదు చేసినట్లు తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి తెలిపారు. అలాగే వైసీపీ వర్గీయుడు అమర్నాథ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధనలక్ష్మిపై కౌంటర్ కేసు దాఖలు చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో వెంగముక్కపాలెంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. కాగా సమాచారం అందుకున్న దామచర్ల జనార్దన్ మంగళవారం సాయంత్రం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ తరుపున అందరం అండగా ఉంటామని వారికి భోరసా కల్పించారు.

నిలకడగా పొగాకు మార్కెట్

కిలో రూ.300తో గరిష్ఠ ధర ● బ్రౌన్, పచ్చలకు భారీ డిమాండ్

అన్నిరకాల బేళ్ల కోసం పోటీపడుతున్న బయ్యర్లు ● ఇప్పటిదాకా 46 మిలియన్లు కొనుగోలు

కిలో రూ.238.78 లభించిన సగటు ధర ● పలు కేంద్రాల్లో వేలాన్ని పరిశీలించిన బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్


వెల్లంపల్లిలో పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

ఒంగోలు, మే 14(ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్‌లో హాట్‌హాట్ వాతావరణం కొనసాగుతోంది. మేలురకంతోపాటు బ్రౌన్, పచ్చరకాలకు కూడా భారీగా ధరలు లభిస్తున్నాయి. దాదాపు పది రోజులుగా మేలురకం కిలో గరిష్ఠ ధర రూ.300లపై నిలకడగా ఉంటుండగా బ్రౌన్ రకం కిలో రూ.260 నుంచి రూ.270 వరకు ఉంది. అయితే లోగ్రేడ్‌లో ముఖ్యమైన పచ్చరకం బేళ్లు వారంక్రితం వరకు కిలో రూ.205 అటుఇటుగా ఉండి, ఎక్కువగా నోబిడ్‌లు అయ్యాయి. అయితే రెండు, మూడు రోజులుగా తిరిగి ఆ రకం బేళ్లకు కూడా డిమాండ్ వచ్చింది. మళ్లీ వాటి ధరలు కూడా కిలో రూ.225 నుంచి రూ.230 వరకు పలుకుతున్నాయి. అలా అన్నిరకాల గ్రేడ్లకు మంచి ధరలే లభించడంతోపాటు బేళ్ల కోసం పలు కంపెనీల బయ్యర్లు పోటీ పడుతున్నారు. అలా గరిష్ఠ ధరలు నిలకడగా సాగుతూ బేళ్ల కోసం బయ్యర్లు పోటీ పడుతుండటంతో పొగాకు రైతులు ఉత్సాహంగా కనిపిస్తున్నారు. ఇక ఇప్పటివరకు ఈ సీజన్‌లో లభించిన సగటు ధర కూడా రైతులను ఆనందపరుస్తోంది. సుమారు 46 మిలియన్ కిలోలు ఇప్పటిదాకా దక్షిణాది వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.238.78 లభించింది. ఈ ప్రకారం చూస్తే ఈ సీజన్ ముగిసే నాటికి సగటు ధర కిలో రూ.260 వరకు చేరవచ్చని అంచనా. ఇదిలా ఉండగా పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబులు మంగళవారం పలు వేలంకేంద్రాలను సందర్శించారు. ఒంగోలు-1, ఒంగోలు-2, వెల్లంపల్లి, టంగుటూరు కేంద్రాలను సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. దక్షిణాది మార్కెట్ కొనుగోళ్ల తీరు, ఆయా గ్రేడ్‌లవారీ లభిస్తున్న ధరలను ఆ సందర్భంగా ఒంగోలు ఆర్ఎం లక్ష్మణరావు వారికి వివరించారు. అలాగే రైతులతోనూ వారు మాట్లాడారు.

తెలుగుదేశం శ్రేణులపై వైసీపీ దాడుల పరంపర


మార్కాపురంలో పరిస్థితి అదుపు చేస్తున్న పోలీసులు

కొమరోలు, మే 14: మండలంలోని చింతలపల్లి గ్రామంలో సోమవారం జరిగిన ఎన్నికల నేపథ్యం లో వైసీపీ నాయకులు టీడీపీ పోలింగ్ ఏజెంట్లపై దాడిచేసి గాయపరిచారు. గ్రామానికి చెందిన కొంకాల కొండయ్య, కొంకాల నరసింహులు చింతలపల్లి పంచాయతీలోని కూరాకువానిపల్లి గ్రామంలోని పోలింగ్‌బూత్‌లో ఏజెంటుగా ఉన్నారు. రిలీఫ్ కోసం బయటకు వచ్చాడు. ఈ క్రమంలో స్థానిక వైసీపీ నాయకులు అయన్ను కర్రలతో దాడులచేసి తీవ్రంగా గాయపరిచారు. వారిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సోమవారం రాత్రి వైద్యశాల నుంచే పోలీసులకు మాపై దాడిచేసిన ఏడు మందిపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులు బయటకు రావా లంటేనే ఇబ్బందులు పడుతు న్నామని ఫిర్యాదు చేశారు. ఈ రోజు అదే గ్రామానికి చెందిన వాలంటీర్ మన్నె సుశీల్ అనే వ్యక్తి నన్ను కులం పేరుతో దూషించారని గాయపడ్డ వారితో కలసి ఏడు మందిపె పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు ఎస్సై ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నారు. సీఐ దాసరి ప్రసాదు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా నిఘా ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి కొమరోలు పోలీసుస్టేషన్ నుంచి వెళ్తుండగా వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తపై దాడి చేయటంతో ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని చెల్లాచెదురు చేశారు.

మార్కాపురంలో స్వల్ప ఘర్షణ

మార్కాపురం: ఎన్నికల ముగిసిని నేపథ్యంలో మార్కాపురంలో మంగళవారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పోలింగ్ జరిగిన సోమవారం సాయంత్రం స్థానిక రెడ్డి కళాశాల బూత్ వద్ద జరిగిన ఘర్షణలో జవహర్‌నగర్ కాలనీ, తూర్పువీధికి చెందిన యువకులు గొడవపడ్డారు. రెండు పార్టీలకు చెందిన వాళ్లు కొట్టుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి అదుపు చేశారు. కానీ రెండు ప్రాంతాలకు చెందిన వాళ్లు ఉదయం, సాయంత్రం వేళల్లో సెవెన్‌హిల్స్ సమీపంలోని దుకాణాల వద్ద ఉంటారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి టీడీపీ వర్గీయులు కూర్చుని ఉన్న ఒక దుకాణం వద్దకు వచ్చి వైసీపీ వర్గీయులు గొడవ పెట్టుకున్నారు. మీ అంతు చూస్తామంటూ వాగ్వివాదానికి దిగారు. చుట్టుపక్కల ఉన్నవాళ్లు వెంటనే పోలీసులుకు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఎస్సై అబ్దుల్ రెహమాన్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. అంతేకాక ఆ చుట్టుపక్కల ఉన్న దుకాణాలను మూసివేయించి అక్కడ పోలీసు పికెట్ ఏర్పాటు చేయించారు.

పోతవరంలో..

పొదిలి : పోతవరం గ్రామంలో టీడీపీ కార్యకర్త పి.మరియదాస్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. టీడీపీకి ఓటు వేశానని తెలుసుకొని వైసీపీకి చెందిన పలువురు తనను కొట్టినట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రెండు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారు. అనంతరం మరియదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.కోటయ్య తెలిపారు.

టీడీపీ ప్రభంజనాన్ని ఓర్వలేకే దాడులు : ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం: టీడీపీ ప్రభంజనాన్ని ఓర్వలేకనే వైసీపీ అల్లరిమూకలు దాడులకు తెగబడుతున్నాయని టీడీపీ వై.పాలెం కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు ఆరోపించారు. మంగళవారం వాదంపల్లి గ్రామంలో టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ మూకలు దాడి చేశాయి. ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్న టీడీపీ కార్యకర్తలను గూడూరి ఎరిక్షన్‌బాబు సాయంత్రం పరామర్శించారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు టీడీపీ భయపడదన్నారు. టీడీపీ గెలుపును ఆపలేరని, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఓటమిని ఒప్పుకోక తప్పదన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, నాయకులు ఉన్నారు.


ఈవీఎంలు భద్రపరిచిన గదికి సీలు వేసి సంతకం చేస్తున్న కలెక్టర్


ఈవీఎంలను అందజేస్తున్న పోలింగ్ సిబ్బంది

భద్రతావలయంలో ఈవీఎంలు !

● కలెక్టర్, ఎస్పీ పరిశీలన


ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్


ప్రధాన ద్వారం వద్ద సిబ్బంది పహారా

ఒంగోలు(కలెక్టరేట్), మే 14: పోలింగ్ ముగిసిన అనంతరం నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఈవీఎంలను ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో భద్రపర్చారు. ఈవీఎంలను ఆయా స్ట్రాంగ్ రూములలో భద్రపర్చిన అనంతరం సీల్ వేశారు. నిరంతరం పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పర్యవేక్షించారు.

దర్శిలో వైసీపీ బరితెగింపు

టీడీపీ శ్రేణులపై విచక్షణారహితంగా దాడులు

అసహ్యించుకుంటున్న ప్రజలు


బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మే 14 : దర్శి నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా వైసీపీ మూకలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడటం పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను వైసీపీ ఉద్దేశపూర్వకంగా రక్తమయం చేసి అనేక గ్రామాల్లో దాడులు, దౌర్జన్యాలు నిరాటంకంగా జరిగిన విషయం తెలిసిందే. మండలంలోని బొట్లపాలెంలో వైసీపీశ్రేణులు చేసిన దాడిలో సమిడిశెట్టి శ్రీనివాసరావు, బత్తెన నరేంద్ర తలలకు తీవ్ర గాయాలుకాగా మరి కొంతమంది గాయపడ్డారు. గాయపడిన వారిని రక్షించుకునేందుకు అక్కడకు వెళ్లిన టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని దుర్భాషలాడారు. దాడులను ఖండిస్తూ ఆమె రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసినప్పటికీ పోలీస్ అధికారుల్లో మార్పురాలేదు. పోలీసులు వైసీపీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహించినందున వైసీపీ గూండాలు యథేచ్ఛగా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ ముందుకు రోజు బొట్లపాలేనికి చెందిన తెలుగుయువత నాయుడు కల్లూరు సుబ్బుపై దాడి చేసిన విషయం తెలిసిందే. అప్పుడే పోలీసులు దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసివుంటే మరుసటి రోజు ఇంత దారుణం జరిగేది కాదు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహించినందున సుబ్బుపై దాడులు చేసిన వ్యక్తులతో పాటు మరికొందరు కలిసి పోలింగ్ రోజు టీడీపీ కార్యకర్తలపై మారణాయుధాలు, కర్రలతో దాడులు చేశారు. దర్శి పట్టణంలోని ఆర్‌ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఓట్లు వేసిన పోలింగ్ తీరును పరిశీలించేందుకు వెళ్లిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిపై దాడికి యత్నించారు. ఆమె కారుపై రాళ్లు వేశారు. ఇంత జరుగుతున్నా అక్కడున్న పోలీసులు ఆ దాడిని నిలువరించలేక ప్రేక్షకపాత్ర పోషించారు. మహిళా అభ్యర్థిపై రాళ్ళదాడులకు పాల్పడుతున్న వైసీపీ మూకలను నిలువరించేందుకు టీడీపీ కార్యకర్తలు గట్టిగా ఎదుర్కొనటంతో పోలీసులు టీడీపీ వారిపై లాఠీచార్జి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు వీసీరెడ్డిపై దాడి చేసిన వారిని వదిలేసి ఈవీఎం పగలగొట్టారన్న నెపంతో ఆయన పైనే కేసు పెట్టారు. వాస్తవంగా ఈవీఎం పగులలేదు. టెక్నికల్ సిబ్బంది సహకారంతో బాగు చేయించి పోలింగ్ నిర్వహించారు. పోలీసులు ఏక పక్షంగా కేసు నమోదు చేశారు. ఎర్రఓబన్నపల్లెలో వైసీపీ నాయకులు టీడీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు లాక్కొచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు టీడీపీ కేడర్‌పై దాడులకు తెగబడ్డారని ప్రజలు చెబుతున్నారు.

మూడు కేసుల నమోదు

దర్శి కూటమి అభ్యర్థిపై రెండు.. ఇంకొకటి మరొక కార్యకర్తపై

బాధితులపైనే రివర్స్ కేసులు

దర్శి, మే 14 : మండలంలో పోలింగ్ సందర్భంగా జరిగిన ఘటనలపై మంగళవారం పోలీసులు ఏకపక్షంగా టీడీపీ వర్గీయులపై మూడు కేసులు బనాయించారు. బొట్లపాలెంలో వైసీపీ మూక టీడీపీ వారిపై దాడి చేసి గాయపరిచారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బాధితులను అండగా నిలిచేందుకు అక్కడకెళ్లి దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని శాంతియుతంగా నిరసన తెలిపారు. పోలీసులు దాడులు చేసిన వారిని పక్కనబెట్టి ధర్నా చేశారన్న నెపంతో ఆమెతోపాటు మరికొందరుపై కేసు నమోదు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నేత వీసీరెడ్డిపై దాడి చేసిన వారిని వదిలేసి ఈవీఎం పగులగొట్టాడని పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. దర్శి-కురిచేడు రోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించేందుకు అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని అకారణంగా అడ్డుకుని కారుపై రాళ్లతో దాడి చేశారు. ఆమెను రక్షించేందుకు టీడీపీ వర్గీయులపై ఎదురుతిరిగారు. టీడీపీ వర్గీయులపై పోలీసులు లాఠీచార్జి చేసి వారే రాళ్లు రువ్వారని దర్శి పట్టణ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు మరికొందరిపై కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా జరిగిన మూడు సంఘటనలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

లింగన్నపాలెంలో టీడీపీ కార్యకర్తపై దాడి

పీసీపల్లి, మే 14 : మండలంలోని లింగన్నపాలేనికి చెందిన టీడీపీ కార్యకర్త బాలిబోయిన మల్లికార్జునపై లక్ష్మక్కపల్లికి చెందిన వైసీపీ కార్యకర్తలు మంగళవారం దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. మల్లికార్జున గత సర్పంచ్ ఎన్నికల సమయంలో వైసీపీకి మద్దతుగా నిలిచాడు. కనిగిరి టీడీపీ అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డిపై అభిమానంతో సార్వత్రిక ఎన్నికల ముందు తన గ్రామంలోని 30కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున ఉగ్ర నరసింహారెడ్డికి మద్దతుగా చురుగ్గా పనిచేశాడు. అది జీర్ణించుకోలేని వైసీపీ కార్యకర్తలు కక్ష పెంచుకున్నారు. మల్లికార్జున మంగళవారం లక్ష్మక్కపల్లికి వెళ్లాడు. ఆ సమయంలో మల్లికార్జునను చూసిన కొంతమంది వైసీపీ కార్యకర్తలు అతన్ని దూషిస్తూ ఒక్కసారిగా దాడిచేశారు. దీంతో బాధితుడు పీసీపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. కాగా తమపై మల్లికార్జునే దాడి చేశాడంటూ ప్రత్యర్థులు కూడా పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్సై రమేష్‌బాబును వివరణ కోరగా ఇరువర్గాలు ఫిర్యాదు చేశారని, విచారించి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

దర్శి అభ్యర్థి లక్ష్మి నివాసంలో కోలాహలం


లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌తో నేతలు

దర్శి, మే 14 : నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ తీరు విజయావకాశాలపై తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల వద్దకు నాయకులు, కార్యకర్తలు వెళ్లి మంగళవారం ఎన్నికలు జరిగిన తీరుపై చర్చించారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ ఇంటికి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు వచ్చారు. గ్రామాల్లో జరిగిన పోలింగ్ తీరును వివరించారు. మొత్తంమీద టీడీపీకి అనుకూలంగా ఓటింగ్ జరిగిందని, ఖచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మెజార్టీపై అంచనాలు వేశారు. గ్రామస్థాయి నాయకులు ఇచ్చిన సమాచారం ప్రకారం టీడీపీ గెలుస్తుందనే ధీమా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతుండటంతో పార్టీ కేడర్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వేసవి సాగుకు సిద్ధమవుతున్న రైతాంగం



పత్తి సాగుకు భూమిని సిద్ధం చేస్తున్న రైతు

- పత్తి విత్తేందుకు భూమిని చదును చేస్తున్న రైతులు
- ఏటా నష్టాలే మిగిలిస్తున్నప్పటికీ, మరోసారి ఆశల సాగుకు..

పెద్ద దోర్నాల, మే 14: మండలంలోని రైతాంగం వేసవి సాగుకు సన్నద్ధమవుతోంది. వాతావరణం చల్లబడుతుండడంతో పలు చోట్ల రైతులు భూములను దుక్కులు చేసి పశువుల ఎరువులు వేసి సారవంతం చేస్తున్నారు. జూన్ మాసం ఆరంభంలో తొలకరి వార్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ ప్రకటనతో పాటు ఇటీవల కురిసిన మోస్తరు వానతో ఎండలు తగ్గుముఖం పట్టాయి. కొద్దోగొప్పో నీరున్న బోరుబావుల కింద వేసవి సాగు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అధిక శాతం రైతులు సాధారణంగా తమకున్న వ్యవసాయ భూముల్లో సగ భాగం పత్తి, మరో సగ భాగం మిరప సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. వేసవి, ఖరీఫ్ సీజను మొదటి భాగం జూన్, జులైలో తక్కువ పెట్టుబడితో పత్తిసాగు చేసి ఆ పంటపై వచ్చే ఆదాయంతో ఖరీఫ్ రెండో భాగం ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో మిరప సాగు చేపడతారు. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు రైతులు పత్తి విత్తేందుకు పొలాలను సిద్ధం చేశారు. వారం పది రోజుల్లో పత్తి విత్తేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండలంలో వేసవిలో సుమారు 500 ఎకరాల్లో పత్తిసాగు చేయనున్నట్లు రైతులు తెలిపారు. పరిస్థితులను బట్టి ఖరీఫ్‌లో మరో 700ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉంది.

గిట్టుబాటు ధరలుపై అయోమయం

గతేడాది పత్తి సాగు చేసిన రైతులు నష్ట పోయారు. వేసవిలో సాగు చేసిన పత్తికి నీటి కొరత కారణం కాగా, ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తికి గిట్టుబాటు ధరలు లేక వర్షాలు తగిన స్థాయిలో కురవక పోవడం, నివారణ కాని తెగులు సోకి పంట దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్ట పోయారు. అయినప్పటికీ, ఏమి చేయాలో పాలుపోక ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర లభించకపోదా..? అన్న ఆశతో ఉన్న భూమి మొత్తం మిరప సాగు చేయలేమని పత్తి సాగుకు ఉపక్రమిస్తున్నారు. అపరాలు సాగు చేద్దామన్నా విత్తనాల ఖర్చు కూడా రాదని మదనపడుతున్నారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చు

ఎకరం పత్తి సాగు చేయాలంటే కనీసంలో కనీసం రూ.35 వేలు అవసరం అవుతుంది. దుక్కికి రూ.2,000లు, గొర్రు, గుంటక ఖర్చుకు రూ.1,500లు, అచ్చు తోలకానికి ఖర్చు రూ.800లు, పత్తి విత్తనాలు ప్యాకెట్టు రూ.850 చొప్పున 3 ప్యాకెట్లు రూ.2,550లు, ముగ్గురు కూలీలకు రూ.600లు, లారీ పశువుల ఎరువు రూ.20,000లు. దీనికి ప్రత్యామ్నాయంగా రసాయన ఎరువులు 4బస్తాలు రూ.8,000లు, కలుపు తీతలకు రూ.1,200లు, అంతరసేద్యం ఖర్చు రూ.6,400లు, పురుగుమందుల ఖర్చు రూ.10,000లు అవసరమవుతాయి. పత్తితీతలు కాకుండా రూ.33,000ల నుండి రూ.35,000ల వరకు సొంత భూమి ఉన్న వారికి పెట్టుబడి కావాల్సి ఉంది. కౌలు ధరలు అదనం. ఈ ప్రాంతంలో నీటి వసతిని బట్టి ఎకరం కౌలు రూ.10 వేల నుండి రూ.50వేల వరకు చెల్లించాల్సి ఉంది. పత్తి క్వింటాలు ధర ప్రస్తుతం రూ.6వేల వరకు పలుకుతోంది. రూ.10 వేలు పలికితేనే పత్తిరైతు మనగలగుతాడని రైతులు చెబుతున్నారు. కాలం అనుకూలంగా లేకపోతే కౌలు చెల్లించలేని దుస్థితి ఏర్పడుతుందన్నారు. అయినా ఎప్పుడూ ఇలాగే ఉంటుందా...? మంచి రోజులు రాకపోతాయా అని కొందరు రైతులు సాగుకు సిద్ధం చేస్తున్నారు..!



పొలాలకు పశువుల ఎరువు తరలించిన రైతులు

కారు బోల్తా - తప్పిన ప్రమాదం



మాదిరెడ్డిపాలెం దగ్గర బోల్తాపడిన కారు

పొదిలి, మే 14 : ప్రమాదవశాత్తు కారు బోల్తా పడిన ఘటన మండలంలోని మాదిరెడ్డిపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.., మార్కాపురానికి చెందిన క్షతగాత్రులు కొండపిలో ఎన్నికల విధులకు హాజరయ్యారు. పోలింగ్ ముగిసిన అనంతరం స్వగ్రామమైన మార్కాపురం తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు ప్రైవేటు వాహనంలో ప్రైవేటు వైద్యశాలకు వెళ్లినట్లు సమాచారం. ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతిందని వారు పేర్కొన్నారు. కారు స్పీడులో లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

స్తంభాన్ని ఢీకొట్టిన కారు



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ స్తంభం

పొదిలి, మే 14 : పొదిలి మార్కాపురం ప్రధాన రహదారిలో మెయిన్‌లైన్ స్తంభాన్ని కారు ఢీకొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మార్కాపురం నుంచి పొదిలి వైపునకు వస్తున్న కారు సలకనూతల గ్రామం వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు మెయిన్‌లైన్ విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. దీంతో కారు ముందుభాగం బాగా దెబ్బతింది. అయితే ఆ సమయంలో ఎలాంటి వాహనాలు ఆ రహదారిలో రాకపోవడంతో ప్రమాదం తప్పింది. కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత అధికారులు విషయం తెలుసుకొని విద్యుత్ నిలిపివేశారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి

గిద్దలూరు టౌన్, మే 14 : మండల న్యాయసేవా. దికార సంస్థ ఆధ్వర్యంలో అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారా దానమ్మ అధ్యక్షతన మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో ఉన్న సమస్యలను, కేసులను పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం ఎంతో దోహద పడుతుందన్నారు. కక్షిదారులు తమ కేసులను సున్నితంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఎంచుకోవడం ద్వారా విలువైన సమయాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జున, ప్యానల్ న్యాయవాది రవిప్రకాశ్‌బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అందరు కలసిమెలసి ఉండాలి



పూసలపాడులో మాట్లాడుతున్న ఎస్సై నరసింహారావు

బేస్తవారపేట, మే 14 : సార్వత్రిక ఎన్నికలు ముగిశాయని గ్రామాల్లో ప్రజలు కలసికట్టుగా ఎప్పటిలాగానే ఉండాలని బేస్తవారపేట ఎస్సై బి.నరసింహారావు అన్నారు. మండలంలోని పూసలపాడు గ్రామంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ వరకు గ్రామాల్లో బెట్టింగ్‌లు పెట్టడంగాని, ఒకరినొకరు దూషించుకోవడం చేయడం కాని నేరమన్నారు. మునపటిలాగానే అందరు కలసికట్టుగా ఉండాలన్నారు. సమస్యలేమైనా ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి

బేస్తవారపేట, మే14 : బేస్తవారపేట పంచాయతీలోని బేస్తవారపేట, పాపాయిపల్లె, సోమవారపేట గ్రామాల్లోని ప్రజలు సకాలంలో ఇంటిపన్నులు చెల్లించాలని కార్యదర్శి ఎన్.నరేంద్ర కోరారు. నీటి సమస్య తలెత్తకుండా తగుజాగ్రతలు తీసుకుంటున్నామని త్వరలో బోర్లు వేసి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా చేస్తామని కార్యదర్శి అన్నారు.

చిటారు కొమ్మన చింతచిగురు ధర



విక్రయిస్తున్న చింతచిగురు

మార్కాపురం వన్ టౌన్, మే 14: మండు తున్న దరల సరసన తాజాగా చింతచిగురు చేరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కేజీ రూ.700 పలుకుతూ చిరాకు పుట్టిస్తోంది. మటన్‌తో పోటీ పడి పడుతోంది. మార్కాపురం పట్టణంలో చింతచిగురు కిలో రూ.700కు చేరుకొంది. 'చింతచెట్టు చిగురు చూడు.. తినేవాడి పొగరు చూడు' అన్న చందంగా తయారైంది. గతేడాది చౌకగా లభించిన చింతచిగురు ధర నేడు చుక్కలు చూపిస్తోంది. చింత చిగురుతో పప్పు, పచ్చడి, చింత చిగురు వంకాయ, మటన్ కర్రి, ఎండు చేపల కూరలు వండుకొని తింటారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే చిగురు ధర నేడు ఆకాశానికి చేరటంతో ప్రజలు బెంబేలె త్తుతున్నారు. ఇదేమిటని అడుగుతుంటే అమ్మకం దారులు హైదరాబాద్‌లో కూడా రూ.700కు విక్రయిస్తున్నారని సమాధానం చెప్తుండడంతో ఎటుపాలుపోని పరిస్థితిలో వినియోగదారులు ఉన్నారు. గతంలో రూ.10 చొప్పున చిగురు పెడుతుండగా నేడు కుప్ప ధర రూ.100కి చేరుకుంది. 'ఔరా చింతా నీకు ఇంత పొగరా' అంటూ వినియోగదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ నాయకుల దాడుల్లో గాయపడ్డ టీడీపీ ఏజెంట్లు

ఇరువర్గాలపై కేసు నమోదు

కొమరోలు, మే 14: మండలంలోని చింతలపల్లి గ్రామంలో సోమవారం జరిగిన ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నాయకులు టీడీపీ పోలింగ్ ఏజెంట్లపై దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన కొంకాల కొండయ్య, కొంకాల నరసింహులు చింతలపల్లి పంచాయతీలోని కూరాకువానిపల్లి గ్రామంలోని పోలింగ్‌బూత్‌లో ఏజెంటుగా ఉన్నారు. రిలీవ్ కోసం బయటకు వచ్చాడు. ఈ క్రమంలో స్థానిక వైసీపీ నాయకులు ఆయన్ను కర్రలతో దాడులచేసి తీవ్రంగా గాయపరిచారు. వారిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సోమవారం రాత్రి వైద్యశాల నుంచే పోలీసులకు మాపై దాడిచేసిన ఏడు మందిపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులు బయటకు రావా లంటేనే ఇబ్బందులు పడుతు న్నామని ఫిర్యాదు చేశారు. ఈ రోజు అదే గ్రామానికి చెందిన వాలంటీర్ మన్నె సుశీల్ అనే వ్యక్తి నన్ను కులం పేరుతో దూషించారని గాయపడ్డ వారితో కలసి ఏడు మందిపె పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు ఎస్సై ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసులు నమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నారు. ఈ నేద్యంలో సీఐ దాసరి ప్రసాదు చింతలపల్లి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా గట్టి నిఘా ఏర్పాటుచేశారు. మంగళవారం రాత్రి కొమరోలు పోలీసు స్టేషన్ నుంచి వెళ్తుండగా వైసీపీ నాయకులు టీడీపీ కార్యాకర్తపై దాడిచేయటంతో స్థానిక ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని చెల్లాచెదురు చేశారు.



గాయపడ్డ టీడీపీ ఏజెంట్లు

నేతల ఇళ్ల వద్ద కార్యకర్తల సందడి



పొదిలిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, మే 14: చెదురుమదురు ఘటనలు, చిన్నపాటి ఘర్షణలు మినహా సార్వ త్రిక ఎన్నికలు సోమవారం నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నేపథ్యంలో ఆయా వార్డులు, గ్రామాలకు చెందిన నాయకులు, కార్య కర్తలు మంగళవారం మార్కాపురం పట్టణానికి వచ్చారు. టీడీపీ, వైసీపీ తరఫున పోటీలో నిలిచిన కందుల నారాయణరెడ్డి, అన్నా రాంబాబుల ఇళ్ల వద్దకు చేరుకున్నారు. దీంతో ఇద్దరు నేతలు నివాసముంటున్న జవహర్‌నగర్ కాలనీ మొత్తం జనాలతో నిండిపోయింది. అభ్యర్థుల వద్దకు వెళ్లిన కార్యకర్తలు వారి పరిధిలో జరిగిన పోలింగ్ పరి స్థితులను తెలియజేశారు. పోలైన ఓట్లు వారికి ఎంతమేర మెజార్టీ వస్తుంది తదితర విషయాల గురించి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వాళ్లే ఎక్కువ సంఖ్యలో నేతల ఇళ్ల వద్ద కనిపిం చారు. నేతలు కూడా ఆయా గ్రామాల్లో పోలింగ్ ఏ విధంగా జరిగింది, ప్రభుత్వంపై సానుకూలత ఉందా...?, ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారా..? తదితర విషయాల గురించి ఆరా తీశారు.

పొదిలి కార్యకర్తలతో కందుల

పొదిలి : సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నాకు సహకరించిన టీడీపీ నాయకులకు. కార్యకర్తలకు, మండల ప్రజలకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం రాత్రి అభిమానులను కలిసేందుకు ఆయన పొదిలి వచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పోలింగ్ జరిగిన తీరును పరిస్థితులపై సమాచారాన్ని నాయకులను అడిగి తెలుసుకున్నారు. తన గెలుపుకోసం కృషి చేసిన వారికి ఎప్పుడు రుణపడి ఉంటానని ఆయన అన్నారు.

పోలింగ్ సరళిపై సమీక్ష

గిద్దలూరు టౌన్ : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ జరిగిన తీరు గురించి టీడీపీ అభ్యర్థి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ శ్రేణులతో సమీక్షించారు. మంగళవారం ఉదయం నుంచే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని పంచాయతీ, గ్రామస్థాయి నాయకులు అశోక్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. పోలింగ్ జరిగిన తీరు గురించి వివరించి కష్టనష్టాల గురించి చెప్పడం, మెజారిటీ చెప్పి సంతోషం పంచుకున్నారు. నూటికి నూరు శాతం మనం గెలువనున్నా మంటూ, మెజారిటీ కూడా భారీగానే ఉంటుందంటూ స్పష్టం చేశారు. పలు గ్రామాల టీడీపీ శ్రేణులు అశోక్‌రెడ్డిని పూలమాలలతో ముంచెత్తా యి. పోలింగ్ సరళిని తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి తన గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక పాలన చేపట్టిన జగన్‌కు వ్యతిరేకంగా కసితో అన్నివర్గాల ప్రజలు ఓట్లు వేశారని అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే అనే విషయాన్ని ప్రజ లు గుర్తించారని, అందుకే కూటమి అభ్యర్థులకు ఓట్లు వేశార న్నారు. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబేనని అశోక్‌రెడ్డి ఈసందర్భంగా స్పష్టం చేశారు. ఓట్లు వేసిన ప్రజలకు పోలింగ్ ప్రచారంలో పాల్గొని గెలుపునకు సహకరించిన పార్టీ శ్రేణులకు అశోక్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు



క్లబ్‌రోడ్డులో నీటిడబ్బాలు నింపుకుంటున్న మహిళలు

గిద్దలూరు, మే 14 : ఎండలు మండిపోతున్నాయి. వర్షాల జాడ కనిపించడం లేదు. రోజురోజుకు భూగర్భజలాలు పడిపోతున్నాయి. దీంతో బోర్లకు నీరు అందడం లేదు. ముఖ్యంగా గిద్దలూరు పట్టణంలో గత 15 రోజుల్లో వేగంగా భూగర్భజలాలు అడుగంటడంతో చాలా డీప్ బోర్లకు నీరు అందడం లేదు. దీంతో ప్రజలు నీటి సమస్యతో సతమతమవుతున్నారు. వారానికి ఒక పర్యాయం కూడా మున్సిపాలిటీ ట్యాంకర్ నీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్ల దగ్గర డ్రమ్ము రూ.50 పెట్టి నీటిని కొనుగోలు చేయక తప్పడం లేదు. గుండ్లమోటు ప్రాజెక్టు వద్ద సైతం భూగర్భ జలాలు పడిపోవడంతో అక్కడి నుంచి గిద్దలూరుకు నీటి సరఫరా నెమ్మదించింది. గుండ్లమోటు ప్రాజెక్టు నీటిని పట్టణంలోని వీరన్నబావి, బ్రిటన్ రోడ్డు, నల్లబండ బజారులలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని ఎక్కించి ఆ ప్రాంత వీధులకు మూడురోజులకొకసారి నీటిని అందించేవారు. భూగర్భజలాలు అడుగంటడంతో ప్రస్తుతం గుండ్లమోటు నీటిని 10, 12 రోజులకొకసారి కూడా అందించలేక పోతున్నారు. పట్టణంలోని 5వ వార్డు, కొప్పువారివీధి, ఏటీఎం పాలెం, క్లబ్ రోడ్డు, బందెలదొడ్డి బజారు, సుంకమ్మ బజారు, రాచర్లగేటు అవతల గల ఎస్టీ కాలనీ, హోసన్నమందిర్ ప్రాంతాలలో డీప్‌బోర్లకు నీరు అందక ప్రజలు నీటి కష్టాలకు గురవుతున్నారు. మున్సిపాలిటీలకు ఉన్న మూడు ట్యాంకర్లతోపాటు ప్రైవేటుగా 8 ట్యాంకర్లను అద్దెకు తీసుకుని నీటిని సరఫరా చేస్తున్నారు. తగినన్ని ట్యాంకర్లు లేకపోవడంతో వారం పదిరోజులకొకసారి కూడా నీటిని అందించలేక పోతున్నారు. దాంతో ప్రజలు 200 లీటర్ల డ్రమ్ములకు 50 రూపాయలు చెల్లించి నీటిని కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నా రు. వారానికి రెండు పర్యాయాలు సరిపడనంత నీటిని ట్యాంకర్ల ద్వారా అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా, భూగర్భజలాలు అడుగంటడంతోపాటు విద్యుత్ లోవోల్టేజ్ సమస్య కూడా నీటి సమస్యకు కారణమైందని పేర్కొన్నారు. మూడుచోట్ల పాత బోర్లను రీఫ్రెసింగ్ చేయడంతో వాటి పరిధిలో నీటి సరఫరా కొంత మెరుగైందని, అదనంగా ట్యాంకర్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ నుంచి 30 లక్షలు మంజూరు కోసం అనుమతులు తీసుకున్నామన్నారు. త్వరలోనే ట్యాంకర్ల సంఖ్య పెంచి నీటిని అందిస్తామని పేర్కొన్నారు. ఏది ఏమైనా ఎన్నికల సీజన్ కావడంతో ప్రజా ప్రతినిధులు తమ గెలుపు కోసం ఓట్ల వేటలో పడగా ప్రజలు ఎదుర్కొనే నీటి సమస్య పరిష్కారానికి సరియైన చర్యలు అధికారులు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కొప్పులవారి వీధిలో నీరు పట్టుకుంటున్న మహిళలు

ఒంగోలుకు ఈవీఎంలు తరలింపు

మార్కాపురం, మే 14: మార్కాపురం నియోజకవర్గంలో 87.58 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,14,608 ఓట్లకు గాను 1,87,952 ఓట్లు నమోదయ్యాయి. పోలైన ఓట్లలో పురుషులవి 95,195 ఓట్లు కాగా, మహిళవి 92,750, ఇతరులవి 7 ఓట్లు పోలయ్యాయి. దీంతో 87.58 పోలింగ్ శాతం నమోదైంది. మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో 78వ పోలింగ్ కేంద్రంలో 100 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 961 ఓట్లు ఉండగా 961 ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్ కేంద్రంలో రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గంలోని 257 పోలింగ్ కేంద్రాలలో రాత్రి 10.30 గంటలకు ఎన్నిక పూర్తయినట్లు ఆర్‌వో రాహుల్‌మీనా తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం సెక్టార్ అధికారులు పోలీసుల పటిష్ట భద్రతా చర్యల మధ్య ఈవీఎంలను మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాల స్ట్రాంగ్ రూంలకు చేర్చారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఈవీఎంలన్నింటినీ రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్ మీనా సమక్షంలో ప్రత్యేక వాహనాలలో ఒంగోలుకు తరలించారు.

కంభం మండలంలో 82.18 శాతం

కంభం : కంభం మండలంలో సోమవారం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మొత్తం 37,860 మంది ఓటర్లకు గాను 32,030 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 15,719 మంది, మహిళలు 16,310 మంది, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు.

అర్ధవీడు మండలంలో 88.17 శాతం

అర్ధవీడు మండలంలో సోమవాంరం జరిగిన ఎన్నికలకు సంబంధించి మొత్తం 27,951 మంది ఓటర్లకు గాను 25,029 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 12,521 మంది, స్త్రీలు 12,506 మంది, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

84.74 శాతం పోలింగ్

గిద్దలూరు : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 84.74 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం 2,39,710 ఓట్లు ఉండగా 2,03,136 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 1,19,502 ఓట్లు ఉండగా 10,0318 ఓట్లు, మహిళలు 1,20,188 ఓట్లు ఉండగా 1,02,809 ఓట్లు, థర్డ్ జండర్ 20 ఓట్లు ఉండగా 9 ఓట్లు పోలైనట్లు రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి తెలిపారు.

అర్ధవీడు మండలంలో 98.24 శాతం

గిద్దలూరు : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో అత్యధికంగా అర్ధవీడు మండలంలో 88.24 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ మండలంలో 28,386 ఓట్లు ఉండగా 25,047 ఓట్లు పోలయ్యాయి. తరువాత స్థానంలో గిద్దలూరు రూరర్ మండలం ఉంది. రూరల్ మండలంలో 87.07 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం 39,611 ఓట్లు ఉండగా 34,488 ఓట్లు పోలయ్యాయి. రాచర్ల మండలంలో 85.89 శాతం ఓట్లు పోలయ్యాయి. 28,607 ఓట్లకు 24,570 ఓట్లు పోలయ్యాయి. బేస్తవారపేట మండలంలో 84.95 శాతం పోల్ కాగా మొత్తం 41,238 ఓట్లకు 38,032 ఓట్లు పోలయ్యాయి. కంభం మండలంలో 83.52 శాతం ఓట్లు పోలు కాగా మొత్తం 38,152 ఓట్లకు 31,865 ఓట్లు పోలయ్యాయి. కొమరోలు మండలంలో 83.28 శాతం మేర 33,317 ఓట్లకు 27,746 ఓట్లు పోలయ్యాయి. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలో తక్కువ శాతం ఓట్లు పోలయ్యాయి. కేవలం 77.28 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. మొత్తం 30,399 ఓట్లకు 23,491 ఓట్లు పోలైనట్లు రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి తెలిపారు.



స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

89.40శాతం పోల్

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 207214 మంది ఓటర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారు. సోమవారం జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 185242 మంది ఓటర్లు ఓట్లు వేసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. 89.40 శాతం నమోదయ్యింది. నియోజకవర్గంలో 265 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈవీఎంలు, మరమ్మతుతో 10 పోలింగ్ స్టేషన్‌లలో సోమవారం రాత్రి 10 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.

అవీ..ఇవీ..

పట్టణంలో స్వల్ప ఘర్షణ

- అదుపు చేసిన పోలీసులు



సెవెన్‌హిల్స్ పోలీస్‌స్టేషన్ సమీపంలో పరిస్థితి అదుపు చేస్తున్న పోలీసులు

మార్కాపురం, మే 14: స్థానిక సెవెన్ హిల్స్ లాడ్జీ సమీపంలో మంగళవారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగిన సోమవారం సాయంత్రం స్థానిక రెడ్డి కళాశాల బూత్ వద్ద జరిగిన ఘర్షణలో జవహర్‌నగర్ కాలనీ, తూర్పువీధికి చెందిన యువకులు గొడవపడ్డారు. రెండు పార్టీలకు చెందిన వాళ్లు కొట్టుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి అదుపు చేవారు. కానీ రెండు ప్రాంతాలకు చెందిన వాళ్లు ఉదయం, సాయంత్రం వేళల్లో సెవెన్‌హిల్స్ సమీపంలోని దుకాణాల వద్ద ఉంటారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి టీడీపీ వర్గీయులు కూర్చుని ఉన్న ఒక దుకాణం వద్దకు వచ్చి వైసీపీ వర్గీయులు గొడవ పెట్టుకున్నారు. మీ అంతు చూస్తామంటూ వాగ్వివాదానికి దిగారు. చుట్టుపక్కల ఉన్నవాళ్లు వెంటనే పట్టణ పోలీసులుకు సమాచారం అందించారు. దీంతో వెంటనే పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. అంతేకాక ఆ చుట్టుపక్కల ఉన్న దుకాణాలను మూసివేయించి కొద్దిమంది ఇబ్బందితో అక్కడ పోలీసు పికెట్ ఏర్పాటు చేయించారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ మూకల దాడి

పొదిలి మే 14 : నగరపంచాయతీలోని పోతవరం గ్రామంలో టీడీపీ కార్యకర్త పి మరియదాస్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే టీడీపీకి ఓటు వేశానని తెలుసుకొని వైసీపీకి చెందిన పలువురు నను పడేసి కొట్టినట్లు బాధితుడు మరియదాసు తెలిపారు. విషయం తెలుసుకన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రెండు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారు. అనంతరం మరియదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి కోటయ్య తెలిపారు.

టీడీపీ ప్రభంజనాన్ని ఓర్వలేకే దాడులు

కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు



బాధితులను పరామర్శిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, మే 14 : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ ప్రభంజనాన్ని ఓర్వలేకనే వైసీపీ అల్లరిమూకలు దాడులకు తెగబడుతున్నాయని టీడీపీ వై.పాలెం కూటమి అభ్యర్థి ఎరిక్షన్‌బాబు ఆరోపించారు. మంగళవారం ఆయన మండలంలోని వాదంపల్లి గ్రామంలో టీడీపీ సానుభూతిపరులపై వైసీపీ మూకలు దాడి చేశాయి. ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్న టీడీపీ కార్యకర్తలను గూడూరి ఎరిక్షన్‌బాబు మంగళవారం సాయంత్రం పరామర్శించారు. ఎర్రగొండపాలెంలో టీడీపీ గెలుస్తుందని వైసీపీ నాయకులు, కార్యకర్తలు మూటగట్టుకొని టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారని అన్నారు. ఇలాంటి కవ్వింపు చర్యలకు టీడీపీ భయపడదన్నారు. సోమవారం నాటి పోలింగ్ సమయంలో వైసీపీ నాయకులు, అత్యుత్సాహం ప్రదర్శించడం పిరికి పందలచర్య అని అన్నారు. టీడీపీ గెలుపును ఆపలేరని, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఓటమిని ఒప్పుకోక తప్పదన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డిలు పరామర్శించారు.

పలు రైళ్లు రద్దు

గిద్దలూరు, మే 14 : గుంటూరు-గుంతకల్లు రైలు మార్గంలో రైల్వే డబ్లింగ్ పనుల నేపథ్యంలో రెండు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రూటులో పలు రైళ్ల రద్దు చేసినప్పటికీ గిద్దలూరు మీదుగా తిరిగే రెండు రైళ్లను రద్దు చేశారు. హుబ్లీ-గిద్దలూరు- విజయవాడ (17329) రైలును ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు, విజయవాడ-గిద్దలూరు-హుబ్లీ (17330) రైలును ఈ నెల 17 నుంచి జూన్ 1 వరకు, గుంటూరు-గిద్దలూరు-కాచీగూడ (17251) రైలును ఈ నెల 16 నుంచి 31వరకు, కాచీగూడ-గిద్దలూరు-గుంటూరు(17252) రైలును ఈ నెల 17 నుంచి జూన్ 1వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

రెండు రైళ్లు రద్దు

మార్కాపురం, మే 14: గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంలో డబ్లింగ్ పనుల నేపథ్యంలో రెండు రైళ్లను రద్దు చేసినట్లు గుంటూరు డీఆర్‌ఎం కార్యాలయం తెలిపింది. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు 17329-17330 నెంబర్లతో నడిచే హుబ్లీ-విజయవాడ, 17251-52 నెంబర్లతో నడిచే గుంటూరు-కాచిగూడ రైళ్లను రద్దు చేశారు.

ఓటర్లకు, కూటమి నేతలకు మాగుంట కృతజ్ఞతలు

ఒంగోలు(కలెక్టరేట్), మే 14 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పా ర్టీల కూటమి గెలుపు కోసం తనకు తోడుగా ఉండి అన్ని విధాలుగా సహకరించి పనిచేసిన నేతలు, కార్యకర్తలకు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఒంగోలు పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల కోసం పనిచేసిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మరో వైపు సోమవారం జరిగిన పోలింగ్‌లో పోలింగ్ కేంద్రాలకు పురుషులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓట్లు వేయడం పట్ల మాగుంట ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో అఖండ విజయాన్ని కైవసం చేసుకుంటానని మాగుంట పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా ఎంతో సమన్వయంతో పనిచేసిన కూటమి నేతలను అభినందించారు.

టీడీపీ కూటమి అభ్యర్థి లక్ష్మి నివాసంలో కోలాహలం


టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ భర్త డాక్టర్ లలిత్‌సాగర్‌తో నేతలు

దర్శి, మే 14 : నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ తీరు విజయావకాశాలపై తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల వద్దకు నాయకులు, కార్యకర్తలు వెళ్లి మంగళవారం ఎన్నికలు జరిగిన తీరుపై చర్చించారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ ఇంటికి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు వచ్చారు. గ్రామాల్లో జరిగిన పోలింగ్ తీరును వివరించారు. మొత్తంమీద టీడీపీకి అనుకూలంగా ఓటింగ్ జరిగిందని, ఖచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాలవారీగా లెక్కలు వేసి మెజార్టీపై అంచనాలు వేశారు. గ్రామస్థాయి నాయకులు ఇచ్చిన సమాచారం ప్రకారం టీడీపీ గెలుస్తుందనే ధీమా పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతుండటంతో పార్టీ కేడర్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దర్శి ఈవీఎంలు ఒంగోలుకు తరలింపు


ఈవీఎంలను ఒంగోలుకు తరలిస్తున్న అధికారులు

దర్శి, మే 14 : నియోజకవర్గంలోని ఈవీఎంలను అధికారులు ఒంగోలు తరలించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను స్థానిక మోడల్‌స్కూల్‌కు తరలించిన విషయం తెలిసిందే. అక్కడ నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీవీఎస్ లోకేశ్వరరావు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాహనాల్లో చేర్చి ఒంగోలు రైజ్ కళాశాలకు తరలించారు. జూన్ 4వ తేదీన ఒంగోలులో కౌంటింగ్ జరుగుతుంది. నియోజకవర్గం మొత్తం 282 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగిన విషయం తెలిసిందే. దర్శికి చెందిన 282 ఈవీఎంలు, పార్లమెంట్‌కు సంబంధించిన 282 ఈవీఎంలు పటిష్టమైన భద్రతా వలయంలో తరలించినట్లు ఎన్నికల అధికారి ఎంవీవీఎస్ లోకేశ్వరరావు తెలిపారు.

టీడీపీ నాయకుడు మృతికి నివాళులర్పించిన ఉగ్ర

పీసీపల్లి, మే 14 : మండలంలోని పెదఅలవలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పువ్వాడి వెంకటనారాయణ(54) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో పార్టీ తరఫున ఎంతో ఉత్సాహంగా పనిచేసిన వెంకటనారాయణ తెల్లవారేసరికి మృతి చెందాడన్న వార్త తెలియడంతో టీడీపీ శ్రేణులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంకటనారాయణ మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పెదఅలవలపాడు వచ్చి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి


విచారిస్తున్న పోలీసులు

పీసీపల్లి, మే 14 : మండలంలోని లింగన్నపాలేనికి చెందిన టీడీపీ కార్యకర్త బాలిబోయిన మల్లికార్జునపై లక్కక్కపల్లికి చెందిన వైసీపీ కార్యకర్తలు మంగళవారం దాడిచేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... మల్లికార్జున గత సర్పంచ్ ఎన్నికల సమయంలో వైసీపీకి మద్దతుగా నిలిచాడు. కనిగిరి టీడీపీ అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డిపై అభిమానంతో సార్వత్రిక ఎన్నికల ముందు తన గ్రామంలోని 30కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున ఉగ్ర నరసింహారెడ్డికి మద్దతుగా చురుగ్గా పనిచేశాడు. అది జీర్ణించుకోలేని వైసీపీ కార్యకర్తలు కక్ష పెంచుకున్నారు. మల్లికార్జున మంగళవారం లక్కక్కపల్లికి వెళ్లాడు. ఆ సమయంలో మల్లికార్జునను చూసిన కొంత మంది వైసీపీ కార్యకర్తలు అతన్ని దూషిస్తూ ఒక్కసారిగా దాడిచేశారు. దీంతో బాధితుడు పీసీపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. కాగా తమపై మల్లికార్జునే దాడి చేశాడంటూ ప్రత్యర్థులు కూడా పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్సై రమేష్‌బాబును వివరణ కోరగా ఇరువర్గాలు ఫిర్యాదు చేశారని, విచారించి కేసు నమోదు చేస్తామని చెప్పారు.

ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం


పామూరు, మే 14 : పామూరులో మంగళవారం ఉదయం నుంచే తీవ్ర ఉక్కపోతతో ప్రజలు విలవిలలాడారు. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో గాలివీచక చెమటలు పట్టడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మధ్యాహ్న సమయంలో ఉరుగులు మెరుపులు, గాలులతో వర్షం కురవడంతో ఒక్కసారిగా చల్లబడి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది.

పెరిగిన పోలింగ్ టీడీపీకే అనుకూలం


మాట్లాడుతున్న పువ్వాడి

పామూరు, మే 14 : మండలంలో గతంలో ఎప్పుడు లేనివిధంగా రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదు కావడం టీడీపీ కూటమి అభ్యర్థికి కలిసివస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో ఎన్డీయే కూటమి శ్రేణులతో మండలంలో జరిగిన పోలింగ్ తీరుతెన్నులపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ఎన్నికల్లో వలస ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొన్నారన్నారు. ఓటింగ్ సరళిని చూస్తే ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర 15 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. సమావేశంలో నేతలు ఏలూరి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్‌అమీర్‌బాబు, వై ప్రసాదరెడ్డి, బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా, గుంటుపల్లి శ్రీనివాసులు, ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, వై మునలయ్య, షేక్ నాయబ్‌రసూల్, బీజేపీ నేతలు రమణయ్య, జనసేన జిల్లా కార్యదర్శి వై రహిముల్లా పాల్గొన్నారు.

కురిచేడు మండలంలో అర్ధరాత్రి వరకూ పోలింగ్


ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు

కురిచేడు, మే 14 : సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సోమవారం అర్ధరాత్రి వరకూ వేచి ఉన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఓటర్లలో చైతన్యం వచ్చింది. మండలంలో మొత్తం 32,330 మంది ఓటర్లు ఉండగా వారిలో 29,390 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 90.90 ఓటర్ల శాతం నమోదైంది. పడమర కాశీపురం48వ పోలింగ్ స్టేషన్లో మొత్తం 577 మంది ఉండగా 561 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గంగదొనకొండ 74వ పోలింగ్ స్టేషన్లో 97.63 శాతం ఓట్లు నమోదై మండలంలో అత్యధికంగా ఓటింగ్ జరిగిన గ్రామంగా నిలిచింది. పడమరవీరాయపాలెం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో 71వ పోలింగ్ స్టేషన్లు 80.90 శాతంతో మండలంలో అత్యల్పంగా ఓట్లు నమోదైంది.

దర్శిలో వైసీపీ బరితెగింపు

ఓటమి భయంతో టీడీపీ శ్రేణులపై విచక్షణారహితంగా దాడులు

అసహ్యించుకుంటున్న ప్రజలు


వైసీపీ దాడులకు నిరసనగా గాయపడిన బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మే 14 : నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా వైసీపీ మూకలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడటం పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను వైసీపీ ఉద్దేశపూర్వకంగా రక్తమయం చేసి అనేక గ్రామాల్లో దాడులు, దౌర్జన్యాలు నిరాటంకంగా జరిగిన విషయం తెలిసిందే. మండలంలోని బొట్లపాలెంలో వైసీపీశ్రేణులు చేసిన దాడిలో సమిడిశెట్టి శ్రీనివాసరావు, బత్తెన నరేంద్ర తలలకు తీవ్ర గాయాలుకాగా మరి కొంత మంది గాయపడ్డారు. గాయపడిన వారిని రక్షించుకునేందుకు అక్కడకు వెళ్లిన టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని దుర్భాషలాడారు. దాడులను ఖండిస్తూ ఆమె రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసినప్పటికీ పోలీస్ అధికారుల్లో మార్పురాలేదు. పోలీసులు వైసీపీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహించినందున వైసీపీ గూండాలు యథేశ్చగా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ ముందుకు రోజు బొట్లపాలేనికి చెందిన తెలుగుయువత నాయుడు కల్లూరు సుబ్బుపై దాడి చేసిన విషయం తెలిసిందే. అప్పుడే పోలీసులు దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసివుంటే మరుసటి రోజు ఇంత దారుణం జరిగేది కాదు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహించినందున సుబ్బుపై దాడులు చేసిన వ్యక్తులతో పాటు మరికొందరు కలిసి పోలింగ్ రోజు టీడీపీ కార్యకర్తలపై మారణాయుధాలు, కర్రలతో దాడులు చేశారు. దర్శి పట్టణంలోని ఆర్‌ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఓట్లు వేసిన పోలింగ్ తీరును పరిశీలించేందుకు వెళ్లిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిపై దాడికి యత్నించారు. ఆమె కారుపై రాళ్లు వేశారు. ఇంత జరుగుతున్నా అక్కడున్న పోలీసులు ఆ దాడిని నిలువరించలేక ప్రేక్షకపాత్ర పోషించారు. మహిళా అభ్యర్థిపై రాళ్ళదాడులకు పాల్పడుతున్న వైసీపీ మూకలను నిలువరించేందుకు టీడీపీ కార్యకర్తలు గట్టిగా ఎదుర్కొనంటంతో పోలీసులు టీడీపీ వారిపై లాఠీచార్జి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు వీసీరెడ్డిపై దాడి చేసిన వారిని వదిలేసి ఈవీఎం పగలగొట్టారన్న నెపంతో ఆయన పైనే కేసు పెట్టారు. వాస్తవంగా ఈవీఎం పగులలేదు. టెక్నికల్ సిబ్బంది సహకారంతో బాగు చేయించి పోలింగ్ నిర్వహించారు. పోలీసులు ఏక పక్షంగా కేసు నమోదు చేశారు. ఎర్రఓబన్నపల్లెలో వైసీపీ నాయకులు టీడీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు లాక్కొచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు టీడీపీ కేడర్‌పై దాడులకు తెగబడ్డారని ప్రజలు చెబుతున్నారు.

ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థి

దర్శి, మే 14 : దర్శి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన తనకు ఓటు వేసిన ప్రజలకు, ఎన్నికల్లో అండగా నిలిచి ముందుండి నడిపించిన కూటమి నాయకులకు కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. దర్శిలో ఓటమి భయంతోనే వైసీపీ దాడులకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ మూకల దాడులను ఎదురొడ్డి టీడీపీ కూటమి కార్యకర్తలు, నాయకులు ధీటుగా ఎదుర్కొన్నారని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటాన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థ సేవ చేసి రుణం తీర్చుకుంటానని తెలిపారు. ఎన్నికల ఆరంభం నుంచి అహర్నిశలు కష్టించి పని చేసిన ప్రజలకు, టీడీపీ కూటమి శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు.

గెలుపు బాటలో మీరే భాగస్వాములు

టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు చెప్పిన డాక్టర్ ఉగ్ర

కిక్కిరిసిన అమరావతి ప్రాంగణం


కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, మే 14 : గెలుపు బాటలో మీరే భాగస్వాములని ఎన్డీయే కూటమి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మంగళవారం జరిగిన సభలో డాక్టర్ ఉగ్ర కార్యకర్తలు, నాయకులకు, శ్రేణులకు కృతజ్ఞతలు చెప్పారు. టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలవబోతుందంటూ నియోజవర్గంలోని వివిధ మండలాల్లోని నలుమూలల నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చి డాక్టర్ ఉగ్రకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఐదేళ్లగా ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్న కార్యకర్తలు, నాయకుల కష్టానికి నిన్న జరిగిన ఎన్నికలు ఓ గుర్తింపుగా మారనున్నాయన్నారు. ప్రతి కార్యకర్త తానే పోటీలో ఉన్నట్లుగా భావించి అలుపెరగని కష్టం చేశారని కొనియాడారు. గతంలో కనిగిరి నియోజకవర్గం అంటేనే కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదన్నారు. అలాంటిది 2019 ఎన్నికల్లో వైసీపి గాలిలో ఓటమి చెందానని చెప్పారు. ఆ కసిని నిన్నటి ఎన్నికల్లో టీడీపీ సైన్యం చూపించిన తీరు అభినందనీయమన్నారు. గతంలో ఎన్నడూ జరగని రీతిలో పోలింగ్ జరగటం టీడీపీ గెలుపునకు ప్రధాన సూచిక అని చెప్పారు. జూన్ 4న కౌంటింగ్ అనంతర విజయోత్సవ సభను జరుపుకుందామన్నారు. డాక్టర్ ఉగ్రను కలిసేందుకు వచ్చిన వారితో అమరావతి ప్రాంగణం కిక్కిరిసి పోయింది.

వలస ఓటర్లతో వీధులన్ని కిటకిట

పామూరు, మే 14 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సొంత గ్రామాల్లో ఓట్లు వేసేందుకు కుటుంబ సభ్యులతో ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన వలస ఓటర్లతో పామూరులోని పలు దుకాణాలు మంగళవారం కిటకిటలాడాయి. దీనికితోడు వారు తిరుగు ప్రయాణంలో భాగంగా పట్టణంలో కార్లు బారులు తీరగా గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో సంక్రాంతి పండుగ మాదిరిగా సందడి ఏర్పడింది. పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రోడ్లన్నీ ఆక్రమణలతో ఇరుకుగా తయారయ్యాయి. రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడం ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మంగళవారం ఏర్పడిన ట్రాఫిక్ వలన సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురయ్యారు.

తిరుగు ప్రయాణంలో తప్పని తిప్పలు


నిలిచిపోయిన ట్రాఫిక్


దొనకొండ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

దొనకొండ, మే 14 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న వలస ఓటర్లకు తిరుగు ప్రయాణంలో రవాణా కష్టాలు తప్పలేదు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు విద్య, ఉద్యోగ, వ్యాపార, జీవనోపాధి నిమిత్తం కూలి పనులకు వలస వెళ్లి పట్టణ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఓటు వేసేందుకు శని, ఆదివారాల్లో అధికసంఖ్యలో వారందరూ గ్రామాలకు చేరుకున్నారు. ఓటుహక్కును వినియోగించుకుని తిరిగి వారి ప్రాంతాలకు చేరుకునేందుకు దొనకొండ నుంచి సరైన రవాణా సౌకర్యం లేకపోవటం, ప్రైవేట్ బస్సులు రెట్టింపు చార్జీలు వసూళ్లు చేస్తుండటంతో రైలు ప్రయాణం తప్పనిసరైంది. దీంతో మంగళవారం దొనకొండ మీదుగా ప్రయాణించే రైళ్లు కిక్కిరిసిపోయాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు రైళ్ల రద్దీగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

కనిగిరి నియోజకవర్గంలో భారీగా పెరిగిన పోలింగ్ శాతం



కనిగిరి, మే 14 : కనిగిరి నియోజకవర్గంలో గెలుపుపై టీడీపీ, వైసీపీ ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మంగళవారం ప్రధాన పార్టీల నేతల అభ్యర్థులు నియోజకవర్గంలోని ఆరుమండలాల నేతలతో మండలం, గ్రామం, బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుంటూ పోలింగ్ సరళిపై బలబలాలు అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలో 2014 ఎన్నికల్లో 75.75 శాతం, 2019 ఎన్నికల్లో 82.51శాతం పోలింగ్ జరగగా ఈసారి(2024) ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. గతంలో జరిగిన ఎన్నికల కంటే రికార్డుస్థాయిలో తాజాగా 85.30శాతం పోలింగ్ నమోదవడం గమనార్హం.

నియోజకవర్గంలోని మొత్తం 297 పోలింగ్ కేంద్రాల్లో 2,40,079 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,04,532, స్త్రీలు 1,00,259 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈవీఎంలు పనిచేసే విధానంలో జాప్యంతో రాత్రి 9 గంటలు దాకా పోలింగ్ జరిగినా ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడి ఓట్లు వేశారు. నియోజకవర్గంలోని రెండు, మూడు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 12.00గంటల దాకా పోలింగ్ సాగింది. ఓటర్లు భారీగా బారులు తీరటంతో పాటు సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చి మరీ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ పరిస్థితిని విశ్లేషకులు ప్రభుత్వ పథకాల్లో సానుకూలత, ప్రభుత్వ ఏకపక్ష విధానాల పట్ల వ్యతిరేకత అని విశ్లేషిస్తున్నారు. మొత్తమ్మీద నాలుగైదు బూత్‌లలో 100శాతం పోలింగ్ నమోదవటం విశేషం. వాటిలో కనిగిరి మండలంలోని గానుగపెంట, పోతవరం, ఎనిమిరెడ్డిపల్లి బూత్‌లలో 100శాతం పోలింగ్ నమోదైంది. అయితే టీడీపీ, వైసీపీ నేతలు పోలింగ్‌శాతాన్ని పెరగటాన్ని ఎవరికివారు అన్వయించుకుంటున్నారు.

కనిగిరి టీడీపీ కూటమి అభ్యర్థిగా డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, వైసీపీ అభ్యర్థిగా హనుమంతునిపాడు జడ్పీటీసీ సభ్యుడిగా ఉన్న దద్దాల నారాయణ పోటీలో ఉన్నారు. ఎన్నికల ప్రారంభ ప్రక్రియ నుంచి టీడీపీ, వైసీపీ అభ్యర్థులు గెలుపుపై సర్వశక్తులు ఒడ్డారు. ఇరుపార్టీల అభ్యర్థులు గెలుపుపై నియోజకవర్గంలోని ఆరుమండలాల నాయకులతో చర్చలు జరిపి లెక్కలు వేసుకుంటున్నారు. అయితే టీడీపీ అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డికి దాదాపు 20వేల వరకు మెజార్టీ రావచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. అదే విధంగా వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ మంచి ఆధిక్యతతో విజయం సాధిస్తామని ధీమాగా ఉన్నట్లు ఆయా పార్టీ వర్గాల వారు చెప్తున్నారు. ఇరుపార్టీల నాయకులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ ఓటర్లు ఎటువైపు మొగ్గారో అర్థం కాగా కిందిస్థాయి శ్రేణులు అంచనాల్లో తలమునకలు అవుతున్నారు. పెరిగిన పోలింగ్‌శాతం ఎవరికి అనుకూలంగా ఉంటుంది అధికంగా ఏ వర్గాల వారు పోలింగ్‌లో పాల్గొన్నారనే విషయంపై వివరాలు సేకరిస్తున్నారు. ఆయా సామాజిక వర్గాలు ప్రాంతాల వారీగా పోలైన ఓట్ల శాతానికి పరిశీలిస్తే ఎవరికి ఎన్నిఓట్లు వస్తాయనే విషయాన్ని తెలుసుకోవచ్చుననే విషయంతో ప్రధానపార్టీల నేతలు గ్రామాల వారీగా స్థానిక నాయకులతో ఓటింగ్ సరళిపై వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, దద్దాల నారాయణ పార్టీల నేతలతో మంతనాలు జరిపి గెలుపుపై ఎవరికివారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ వర్గీయులపై మూడు కేసుల నమోదు

దర్శి కూటమి అభ్యర్థిపై రెండు.. ఇంకొకటి మరొక కార్యకర్తపై

బాధితులపైనే రివర్స్ కేసులు


వైసీపీ దాడిలో తలపగిలిన కార్యకర్త

దర్శి, మే 14 : మండలంలో పోలింగ్ సందర్భంగా జరిగిన ఘటనలపై మంగళవారం పోలీసులు ఏకపక్షంగా టీడీపీ వర్గీయులపై మూడు కేసులు బనాయించారు. బొట్లపాలెంలో వైసీపీ మూక టీడీపీ వారిపై దాడి చేసి గాయపరిచారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బాధితులను అండగా నిలిచేందుకు అక్కడకెళ్లి దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని శాంతియుతంగా నిరసన తెలిపారు. పోలీసులు దాడులు చేసిన వారిని పక్కనబెట్టి ధర్నా చేశారన్న నెపంతో ఆమెతోపాటు మరికొందరుపై కేసు నమోదు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నేత వీసీరెడ్డిపై దాడి చేసిన వారిని వదిలేసి ఈవీఎం పగులగొట్టాడని పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. దర్శి-కురిచేడు రోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించేందుకు అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని అకారణంగా అడ్డుకుని కారుపై రాళ్లతో దాడి చేశారు. ఆమెను రక్షించేందుకు టీడీపీ వర్గీయులపై ఎదురుతిరిగారు. టీడీపీ వర్గీయులపై పోలీసులు లాఠీచార్జి చేసి వారే రాళ్లు రువ్వారని దర్శి పట్టణ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు మరికొందరుపై కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా జరిగిన మూడు సంఘటనలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

దర్శి అసెంబ్లీలో అత్యధికంగా 90.91 శాతం పోలింగ్

దర్శి, మే 14 : దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 90.91 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కంటే ఇక్కడే అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,26,370 మంది ఓటర్లు ఉండగా 2,05,792 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషలు 1,03,931 మంది ఓటు వేయగా మహిళలు 1,01,860 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడవ రకంకు చెందిన ఒక ఓటు నమోదైంది. నియోజకవర్గంలో అత్యధికంగా దర్శి మండలంలోని చిన్నఉయ్యాలవాడ పోలింగ్ బూత్‌లో 98.64 శాతం పోలింగ్ నమోదైంది. అతి తక్కువగా దర్శి పట్టణంలోని 113 నెంబరు బూత్‌లో 68.59 శాతం ఓట్లు పోలయ్యాయి. దర్శి మండలంలో మొత్తం 72,888 మంది ఓటర్లు ఉండగా 64,372 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలోనే అత్యధికంగా నియోజకవర్గంలో పోలింగ్ నమోదు కావటంతో రాజకీయ వర్గాల్లో విశేష చర్చ జరుగుతోంది. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారోనని అంచనాలు వేస్తున్నారు.

పీసీపల్లిలో 86.65శాతం...

పీసీపల్లి, మే 14 : మండలంలో 86.65శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం పురుష ఓటర్లు 14,901 మంది, మహిళా ఓటర్లు 14,462 మంది ఉన్నారు. ఎన్నికల్లో 25,445 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా జంగాలపల్లి(215) పోలింగ్‌కేంద్రంలో 94.09శాతం పోలింగ్ నమోదైంది. ఈ బూతులో 406మంది ఓటర్లు ఉండగా 382మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పామూరులో 82.29 శాతం...

మండలంలోని 68 పోలింగ్ కేంద్రాలలో నమోదైన ఓటింగ్‌ను లెక్కిస్తే 82.29 శాతం పోలింగ్ నమోదైనట్లు మండల ఎన్నికల అధికారి షాకీర్‌పాష చెప్పారు. మొత్తం ఓట్లు 51,575 ఓట్లకు గాను రికార్డుస్థాయిలో 42442 ఓట్లు పోలయ్యాయి.

దొనకొండ మండలంలో 92.16 శాతం...

దొనకొండ, మే 14 : మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో 92.16 శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం. మండలంలో మొత్తం 37,805 మందికి గాను 34,844 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.







అర్ధరాత్రి వరకు.. పోలింగ్

- రిసెప్షన్ సెంటర్లకు చేరిన ఈవీఎంలు
- మంగళవారం మధ్యాహ్నంతో ప్రక్రియ ముగింపు
- స్ట్రాంగ్‌రూంల్లో నేతల భవిష్యత్‌కు కట్టుదిట్టమైన భద్రత
- గంటల తరబడి సాగిన ప్రక్రియ.. ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

బాపట్ల మే 14 (ఆంధ్రజ్యోతి): సోమవారం పోలింగ్ సంద ర్భంగా సాయంత్రం 6 గం టలకు గడు వు ముగిసే సమయానికి క్యూలో ఉన్న వారందరికీ ఓటు వేసే సౌలభ్యాన్ని ఈసీ కల్పించింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా లోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు పోలిం గ్ జరిగింది. తేదీ మారితే సాంకేతి కంగా ఈవీఎంల విషయంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉండేది. అయితే అర్ధరాత్రి 12 గంటల లోపలే పోలింగ్ ప్రక్రియను అధికారు లు ము గించారు. ఆ తర్వాత పోలీసు రక్షణలో ఆయా నియోజకవర్గాలకు సం బంధించి ఈవీఎంలను పోలీసు రక్షణ లో రిసెప్షన్ సెంటర్లకు తర లించారు. పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ ముగిసిన తర్వాత



బాపట్ల: ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి సీల్ వేయిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తదితరులు.

ఏజంట్ల సమక్షంలో సీల్ వేసిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించారు. దీంతో అర్ధరాత్రి తర్వాత పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలతో బస్సుల్లో బయలుదేరిన సిబ్బంది, మంగళవారం ఉదయం వరకు రిసెప్షన్ సెంటర్లకు వస్తూనే ఉన్నారు. దీంతో గుంటూరు లోక్‌సభ, అసెంబ్లీలకు సంబంధించి నాగార్జున యూనివర్సిటీ, బాపట్లకు సంబం ధించి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, పల్నాడు కు సంబం ధించి నరసరావుపేట సమీపంలోని కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశా లలను రిసెప్షన్ సెంటర్లు రాత్రంతా సందడిగా మారా యి. నియోజకవర్గాల వారీగా కేటాయించిన స్టాల్స్‌లో ఆర్వోల సమక్షంలో ప్రక్రియ పూర్తి చేశారు. కలెక్టర్, ఎస్పీ, సంబంధిత ఆర్వోల సమక్షంలో స్ట్రాంగ్‌రూంలలో ఈవీఎంలను భద్రపరిచి సీల్ వేసే ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. పోలింగ్ ప్రక్రియ ముగించి ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించడంతో విధుల్లో పాల్గొన్న యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ్‌సింగ్, ఖాజన్‌సింగ్, ఎస్పీ వకుల్ జిందాల్‌ల ఆధ్వర్యంలో స్ట్రాంగ్‌రూమ్‌లలో యంత్రాలను భద్రపరిచి రూమ్‌లకు సీల్ వేశారు. నరసరావుపేటలో రిసెప్షన్ సెంటర్ లోని స్ట్రాంగ్ రూంలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్, ఎన్నికల పరిశీలకులు శ్రీబూరే సర్వేశ్వరనరేంద్ర, శ్రీహరిప్రతాప్ సింగ్‌షాహి, ఎస్పీ బిందుమాధవ్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తదితరుల సమక్షంలో సీలు వేశారు.

స్ట్రాంగ్‌రూముల్లో నేతల భవిష్యత్

లక్షలాదిమంది ప్రజలు వ్యయ ప్రయాసలు కోర్చి ఇచ్చిన తీర్పు స్ట్రాంగ్ రూములలో భద్రంగా ఉంది. గుంటూరు, నరసరావుపేట, బాపట్లలోని రిసెప్షన్ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. చీమ చిటుక్కుమన్నా పసిగట్టేలా సీసీ కెమెరాలు అమర్చారు. 24 గంటల పాటు ప్రత్యేక నిఘా విభాగం సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తుంది. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు స్ట్రాంగ్ రూమ్స్ వద్ద రెండంచల భద్రత ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే అధికారులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. మొదటి అంచెలో నాలుగు ప్లటూన్‌ల కేంద్ర సాయుధ బలగాలను నియమించారు. రెండో అంచెలో రాష్ట్రస్థాయి సాయుధ బలగాలు భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తుంటాయి. మూడో అంచలో డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో సివిల్ పోలీసులు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తుంటారు. కౌంటింగ్‌కు 20 రోజుల గడువు ఉండడంతో స్ట్రాంగ్ రూమ్స్‌లో ఉన్న ఈవీఎంల భద్రతపై ఎన్నికల సంఘం అధికారులు కూడా ప్రత్యేక దృష్టిసారించారు. దీంతో స్ట్రాంగ్‌రూముల్లోని ఈవీఎంల భద్రతపై గుంటూరు ఎస్పీ తుషార్ డూడి, పల్నాడు ఎస్పీ బిందుమాధవ్, బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్ పర్యవేక్షిస్తున్నారు. అం తేగాక సీసీ కెమెరాల ద్వారా అక్కడ పరిస్థి తులను నిరంతరం గమనిస్తూ ఉన్నారు.

తగలబెట్టండి.. చంపేయండి

- మన జోలికి రావాలంటే గుండెలదరాలి
- తెలంగాణ హాల్దియా నుంచి వచ్చిన రౌడీలు
- 300 మందితో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హల్‌చల్
- కారంపూడిలో టీడీపీ కార్యాలయం ధ్వంసం.. కారు దహనం
- పల్నాడులో పోలింగ్ అనంతరమూ పెట్రేగిన వైసీపీ మూకలు
- కొత్త గణేశునిపాడులో కాసు, అనిల్‌కుమార్ హల్‌చల్
- సంతగుడిపాడు.. మాదలలో టీడీపీ వర్గీయులపై దాడులు
- పల్నాడులో భయం భయం.. భారీగా పోలీసుల మోహరింపు

మాచర్ల నియోజకవర్గంలో మనకు ఎదురుండకూడదు. ఎదిరించే వారిని అంతం చేద్దాం. పోలింగ్ రోజున మనపై ఎదురు తిరుగుతారా.. నా కొడుకులందరినీ చంపేద్దాం.. ఆస్తులు తగలబెడదాం.. మన పేరు చెప్తే నియోజకవర్గం మొత్తం హడలిపోవాలి.. పది కాలాలపాటు మన జోలికి రావాలంటే ప్రత్యర్థుల గుండెలు అదిరిపోవాలి. తన్నండి.. తరమండి.. తగలబెట్టండి.. ఎవర్నీ వదిలిపెట్టొద్దు.

\- అంటూ ఎమ్మెల్యే పీఆర్కే సోదరుడు వెంకట్రామిరెడ్డి రౌడీ మూకలను రెచ్చగొట్టాడు.

కారంపూడి, మాచర్లటౌన్, మాచవరం, నరసరావుపేట, మే 14: పల్నాడులో పోలింగ్ అనంతరం నెలకొన్న పరిణామాలకు పిన్నెల్లి సోదరుడి వ్యాఖ్యలే నిదర్శనం. ఎన్నికలకు ముందు దాడులు, దౌర్జన్యాలతో భయాందోళనలు సృష్టించిన వైసీపీ మూకలు పోలింగ్ అనంతరం కూడా పెట్రేగిపోయారు. పోలింగ్ రోజైన సోమవారం మధ్యాహ్నం నుంచి పల్నాడు జిల్లాలో పలు ప్రాంతాల్లో టీడీపీ వర్గీయులే లక్ష్యంగా దాడులకు దిగారు. మంగళవారానికి ఈ దాడుల పరంపర పతాకస్థాయికి చేరింది. ముందస్తు చర్యలు తీసుకోవడంలో పోలీస్ శాఖ విఫలమైంది. దీంతో వైసీపీ శ్రేణులకు అడ్డంకి లేకుండా పోయింది. వైసీపీ మూకలు దాడుల నేపథ్యంలో ఏ నిమిషంలో ఏమి జరుగుతుందోనని ప్రజలు భయంభయంగా గడపాల్సి వచ్చింది. కారంపూడిలో వైసీపీ రౌడీ మూకలు చెలరేగిపోయాయి. టీడీపీ కార్యాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌వలికి చెందిన కారును ఆపి అందులో ప్రయాణిస్తున్న ఇద్దర్ని కొట్టి కారును దహనం చేశారు. వెంకట్రామిరెడ్డితో మాచర్ల నుంచి వచ్చిన 300 మంది రౌడీమూకలు కారంపూడిలో చెలరేగిపోయాయి. గృహాలపై, షాపులపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. మహిళలు ఇళ్ల తలుపులు వేసుకుని బిక్కుబిక్కుమంటూ తలదాచుకున్నారు. బ్రహ్మారెడ్డి డౌన్ డౌన్.. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ వీరంగం చేశారు. చివరకు పోలీసు బలగాలు రాకతో వైసీపీ మూకలు వెనుదిరిగాయి.



సీఐ నారాయణస్వామికి గాయాలు

కారంపూడిలో వైసీపీ రౌడీమూకలను నివారించేందుకు వచ్చిన సీఐ నారాయణస్వామి రాళ్ల దాడిలో గాయపడ్డారు. ఎస్పీ బింధుమాదవ్ కారంపూడికి చేరుకున్నారు. సీఐ నారాయణస్వామిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పిన్నెల్లి సోదరుల హౌస్‌అరెస్టు

మాచర్ల నియోజకవర్గంలో పలుచోట్ల విధ్వంసాలకు పాల్పడిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా దుకాణాలు మూసివేయించారు. బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే పీఆర్కే ఇంటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు

పోలింగ్ రోజున.. పోలింగ్ పూర్తి అయ్యాక వైసీపీ మూకలు విధ్వంసం నేపథ్యంలో జిల్లా అంతటా 144 సెక్షన్ అమలుకు కలెక్టర్ శివశంకర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జరా చేశారు. దీంతో పోలీసు శాఖ సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేసింది.

నివురుగప్పిన నిప్పులా నరసరావుపేట

నరసరావుపేటలో కూడా దాడులు జరుగుతాయన్న సమచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నరసరావుపేటలో పరిస్థితి నివురుకప్పిన నిప్పులా ఉంది. పట్టణవాసులు ఎప్పుడు ఏం జరుగుతుందోన్న భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి వైసీపీకి చెందిన యువకులు కర్రలతో ద్విచక్ర వాహనాలపై హల్‌చల్ చేశారు. రోడ్డుపై ఉన్న అమాయకులపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు గృహాలు, పార్టీ కార్యాల యాల వద్ద పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో మంగళవారం టీసీ వర్గీలపై వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. దాడిలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు గాయ పడ్డారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

టీడీపీ శ్రేణులకు అండగా జిల్లాకు పార్టీ ప్రత్యేక కమిటీ

మాచర్లలో హింసాత్మక సంఘటనలపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు డీజీపీకి ఫిర్యాదు చేశారు. జిల్లాలో జరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో కార్యకర్తలకు అండగా నిలబడేందుకు ఏడుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. కమిటీలో సభ్యులుగా పార్టీ నేతలు వర్ల రామయ్య, నక్కా ఆనందబాబు, బొండా ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, లావు శ్రీకృష్ణదేవరాయులు, జంగా కృష్ణమూర్తి, జూలకంటి బ్రహ్మారెడ్డిలను నియమించారు.

భారీ హింసకు పన్నాగం?

- హౌస్ అరెస్టులో ఉన్నా ఫోన్‌లో పిన్నెల్లి ఆదేశాలు

హౌస్ అరెస్టులో ఉన్న ఎమ్మెల్యే పిన్నెల్లి బ్రదర్స్ ఫోన్ ద్వారా తన మూకకు ఆదేశాలు ఇస్తూ దాడులు చేసే పన్నాగానికి కుట్ర పన్నుతున్నట్లు టీడీపీ వర్గాలు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వందల మంది ప్రైవేటు సైన్యాన్ని దింపిన పిన్నెల్లి ఈ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా నిలిచిన నాయకులను టార్గెట్ చేసుకుని దాడులకు పన్నాగం చేస్తున్నట్లు ఫిర్యాదు చేశాయి. టీడీపీకి మద్దతుగా నిలిచిన మైనారిటీలు ఉండే నాగిరెడ్డి బజారు, మాచర్ల పాతపట్టణం కన్యకాపరమేశ్వరి గుడి సమీపంలో వైసీపీ ప్రైవేటు సైన్యం మోహరించినట్లు టీడీపీ నేతలు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. పిన్నెల్లి సోదరుల ఇంటి మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో రెండు ప్లాటూన్ల ఎస్‌పీఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి. గుంటూరు నుంచి మరో 100 మంది కేంద్ర బలగాలను మాచర్లకు రప్పించనున్నారు. బస్టాండ్ సెంటర్, రింగురోడ్డు, పార్కు సెంటర్ తదితర ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో పోలీసు పికెటింగ్ నిర్వహిస్తున్నారు. ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ బిందుమాధవ్ మాచర్లకు చేరుకున్నారు.

విందు ఇచ్చి.. విధ్వంసం

మాచర్ల నియోజకవర్గంలోని తన అనుయాయులను పిన్నెల్లి సోదరుడు నమ్మలేదు. దీంతో తెలంగాణలోని నల్గొండ జిల్లా హాలియా మండలం కంభాలపల్లి నుంచి 300 మంది రౌడీలను మాచర్లకి రప్పించారు. వీరందరికీ మాచర్ల-సాగర్ ప్రధాన రహదారిలోని ఆర్టీసీ గ్యారేజీ పక్కన ఉన్న వెంచర్‌లో మందు, విందు ఏర్పాటు చేశారు. వీరందరిని రెచ్చగొట్టి 30 కార్లలో పోగేసుకుని కారంపూడి చెక్‌పోస్టు సెంటర్‌కు చేరుకున్నారు. రాడ్లు, కర్రలు, మారణాయుధాలు చేతబూని 300 మంది రౌడీలు పట్టణంపై విరుచుకుపడ్డారు. టీడీపీ కార్యాలయం ధ్వంసం చేశారు. టీడీపీ నేత కారు దహనం చేశారు. అనంతరం చిరువ్యాపారుల దుకాణాలను ధ్వంసం చేస్తూ రాళ్లు రువ్వారు. సుమారు గంటసేపు టీడీపీ సానుభూతిపరులు ఇళ్లను, దుకాణాలను, వాహనాలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు కారంపూడికి చేరుకుని వెంకట్రామిరెడ్డిని, రౌడీమూకలను కారంపూడి నుంచి బయటకు వెళ్లగొట్టారు. కాగా వీరంతా మాచర్ల మండలం రాయవరం జంక్షన్‌కు చేరుకున్నారు. పోలింగ్ రోజున రెంటచింతల మండలం పాలువాయిగేటులో వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తనయుడుపై జరిగిన దాడిని అవమానంగా భావించి ఆ గ్రామాన్ని ధ్వంసం చేయడానికి సిద్ధమయ్యారు. పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. అక్కడి నుంచి నేరుగా మాచర్ల పట్టణంలోకి తీసుకొచ్చారు. రౌడీ మూకలు పట్టణ శివారులోని కొత్తపల్లి, రాయవరం జంక్షన్ వంటి పలు నిర్మానుష్యప్రాంతాల్లో తిష్టవేశారు. ఏ క్షణానైనా నియోజకవర్గంలోని టీడీపీ సానుభూతిపరుల గ్రామాలపై పడి దాడి చేయాలని కాసుక్కూర్చున్నారు.

కొత్తగణేశునిపాడులో ఉద్రిక్తత

మాచవరం మండలం కొత్తగణేశునిపాడులో మంగళవారం మధ్యాహ్నం వైసీపీ నేతలు రెచ్చిపోయారు. వైసీపీ నేతల పరామర్శ పేరుతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన అనిల్‌కుమార్, కాసు మహేష్‌రెడ్డి నాలుగు వందల మంది అనుయాయులు కర్రలతో గ్రామంలో వీరంగం సృష్టించారు. టీడీపీ వర్గీయుల ఇళ్లపై రాళ్లతో దాడులకు దిగారు. చల్లగుండ్ల సాంబశివరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు గృహాలకు సంబంధించిన అద్దాలు ధ్వంసమయ్యాయి. అనంతరం వైసీపీ గూండా మూకలు కర్రలతో టీడీపీ వర్గీయుల ఇళ్లపై దాడులు చేసేందుకు ప్రయత్నించగా టీడీపీ వర్గీయులు కూడా దీనికి ప్రతిస్పందించడంతో వివాదం తీవ్రస్థాయికి చేరింది. మాచవరం, పిడుగురాళ్ల, పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపేందుకు సిద్ధమయ్యారు. అనంతరం అనిల్‌కుమార్, కాసు మహేష్‌రెడ్డిలను పోలీసులు మరో మార్గం నుంచి పిడుగురాళ్లకి తరలించారు. టీడీపీ వర్గీయులు ఏమి జరుగుతుందోనన్న ఆందోళనతో ఒకచోట గుమిగూడారు. ఆ తర్వాత వైసీపీ మూకలు వివిధ మార్గాల ద్వారా పిడుగురాళ్లకి చేరుకున్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది. గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతుంది. పిడుగురాళ్లలో అనిల్‌కుమార్, కాసు విలేకర్లతో మాట్లాడుతూ ఈ రోజు 400 మందితో వచ్చాం. ఈ సారి 4 వేల మందితో వస్తామని కొత్తగణేశునిపాడు వాసులను హెచ్చరించారు.



కొత్తగణేశునిపాడులో పార్టీ శ్రేణులతో కలిసి గుంపుగా వెళ్తున్న అనిల్‌కుమార్ యాదవ్, కాసు మహేష్‌రెడ్డి

కొనసాగిన వైసీపీ దాడుల పర్వం

బాపట్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓటర్లను భయ భ్రాంతులకు గురిచేసి పోలింగ్ శాతం తగ్గించాలనే కుట్రలో భాగంగా సోమవారం ఉదయం నుంచి టీడీపీ శ్రేణులే లక్ష్యంగా వైసీపీ మూకలు చేసిన దాడులు రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగాయి. వైసీపీ నేతలు శ్రేణులను వెంటేసుకుని బూత్‌ల వద్ద వీరంగం సృష్టించారు. పర్చూరు మండల పరిధిలోని యద్రంవారిపాలెంలో ఏజెంట్లుగా కూర్చున్న వారిని చంపేస్తామని బెదిరించిన వైసీపీ నేతలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పలు చోట్ల పొద్దుపోయే వరకు వైసీపీ నేతలు దాడులు చేస్తూనే ఉన్నారు. బాపట్ల రూరల్ పిన్నిబోయినవారిపాలెంలో అర్ధరాత్రి ఇరువర్గాలు పరస్పరం కవ్వించుకుని వాహనాలు తగలబెట్టుకున్నాయి. పూండ్ల గ్రామంలో అర్ధరాత్రి వరకు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చీరాలలో సోమవారం రాత్రి ఆమంచి, కరణం వర్గీయుల మధ్య ఘర్షణలు జరగడంతో పట్టణంలో ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం నెలకొంది. కర్లపాలెం మండలం ఏట్రావారిపాలెం, పేరలిలో పరస్పరం జరిగిన దాడుల్లో వైసీపీ, టీడీపీ కార్యకర్తలకు గాయలయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా 13 కేసులు నమోదు

సోమవారం పోలింగ్ సందర్భంగా తలెత్తిన ఘర్షణలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 13 కేసులు నమోదయ్యాయి. ఇందులో చీరాల నియోజకవర్గంలో 6, బాపట్ల పరిధిలో 3 నమోదుకాగా ఇందులో కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోనే రెండు ఉన్నాయి. రేపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా 2, వేమూరు 1, పర్చూరు పరిధిలో 1 కేసు నమోదయ్యాయి.

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల, మే 14 : సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ నిష్పక్షపాతంగా, సమర్ధవంతంగా విధులు నిర్వహించిన పోలీసుసిబ్బంది, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, విద్యార్థులను అభినందిస్తున్నట్లు తెలిపారు. అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయన్నారు. ఈవీఎం బాక్స్‌లను, ఎన్నికల సామగ్రిని, పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులను, సాయుధబలగాల ఎస్కార్ట్‌తో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు చేర్చటం జరిగిందన్నారు. పోలీసులు, అధికారులతోపాటు కేంద్ర సాయుధబలగాలు, తమిళనాడు పోలీసులు సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ నిష్పక్షపాతంగా నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వహించటం వల్ల జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటున్న ప్రదేశాలకు 5 నిమిషాల వ్యవధిలో పోలీసు బలగాలు చేరుకొని శాంతిభద్రతలను పరిరక్షించటం జరిగిందన్నారు. పోలీస్‌సిబ్బంది వేగంగా స్పందించటానికి, సమర్ధవంతంగా శాంతిభద్రతలను పరిరక్షించటానికి సమర్ద్‌మొబైల్ యాప్ ఎంతగానో దోహదపడిందన్నారు. జిల్లాలోని కొన్ని ప్రదేశాలలో వివాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయని, ఆ ప్రదేశాలలో పికెట్స్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గొడవలకు కారణమైన వారిపై, ఘర్షణలో పాల్గొన్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. సమర్ధవంతంగా ఎన్నికల విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికి ఎస్పీ అభినందనలు తెలిపారు.

పొన్నూరుకు.. విపత్తు

- ఫారాలు గల్లంతు.. తేలని పోలింగ్ శాతం
- ఎన్నికల ప్రక్రియలో ఆది నుంచీ గందరగోళమే
- జిల్లా అధికారులను చికాకు పెట్టిన ఎన్నికల యంత్రాంగం

గుంటూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ఉద్యోగులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఎక్కడా తేడా జరగకుండా అప్రమత్తంగా చూడాలి. అయితే గుంటూరు లోక్‌సభ పరిధిలోని పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఎన్నికల సంఘానికి చికాకు తెప్పించారంటే పరిస్థితి అర్థం చేసుకోవ చ్చు. పొన్నూరు ఆర్వోగా విపత్తుల నిర్వహణ శాఖ డిప్యూటీ కలెక్టర్ అనంత లక్ష్మీకు మారిని నియమించారు. ఎన్నికల నిర్వహణలో అనుభ వరాహిత్యం స్పష్టంగా కనిపించింది. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి కూడా ఇక్కడ పలు విషయాల్లో గందరగోళం నెలకొంది. పోస్టల్ బ్యాలెట్ సందర్భంగానే తీవ్ర గందరగోళం తలెత్తింది. ఆ సమయంలో ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆర్వో లేక పోవడంతో ఓ దశలో ఆమెపై చర్యలకు కూడా సిఫార్సు చేయాలని అధికారులు భావించారు. ఎన్ని కల ప్రక్రియకు సంబంధించి ప్రతీ విషయంలో పొన్నూరు వెనుకనే ఉండేది. కనీసం పోలింగ్ సందర్భంగానైనా అధికారుల తీరు మారుతుందని ఆశించారు. అయితే ఎలాంటి మార్పు లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చిన పరిశీలకులు కూడా కొంతమేరకు అసంతృప్తికి గురైనట్లు తెలిసింది. పోలింగ్‌ని సకాలంలో పూర్తి చేయడంలో పొన్నూరు నియోజకవర్గంలోని అధికారులు విఫలమయ్యారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ డెయిరీలు, పలు ఫారాలు గల్లంతు కావడంతో పోలింగ్ శాతాన్ని ఒక కొలిక్కి తీసుకురావడంలోనూ జాప్యం జరిగింది. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఏకంగా చింతలపూడిలోని పోలింగ్ బూత్‌లోకి వెళ్లి తిష్ఠ వేసినా పట్టించుకోలేదు. వేజండ్లలో సోమవారం రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. సెక్టార్ల వారీగా వాహనాలను వేగవంతంగా రిసెప్షన్ సెంటర్‌కు తరలించడంలో వైఫల్యం చెందారు. అన్ని నియోజకవర్గాల ఈవీఎంలు రూట్ల వారీగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చేరుకోగా పొన్నూరు వాహనాలు మాత్రం ఆలస్యంగా బయలుదేరాయి. అవి రిసెప్షన్ సెంటర్‌కు చేరుకునేసరికే మంగళవారం వేకువజామైంది. ఇక వాటిని స్ట్రాంగ్‌రూంకు చేర్చి సీలు వేసే సరికి మధ్యాహ్నం దాటింది.

మార్కాపురం డివిజన్‌లో..

మార్కాపురం డివిజన్‌లో గత ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన ఆధిక్యతలకు భారీగా గండిపడిందనే విషయం తేటతెల్లమవుతోంది. ఈ విషయాన్ని పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థులతోపాటు ఆ పార్టీ నేతలందరూ అంగీకరిస్తున్నారు. ఈ పరిస్థితి ఓటర్లలో వచ్చిన బలమైన మార్పునకు టీడీపీ అనుకూల వాతావరణానికి దర్పణం పడుతుందనేది విశ్లేషకుల అంచనా. గత ఎన్నికల్లో గిద్దలూరులో 81వేల ఓట్ల ఆధిక్యతతో వైసీపీ గెలుపొందింది. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థి గెలుపుపై ఆ పార్టీశ్రేణులు ధీమాకు రావటం విశేషం. వైసీపీ అభ్యర్థి నాగార్జునరెడ్డి కుటుంబసభ్యులు మార్కాపురంలో చేసిన భూదందాల వ్యవహారం ప్రజల నోళ్లలో విస్తృతంగా నానింది. ఇక జనసేన కలయిక ద్వారా బలమైన ఓటు బ్యాంకు కలిగిన కాపు సామాజికవర్గం నుంచి టీడీపీకి మంచి మద్దతు లభించింది. పట్టణ ప్రాంతాలన్నీ టీడీపీకి అనుకూలంగా కనిపించాయి. గిద్దలూరు నగర పంచాయతీ, రూరల్ మండలం, కంభం, రాచర్ల, కొమరోలు మండలాల్లో ఆధిక్యతపై టీడీపీ పూర్తి ధీమాగా ఉంది. బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల్లో వైసీపీకి ఆధిక్యత వచ్చినా గతం అంత రాదనేది టీడీపీ శ్రేణుల నమ్మకం. గిద్దలూరు, కంభంలో కాపు, ఆర్యవైశ్య సామాజికవర్గాలతో పాటు బలహీనవర్గాల నుంచి టీడీపీకి బలం పెరిగింది. దీంతో గిద్దలూరు ప్రాంత ఆధిక్యతతో బయటపడగలమన్న ధీమా టీడీపీ శ్రేణుల్లో ఉంది. వైసీపీ విషయానికొస్తే గత ఆధిక్యతలో సగం పోయినా సగం మిగులుతుందనేది ప్రధాన నమ్మకం.

ఇరుపార్టీలలోనూ ధీమా

మార్కాపురం నియోజకవర్గంలో అభ్యర్థులకు అనుగుణంగా సామాజికవర్గాల వారీ అంశాల ప్రభావం కూడా చోటుచేసుకుంది. గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ గెలిచింది కేవలం 18వేల ఓట్ల ఆధిక్యతతోనే. టీడీపీకి ఆధిక్యత వచ్చే మార్కాపురం పట్టణంలో అభ్యర్థిపరంగా టీడీపీకి మద్దతుగా ఉన్న ఆర్యవైశ్యుల ఓట్ల చీలిక ప్రధానంగా కలిసొస్తుందనేది వైసీపీ నాయకుల అంచనా. అదేసమయంలో ఎప్పుడూ టీడీపీ జెండా పట్టని పట్టణంలోని రెడ్డి సామాజికవర్గం వారు ప్రస్తుతం కూటమి పక్షాన చేరారు. మరో ముఖ్యమైన ముస్లింల ఓట్లపై వైసీపీ బలమైన ఆశతో ఉండగా టీడీపీ అభ్యర్థి నారాయణరెడ్డికి వ్యక్తిగత అనుబంధం ఆ వర్గంతో ఉంది. ఇక ఉద్యోగులు, విద్యాధికులు, వ్యాపారవర్గాలలో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత టీడీపీకి కలిసొస్తుంది. వైసీపీ అభ్యర్థి రాంబాబుకు పూర్వం నుంచి ఉన్న కొన్ని పరిచయాలు కలిసొస్తాయనేది ఆ పార్టీ నమ్మకం. దీంతో పట్టణంలో ఆధిక్యతపై ఇరు పార్టీలు ధీమాగా ఉన్నప్పటికీ టీడీపీకే ఆధిక్యత వచ్చే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మార్కాపురం రూరల్ మండలం, తర్లుపాడు మండలంలో టీడీపీకి ఆధిక్యతకు అవకాశాలు పెరిగాయి. పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో గత వైసీపీ ఆధిక్యతకు గండిపడటం స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ ఆధిక్యత టీడీపీకి మొగ్గుగా వస్తుందా ఎంతో కొంత వైసీపీకి లభిస్తుందా అనేదే ప్రశ్నార్థకం. అయితే గ్రామాల్లో బలమైన రాజకీయపెత్తనం సాగించే రెడ్డి ఓటర్లలో అభ్యర్థిపరంగా టీడీపీకి ఎంతమేరకు సహకరించారు అన్న అంశం కీలకంగా మారింది. ఇక టీడీపీ అన్ని ప్రాంతాలలో సమానంగా ఓటర్ల ప్రభావిత కార్యక్రమాలు చేయగా వైసీపీ ప్రాంతాల వారీ రేటుమార్పి కొంత ఇబ్బందిని ఎదుర్కొన్నారు.

గట్టి పోటీనే...

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసీపీ 31వేల ఓట్లకు పైగా ఆధిక్యతతో గెలుపొందింది. అభ్యర్థులపరంగా చూస్తే టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు ప్రజల్లోకి చొచ్చుకుపోగలిగారు. వైసీపీ అభ్యర్థి ఆ విషయంలో పూర్తిగా వెనుకబడిపోయారు. టీడీపీ కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయగా వైసీపీలో మంత్రి సురేష్ వర్గం కొన్నిచోట్ల సహకరించలేదు. పుల్లలచెరువులాంటి మండలంలో బలమైన రెడ్డి నాయకులు టీడీపీలో చేరిపోయారు. ఎరిక్షన్‌బాబు 25వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందుతానని ప్రకటించుకోగా వైసీపీ నాయకులు 10వేల ఓట్లతో గెలుపు మాదేనని ధీమాగా చెబుతున్నారు. ఒక అంచనా మేరకు పుల్లలచెరువు, వైపాలెం మండలాల్లో టీడీపీకి స్పష్టమైన ఆధిక్యత కనిపిస్తోంది. దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో వైసీపీకే ఆధిక్యత లభించే అవకాశాలున్నాయి. పెద్దారవీడు మండలంలో వైసీపీలోని ఒక వర్గం చాపకింద నీరులా టీడీపీకి సహకరించిందన్న ప్రచారం ఉంది. ఈ నాలుగు మండలాల్లో కొంత అంచనాలు అటుఇటు అయినా త్రిపురాంతకం మండలంలో ఆధిక్యత కీలకమయ్యే అవకాశాలున్నాయి. అక్కడ రెండు పార్టీల్లోను ధీమా కనిపిస్తోంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని చూస్తే గెలుపోటములు ఎలా ఉన్నా గత ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన ఆధిక్యతను టీడీపీ భారీగానే గండికొట్టే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. (మిగిలిన నియోజకవర్గాల విశ్లేషణ రేపటి సంచికలో)

కూటమిలో జోష్...!

జిల్లాలో పెరగనున్న సీట్లు
ఎక్కువ వర్గాల్లో పెరిగిన ఆదరణపై కూటమి నేతల ధీమా
కూటమి పార్టీల్లో ఓట్ల బదలాయింపుపై నమ్మకం
వృద్ధులు, మహిళా ఓట్లు, డబ్బు పంపిణీపైనే వైసీపీ ఆశ
పశ్చిమాన గత ఆధిక్యతలకు గండి
మార్పునకు అదే సూచన

ఓటర్లు తీర్పు ఇచ్చేశారు. అయితే ఫలితాలు వెల్లడయ్యేందుకు మరో 19రోజుల గడువు ఉంది. దీంతో కూడికలు, తీసివేతలపై అభ్యర్థులు, నాయకులు తలమునకలయ్యారు. అంచనాలపై ఒక ఆలోచనతో పందెంరాయుళ్లు, బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ, కూటమి నేతల్లో జోష్ కన్పిస్తుండగా, వైసీపీ నాయకులు ఆశల పల్లకిలో ముందుకు సాగుతున్నారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని చూస్తే గత ఎన్నికల కన్నా మెరుగైన స్థితిలో టీడీపీ కూటమి పరిస్థితి కనిపిస్తోంది. ఈసారి ఎక్కువ స్థానాలు గెలుచుకునే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. మరోవైపు వైసీపీ నాయకులు గత ఆధిక్యతలకు గండిపడినా బొటాబొటీతోనైనా బయటపడతామన్న నమ్మకంతో ఉన్నారు. ఈ అంచనాల ప్రకారం చూస్తే వైసీపీ ఓట్లకు భారీగా గండిపడిందనే విషయం స్పష్టమైంది. మరీ ముఖ్యంగా వైసీపీకి పశ్చిమప్రాంతంలో కూటమి సీట్లు పెరిగే పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనాకు వచ్చారు.



కృతజ్ఞతసభలో మాట్లాడుతున్న కనిగిరి టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాలో గతం కన్నా ఈ పర్యాయం పోలింగ్ శాతం భారీగా పెరిగింది. గత ఎన్నికల్లో సుమారు 79.74శాతం ఉండగా, ఈ పర్యాయం కొత్త ప్రకాశంలోనే పోలింగ్ శాతం 84.26కు చేరింది. ఇక ఉమ్మడి జిల్లాలోని మిగిలిన నాలుగు స్థానాల్లోనూ పోలింగ్ శాతం 80కిపైగా ఉండటం విశేషం. దీంతో ఓటర్లు జిల్లాలో గతం కన్నా ఉత్సాహంగా పోలింగ్‌కు రావడం గమనార్హం. పెరిగిన పోలింగ్ కూటమికి అనుకూలంగా ఉందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

ఓటర్లను ప్రభావితం చేసిన అంశాలు

సాధారణ ఓటర్లను పలు అంశాలు ప్రభావితం చేశాయి. ఆయా సంస్థలు ప్రముఖులు విశ్లేషకుల అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే ప్రభుత్వ వ్యతిరేకత పనిచేసినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ అనుకూల అంశాల కన్నా, వ్యతిరేక అంశాలే ఓటర్లలో కనిపించాయని అంచనా వేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారానే ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ వ్యతిరేకతను ప్రదర్శించారు. యువత, విద్యార్థులలో అది అధికంగా కనిపించింది. ప్రధానంగా మెగా డీఎస్సీ వేయకపోవడాన్ని నిరుద్యోగులు ప్రధానాంశంగా ప్రస్తావించారు. వ్యాపార వర్గాల్లోనూ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి కనిపించింది. తటస్థ ఓటర్లలో కూడా అదేరకం అభిప్రాయం వ్యక్తమైంది. టీడీపీతో జనసేన, బీజేపీ కూటమి కట్టడం ఆయా అభ్యర్థులకు బాగా కలిసివచ్చింది. ప్రధానంగా జిల్లాలో జనసేన ఓట్లు టీడీపీకి బదలాయింపు పూర్తిస్థాయిలో జరగడం స్పష్టంగా కనిపించింది. సామాజికవర్గాల వారీ చూసినా వైసీపీ అనుకూల ఓటర్లలో విద్యాధికులు, ఉద్యోగులు, తటస్థ ఓటర్లలో మార్పు కనిపించింది. అధిక ధరలు, విద్యుత్ చార్జీల పెంపు ప్రభావం బాగా ఉంది. ఇందులో ఎక్కువ అంశాలను వైసీపీ వారు అంగీకరిస్తున్నప్పటికీ పింఛన్‌దారులతోపాటు అమ్మఒడి, చేయూత పథకాల ద్వారా వృద్ధులు, మహిళా ఓటర్ల బలం పెరిగిందని భావిస్తున్నారు. అలాగే టీడీపీతో బీజేపీ కలయిక ద్వారా ముస్లింలలో తమ ఓట్లు చెక్కుచెదరలేదని వారి నమ్మకం.

స్థానిక అంశాలు...

ఆయా నియోజకవర్గాల్లో స్థానిక అంశాల ప్రభావం ఓటర్లపై కనిపించింది. జిల్లాలో ఎక్కువ ప్రాంతాల్లో జరిగిన భూదందాలు, అరాచకాలు, వైసీపీ శ్రేణులు సాగించిన దౌర్జన్య కాండల ప్రభావం సాధారణ ఓటర్లను ప్రభావితం చేసింది. బటన్ నొక్కుడు మినహా సాధారణ అభివృద్ధి పనులు జరగకపోవడం జిల్లా స్థాయిలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఆగిపోగా జగన్ ఇచ్చిన హామీలు ఏవీ నెరవేరలేదు. పశ్చిమ ప్రాంతంలో కూటమి అధికారంలోకి వస్తే మార్కాపురం జిల్లా ఏర్పడుతుందన్న నమ్మకం, ఇటు అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలు జిల్లాలోకి వస్తాయన్న ధీమా ఆయా వర్గాల ప్రజల్లో ఆశ కలిగించింది.

పశ్చిమాన టీడీపీకి పెరిగిన బలం

జిల్లాలో పశ్చిమ ప్రాంతం వైసీపీకి గత ఎన్నికల్లో భారీ మెజార్టీనిచ్చింది. ప్రస్తుతం ఆ ఆధిక్యతలకు గండిపడిందనే అంశాన్ని వైసీపీ నాయకులు కూడా అంగీకరిస్తున్నారు. పశ్చిమంలోని ఐదు స్థానాల్లో కొన్ని టీడీపీ ఖాతాలో పడటం ఖాయమని తేలిపోయింది. మిగిలిన స్థానాల్లో గెలుపోటముల మధ్య సాధారణ ఆధిక్యతలే దోబూచులాడుతున్నాయి. కనిగిరిలో టీడీపీ విజయం ఖాయమన్న భావన అందరిలోనూ కనిపిస్తోంది. వైసీపీ శ్రేణులు ఐదువేల ఓట్ల ఆధిక్యతతో గెలుస్తామని ధీమాతో ఉండగా, టీడీపీ శ్రేణులు 15వేలకుపైగా ఆధిక్యత వస్తుందన్న ధీమాతో ఉన్నారు. పామూరు మండలం టీడీపీకి మంచి ఆధిక్యం రాబోతుంది. వీసీపల్లి, సీఎస్‌పురం మండలాల్లోనూ ఆ పార్టీకే ఆధిక్యత వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కనిగిరి పట్టణంలో టీడీపీకి మంచి ఆధిక్యత లభించబోతుంది. గ్రామాల్లో ఒక వర్గం వైసీపీ ఓటర్లు టీడీపీకి కొంతమేరకు సహకరించారు. దీంతో మండలం మొత్తం మీద ఆధిక్యతకు అవకాశాలున్నాయి. వెలిగండ్ల, హెచ్‌ఎంపాడు మండలాల్లో గట్టి పోటీ జరిగినా మొత్తంగా టీడీపీకి విజయావకాశాలు ఉన్నాయి. ఇక్కడ ఓట్ల కొనుగోలులోనూ వ్యత్యాసం కనిపించడం లేదు.

దర్శిలో నువ్వానేనా..

దర్శిలో పోటీ నువ్వా?నేనా? అన్నట్లు సాగిన మాట నిజం. టీడీపీ అభ్యర్థికి టీడీపీ, జనసేనలు ఐక్యంగా పనిచేయడం ప్లస్ పాయింట్. వైసీపీ అభ్యర్థికి ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరగణం సహకరించలేదు. ఓట్ల ప్రభావిత అంశాల్లో రెండు పార్టీలు ఢీ అంటే ఢీ అన్నాయి. తాళ్లూరు మండలంలో వైసీపీ ఆధిక్యతకు, ముండ్లమూరు మండలంలో టీడీపీకి వచ్చే ఆధిక్యత సరిపోతుందని అంచనా. దొనకొండ మండలంలో ఎవరికైనా స్వల్ప ఆధిక్యత రావచ్చు. వైసీపీ అనుకున్నట్లు స్వల్ప ఆధిక్యత వారికి వచ్చినా కురిచేడులో టీడీపీ వచ్చే ఆధిక్యత దానిని మింగేస్తుంది. దర్శి నగరపంచాయతీ, రూరల్ మండలాలు కీలకంగా మారాయి. ఇక్కడ ఆధిక్యతపై ఇరుపార్టీల్లోనూ ధీమా కనిపిస్తున్నా, టీడీపీవైపు మొగ్గు ఉండటం విశేషం.

సూపర్ సిక్స్ బాగా పనిచేసింది

కాగా ఓటర్ల నాడిని పసిగట్టే ప్రయత్నం చేసిన కొన్ని సంస్థల వారు ఆసక్తికర అంశాలను వెల్లడిస్తున్నారు. పింఛన్‌దారులైన వృద్ధుల్లో ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడం పట్ల వైసీపీకి ఆదరణ కనిపించిన మాట నిజమేకానీ అదేసమయంలో పింఛన్ నాలుగు వేలకు పెంపుదల చేస్తామని టీడీపీ హామీనివ్వడం, అదీ ఏప్రిల్ నుంచి ఇస్తామని ప్రకటించడం, బీసీలకు 50ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పడం మంచి ఫలితాలు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. అదే సమయంలో వైసీపీ తన మేనిఫెస్టోలో పింఛన్ పెంపుపై ఇచ్చిన హామీ పింఛన్‌దారులకు నచ్చలేదు. ఈ విషయం బహిరంగంగానే చాలామంది వ్యక్తం చేశారు. మహిళల్లో టీడీపీ ప్రకటించిన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రభావం కనిపించింది. ఇక అన్ని సామాజిక వర్గాల్లోని రైతుల్లో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పట్ల వ్యతిరేక బహిర్గతమైంది. మాల సామాజికవర్గం ఓటర్లలో వైసీపీకి ఆధిక్యత కనిపించింది. అందులోనూ నిరుద్యోగులు, ఉద్యోగులు పట్టణాల్లో విద్యుత్ బిల్లులు ఉచిత సౌకర్యాన్ని కోల్పోయిన వారిలో వైసీపీ పట్ల కొంత వ్యతిరేకత కనిపించింది. మాదిగ సామాజికవర్గంలో వర్గీకరణకు ఎన్‌డీఏ కూటమి అనుకూలంగా ఉండటం కూటమివైపు సానుకూలతను పెంచింది.

జిల్లాలో భారీ పోలింగ్

14,01,614 మంది ఓటుహక్కు వినియోగం
గత సాధారణ ఎన్నికల కంటే ఎనిమిది శాతం అదనం
దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 91శాతం
జిల్లావ్యాప్తంగా 88.17శాతం మంది ఓటేశారు

ఒంగోలు(కలెక్టరేట్), మే 14: ఒంగోలు పార్లమెంట్ పరిధిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో జిల్లా ఓటర్లు భారీగా పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచే రాత్రి పొద్దుపోయే వరకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలలో ఓటర్లు నిల్చున్నారు. ఒకవైపు అనుకున్నంత స్పీడ్‌గా ఈవీఎంలు పనిచేయకపోవడం, ఇంకొకవైపు కేంద్రాలకు ఓటర్లు భారీగా తరలిరావడంతో పోలింగ్ ఆలస్యమైంది. ఓటర్లు గంటల తరబడి క్యూలలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని నియోజకవర్గాల్లో సోమవారం అర్ధరాత్రి వరకు కూడా ఓటింగ్ జరిగింది. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో 16,07,832 మంది ఓటర్లు కాగా అందులో పురుషులు 8,02,483 మంది, మహిళలు 8.05,242 మంది, థర్డ్ జెండర్ 107మంది ఉన్నారు. అయితే 14,01,614 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అయితే ఓటుహక్కు వినియోగంలో మహిళల కంటే పురుషులే ముందున్నారు. అలా జిల్లావ్యాప్తంగా 87.17శాతం మంది ఓటేయడం జిల్లా చరిత్రలో ఇదే మొదటిసారి. జిల్లాలో అత్యధికంగా దర్శి నియోజకవర్గంలో 91శాతం మంది ఓటుహక్కును వినియోగించుకోగా, అత్యల్పంగా ఒంగోలు నియోజకవర్గంలో 84.56శాతం మంది ఓటేశారు.

మహిళల కంటే పురుష ఓటర్లే ఎక్కువ వినియోగం

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో మహిళల కంటే పురుష ఓటర్లే అధికంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 14,01,614 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 7,00,983 మంది ఓటు వేయగా మహిళలు 7,00,565 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మహిళల కంటే పురుషులు 418 మంది తమ ఓటుహక్కును అధికంగా వినియోగించుకున్నారు. కొన్నిచోట్ల మహిళలే ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకోగా, జిల్లావ్యాప్తంగా సరాసరిన చూస్తే పురుష ఓటర్లే స్వల్పంగా ముందుడడం విశేషం.

నియోజకవర్గం	మొత్తం	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జండ్	పోలైనవి	శాతం
వైపాలెం	2,07,214	93,944	91,296	02	1,85,242	89.40
దర్శి	2,26,370	1,03,765	1,02,227	01	2,05,993	91.00
ఒంగోలు	2,40,242	98055	1,05,050	38	2,03,143	84.56
కొండపి	2,39,609	1,05,174	1,06,174	02	2,11,350	88.21
మార్కాపురం	2,14,608	95,195	92,750	07	1,87,952	87.58
గిద్దలూరు	2,39,710	1,00,318	1,02,809	09	2,03,136	84.74
కనిగిరి	2,40,079	1,04,532	1,00,259	07	2,04,798	85.30
మొత్తం	16,07,832	7,00,983	7,00,565	66	14,01,614	87.17

ఒంగోలు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే కీలకం

ఒంగోలు నియోజకవర్గంలో మహిళా ఓటర్లే గెలుపు ఓటములు నిర్ణయించనున్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఒంగోలులో 2,40,242 మంది ఓటర్లు ఉండగా పురుషులు కేవలం 98,055 మంది ఓటు వేశారు. మహిళలు 1,05,050 మంది వినియోగించుకున్నారు. పురుషుల కంటే 6,995 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు. దీంతో ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములపై చర్చ నడుస్తోంది.

దర్శిలో వైసీపీ బరితెగింపు

టీడీపీ శ్రేణులపై విచక్షణారహితంగా దాడులు
అసహ్యించుకుంటున్న ప్రజలు

దర్శి, మే 14 : నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా వైసీపీ మూకలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడటం పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను వైసీపీ ఉద్దేశపూర్వకంగా రక్తమయం చేసి అనేక గ్రామాల్లో దాడులు, దౌర్జన్యాలు నిరాటంకంగా జరిగిన విషయం తెలిసిందే. మండలంలోని బొట్లపాలెంలో వైసీపీశ్రేణులు చేసిన దాడిలో సమిడిశెట్టి శ్రీనివాసరావు, బత్తెన నరేంద్ర తలలకు తీవ్ర గాయాలుకాగా మరి కొంత మంది గాయపడ్డారు. గాయపడిన వారిని రక్షించుకునేందుకు అక్కడకు వెళ్లిన టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని దుర్భాషలాడారు. దాడులను ఖండిస్తూ ఆమె రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసినప్పటికీ పోలీస్ అధికారుల్లో మార్పురాలేదు. పోలీసులు వైసీపీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహించినందున వైసీపీ గూండాలు యథేశ్చగా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ ముందుకు రోజు బొట్లపాలేనికి చెందిన తెలుగుయువత నాయుడు కల్లూరు సుబ్బుపై దాడి చేసిన విషయం తెలిసిందే. అప్పుడే పోలీసులు దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసివుంటే మరునటి రోజు ఇంత దారుణం జరిగేది కాదు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహించినందున సుబ్బుపై దాడులు చేసిన వ్యక్తులతో పాటు మరికొందరు కలిసి పోలింగ్ రోజు టీడీపీ కార్యకర్తలపై మారణాయుదాలు, కర్రలతో దాడులు చేశారు. దర్శి పట్టణంలోని ఆర్‌ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఓట్లు వేసిన పోలింగ్ తీరును పరిశీలించేందుకు వెళ్లిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిపై దాడికి యత్నించారు. ఆమె కారుపై రాళ్లు వేశారు. ఇంత జరుగుతున్నా అక్కడున్న పోలీసులు ఆ దాడిని నిలువరించలేక ప్రేక్షకపాత్ర పోషించారు. మహిళా అభ్యర్థిపై రాళ్లదాడులకు పాల్పడుతున్న వైసీపీ మూకలను నిలువరించేందుకు టీడీపీ కార్యకర్తలు గట్టిగా ఎదుర్కొనంటంతో పోలీసులు టీడీపీ వారిపై లాఠీచార్జి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు వీసీరెడ్డిపై దాడి చేసిన వారిని వదిలేసి ఈవీఎం పగలగొట్టార్న నెపంతో ఆయనపైనే కేసు పెట్టారు. వాస్తవంగా ఈవీఎం పగులలేదు. టెక్నికల్ సిబ్బంది సహకారంతో బాగు చేయించి పోలింగ్ నిర్వహించారు. పోలీసులు ఏక పక్షంగా కేసు నమోదు చేశారు. ఎర్రఓబన్నపల్లెలో వైసీపీ నాయకులు టీడీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు లాక్కొచ్చినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు టీడీపీ కేడర్‌పై దాడులకు తెగబడ్డారని ప్రజలు చెబుతున్నారు.



వైసీపీ దాడులకు నిరసనగా గాయపడిన బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థి

దర్శి, మే 14 : దర్శి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన తనకు ఓటు వేసిన ప్రజలకు, ఎన్నికల్లో అండగా నిలిచి ముందుండి నడిపించిన కూటమి నాయకులకు కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. దర్శిలో ఓటమి భయంతోనే వైసీపీ దాడులకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ మూకల దాడులను ఎదురొడ్డి టీడీపీ కూటమి కార్యకర్తలు, నాయకులు ధీటుగా ఎదుర్కొన్నారని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటాన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిస్వార్థ సేవ చేసి రుణం తీర్చుకుంటానని తెలిపారు. ఎన్నికల ఆరంభం నుంచి అహర్నిశలు కష్టించి పని చేసిన ప్రజలకు, టీడీపీ కూటమి శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ వర్గీయులపై మూడు కేసులు

దర్శి కూటమి అభ్యర్థిపై రెండు.. ఇంకొకటి మరొకరిపై
బాధితులపైనే రివర్స్ కేసులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 14 : మండలంలో పోలింగ్ సందర్భంగా జరిగిన ఘటనలపై మంగళవారం పోలీసులు ఏకపక్షంగా టీడీపీ వర్గీయులపై మూడు కేసులు బనాయించారు. బొట్లపాలెంలో వైసీపీ మూక టీడీపీ వారిపై దాడి చేసి గాయపరిచారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బాధితులను అండగా నిలిచేందుకు అక్కడకెళ్లి దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని శాంతియుతంగా నిరసన తెలిపారు. పోలీసులు దాడులు చేసిన వారిని పక్కనబెట్టి ధర్నా చేశారన్న నెపంతో ఆమెతోపాటు మరికొందరుపై కేసు నమోదు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ నేత వీసీరెడ్డిపై దాడి చేసిన వారిని వదిలేసి ఈవీఎం పగులగొట్టాడని పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. దర్శి-కురిచేడు రోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించేందుకు అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిని అకారణంగా అడ్డుకుని కారుపై రాళ్లతో దాడి చేశారు. ఆమెను రక్షించేందుకు టీడీపీ వర్గీయులపై ఎదురుతిరిగారు. టీడీపీ వర్గీయులపై పోలీసులు లాఠీచార్జి చేసి వారే రాళ్లు రువ్వారని దర్శి పట్టణ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు మరికొందరుపై కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా జరిగిన మూడు సంఘటనలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

స్ట్రాంగ్‌రూములకు వచ్చిన ఈవీఎంలు

పోలింగ్ సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు(కలెక్టరేట్), మే 14: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను స్ట్రాంగ్‌రూములకు తరలించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజవర్గాల ఈవీఎంలను ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూములకు బస్సులలో తీసుకువచ్చారు. అక్కడ ఆయా నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపర్చారు. ఒంగోలు పార్లమెంట్ ఈవీఎంలు, అసెంబ్లీల ఈవీఎంలను వేర్వేరుగా భద్రపర్చారు. కాగా మంగళవారం మధ్యాహ్నం తర్వాత మార్కాపురం, కనిగిరి, దర్శి, గిద్దలూరు, వైపాలెం నియోజకవర్గాల ఈవీఎంలను ఒంగోలులోని స్ట్రాంగ్‌రూములకు ప్రత్యేక వాహనాల్లో భారీ బందోబస్తు మధ్య తీసుకొచ్చారు. రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను స్ట్రాంగ్‌రూములలో దించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌లు అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. స్ట్రాంగ్‌రూము వద్ద ఆర్వోలు, సిబ్బందితో కూడా మాట్లాడారు. ఆయా స్ట్రాంగ్‌రూంలలో భద్రపర్చిన అనంతరం సీల్ వేశారు. స్ట్రాంగ్‌రూం పరిసర ప్రాంతాల్లో నిరంతరం నిఘాను ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారి వెంటనే ఆయా నియోజకవర్గాల పరిశీలకులు, వివిధ విభాగాల పరిశీలకులు ఉన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రత

నిరంతరం సీసీ కెమెరాలు నిఘా
సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసు పికెట్లు
ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు(క్రైం), మే 14 : స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ స్థానానికి చెందిన ఈవీఎంలు రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌కు మంగళవారం చేర్చి సీల్ వేశారన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలు, రూమ్‌ల బయట ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ బలగాలు, బయట సివిల్ పోలీసులతో నిరంతరం గస్తీ ఉండేవిధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు సమష్టిగా కృషిచేసి చెదురుమదురు ఘటనలు మినహా, ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకునే విధంగా పనిచేశారని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశామని, రాత్రులు గస్తీ చేయమని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించుకునే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా అవాంచనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



గొర్రెల అరుగు..!

చెట్టు కింద అరుగులా కన్పిస్తున్నది అది అరుగు కాదు.. అది గొర్రెల అరుగు. ఎండ తీవ్రతను తట్టుకోలేక గొర్రెలు చెట్టు కిందకు చేరి ఒకచోట అన్నీ నిల్చున్నాయి. ఈ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. అద్దంకి మండలంలోని ధర్మవరం గ్రామ చెరువు గట్టు వద్ద ఉన్న చెట్టు కింద ఎండ తీవ్రతకు గొర్రెలన్నీ వేపచెట్టు కిందికి చేరాయి. అవి చెట్టు నీడ ఉన్నంత వరకు ఒకదానికి పక్కన ఒకటి నిలబడి ఉండడం కనిపించింది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో చెట్టుకిందకు చేరిన ఆ గొర్రెలు సాయంత్రం వరకు అక్కడే ఉంటాయని గొర్రెల యజమాని తెలిపారు.

- అద్దంకిటౌన్

పెరిగిన ఓటింగ్‌తో టీడీపీకి మేలు

- ఓటమి భయంతోనే దాడులు
- వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు
- రాష్ట్రంలో ప్రజా కూటమిదే అధికారం
- అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి



ఏలూరి క్యాంప్ కార్యాలయంలో నాయకులతో ఏలూరి

పర్చూరు, మే 14: రాష్ట్రంలో వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, దోపిడీ, అరాచకం, అన్యాయం, అక్రమాలతో విసిగి వేసారిన ప్రజలు జగన్‌పై కసితో పో లింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొన్నారని ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివ రావు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పర్చూరు నియోజకవర్గానికి చెందిన పలు మండలాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున ఏలూరిని క్యాంపు కార్యాల యంలో కలిసారు. ఆయా మండలాలకు సంబంధించి పోలింగ్ తీరుపై సమీక్షించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా కూటమికి పట్టం కట్టేవిధంగా ప్రజలు ఓటువేసారన్నారు. ప్రజా కూటమి తిరుగులేని మెజార్టీతో అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తమ తమ గ్రా మాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం హర్షనీయమన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పెద్ద ఎత్తున యువత తరలిరావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఓటమి భయంతో అధికార వైసీపీ కుట్రలకు పాల్పడి దాడులు చేసిందన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పాలనపై అపార అనుభవం విజనరీ ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర పునర్నిర్మాణం సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చిన వెను వెంటనే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. ప్రజల నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా ప్రజా పాలనను సాగిస్తామన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడినా ప్రజల అంతిమ తీ ర్పు కూటమికే ఇచ్చారన్నారు. అభివృద్ధి ప్రజా సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలింగ్ విషయంలో నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసారని ఈసందర్భంగా ఏలూరి పేర్కొన్నారు. తన గెలుపునకు సహకరించిన పర్చూరు ప్రజలకు తాను ఎన్నటికీ మరువనన్నారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ మూకలపై కేసు.. రిమాండ్‌కు తరలింపు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మే 14 : సార్వత్రిక ఎన్నికల సమయంలో సోమవారం మండల పరిధిలోని గవినివారి పాలెంలో వైసీపీ నాయకులు గవిని శ్రీను, ప్రసాద్, సిహెచ్ శ్రీను, వెంకటేశ్వర్లు, యేసుబాబు అదే ప్రాంతంలోని టీడీపీ బూత్ ఏజెంట్ నక్కల వెంకటేశ్వర్లు (పండు)ను దాడిచేసి గాయపరిచారు. అంతేకాకుండా విషయం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఎం ఎం కొండయ్యపై కూడా దాడికి యత్నించారు. కారును ధ్వంసం చేశారు. దీంతో అభ్యర్థి ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అంతేకాకుండా వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరినట్లు పోలీసులు తెలిపారు.



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ప్రయాణికులతో బస్టాండ్‌లు కిటకిట

ఎన్నికల కోసం సొంతూళ్లకు వచ్చి తిరుగు ప్రయాణం

అద్దంకిటౌన్, మే 14: ఎన్నికలకు సొంత గ్రామాలకు వచ్చి పనుల కోసం వెళ్లే ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్‌లు కిటకిట లాడుతున్నాయి. సోమవారం జరిగిన ఎన్నికల కోసం గత రెండు రోజుల క్రితమే వివిధ ప్రాంతాలల్లో ఉన్న ఓటర్లు తమ సొంత గ్రామాలకు వచ్చారు. ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం వారు తమ పనుల నిమిత్తం ఆయా ప్రాంతాలకు తరలి పోయేందుకు బస్టాండ్‌కు చేరుకున్నారు. దీంతో బస్సులు కూడా ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఇక ప్రధాన రహదారిపై హైదరబాద్ వైపు వెళ్లే వాహనాలు తిరుగు ప్రయాణంతో రద్దీ నేలకొంది. ఎన్నికల నేపథ్యంలో ఆదివారం, ఎన్నికలు జరిగిన సోమవారం కూడా షాపులు లే కపోవడంతో మంగళవారం పట్టణంలోని షాపుల వద్ద కొనుగోలుదారులతో పాటు దుకాణాలకు సరుకులు తరలించే వాహనాలతో ప్రధాన రహదారులలో వాహనాలు, ప్రజలతో సందడిగా మారాయి. గత రెండు రోజుల నుంచి ఎన్నికల సందర్భంగా షాపులు లేక అద్దంకి చుట్టపక్కల గ్రామాలలో వ్యాపారాలు నిర్వహించుకునే వారు మంగళవారం షాపులు తెరవడంతో సరుకులు కోసం పట్టణానికి రావడంతో పట్టణంలోని షాపులదారులు రద్దీగా మారాయి.

ఏపీఆర్‌జేసీలో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

ఇంకొల్లు, మే 14 : ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో ఆదర్శ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గత నెల 25వ తేదీన జరిగిన ఏపీఆర్‌జేసీ పరీక్షలో ఇంకొల్లు ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు 7గురు 10000లోపు ర్యాంక్‌లు సాధించినట్లు ఆ స్కూల్ కరెస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ తెలిపారు. డీ దివ్యశ్రీ 62, షేక్ ఖాదర్‌బాషా 1041, షేక్ అబ్దుల్ రెహమాన్ 2234, డీ జశ్వంత్ 3941, వీ హరికిరణ్ 5032, కె.జయసూర్య 5629, కె.దేవిశ్రీ 9538 ర్యాంకులు సాధించగా వారిని విజయ భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

వృద్ధులకు చెప్పుల పంపిణీ

మార్టూరు, మే 14 : అమ్మ ఆశ్రమంలో మంగళవారం గుడ్లూరుకు చెందిన అద్దంకి అజయ్‌కుమార్, రాజేశ్వరి దంపతులు వృద్ధులకు అన్నదానం చేయడంతో పాటు వారికి చెప్పులను పంపిణీ చేశారు. వారి కుమారుడు యశ్వంత్ సాయితేజ్ జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. వారికి ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందు కృతజ్ఞతలు తెలిపారు.

వేమవరంలో ఘర్షణపై

కౌంటర్ కేసులు నమోదు

బల్లికురవ, మే 14 : ఎన్నికల పోలింగ్ ముగిసిన తదుపరి వేమవరం ఎస్టీ కాలనీలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు 18 మందిపై కౌంటర్ కేసులు నమోదు చేశామని ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వేమవరంలో పోలింగ్ బూత్ వద్ద చిన్న పాటి ఘర్షణ ఎస్టీ కాలనీలో రెండు వర్గాల మధ్య జరిగింది. వివాదం సద్దు మణిగి అందరూ ఇళ్లకు వెళ్లారు. సోమవారం రాత్రి ఇరువర్గాల వారు మరోసారి ఘర్షణకు దిగారు. వారిలో భూక్యా దేవీబాయ్ అనే మహిళ అదే కాలనీకి చెందిన మూడావత్ హరికృష్ణనాయక్ మరో 8 మంది కలిసి తనపై దాడి చేశారని ఫిర్యాదు చేసింది. అలానే అదే కాలనీకి చెందిన మరోవర్గం మహిళ మూడావత్ నాగాబాయ్ తనపై భూక్యా సాంబబాయ్ మరో పది మంది కలిసి దాడి చేశారని ఫిర్యాదు చేయగా ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కౌంటర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు వేమవరం గ్రామంలోని ఎస్టీ కాలనీని సందర్శించి ఇరు వర్గాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఘర్షణలు పెద్దవి కాకుండా చర్యలు చేపట్టేందుకే ఇరు వర్గాల వారితో సీఐ కౌన్సెలింగ్ చేపట్టారు.

వ్యక్తిపై కత్తితో దాడి

చీరాల - స్వర్ణ రహదారిలో సంఘటన

స్వర్ణ(పర్చూరు), మే 14 : వ్యక్తిపై కత్తితో దాడిచేసిన సంఘటన మంగళవారం చీరాల - స్వర్ణ రోడ్డులో జరిగింది. కారంచేడు మండలం రంగప్పనాయుడువారిపాలెంకు చెందిన నరేంద్ర శ్రీనివాసరావు అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన మాలంపాటి సాయికృష్ణ స్వర్ణ సమీపంలో కత్తితో దాడిచేసి గాయపరినట్లు తెలిసింది. క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. దాడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

వేటపాలెం(చీరాలటౌన్), మే 14 : రైలు పట్టాలు దాటుతూ గుర్తుతెలియని సుమారు 50 ఏళ్ల మహిళ ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటన మంగళవారం వేటపాలెం రైల్వే గేటు సమీపంలో జరిగింది. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆమె వివరాలు తెలిసినవారు 94406 27646 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

ఓటర్లకు క్యూలోనే డబ్బులు పంచిన వైసీపీ నేత



22వ బూత్‌లో వృద్ధురాలికి డబ్బులను పంపిణీ చేస్తున్న వైసీపీ నేత పఠాన్ కాలేషావలి

మార్టూరు, మే 14 : సోమవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మార్టూరు లో విలేజ్ రెవెన్యూ కార్యాలయంలో ఉన్న 22వ పోలింగ్ బూత్‌లో మండల వైసీపీ నేత క్యూలోనే ఓటర్లకు డబ్బులను పంపిణీ చేయడం వీడియో రూపం లో ప్రసార మాధ్యమాలలో చక్కర్లు కొట్టింది. వైసీపీ మండల పార్టీ కన్వీనర్ పఠాన్ కాలేషావలి ఓటు వేయడానికి క్యూలో ఉన్న మహిళలలో ఓ వృద్ధురాలికి ఓటు వేయాలని కోరుతూ డబ్బులు ఇస్తున్న వీడియా అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. వాస్తవానికి ఓటర్లకు ఇరు పార్టీలకు చెందిన నాయకులు చాటుగామాటుగా, ఇంటిలోనే, ఇతరత్రా చోటులోనే డబ్బులు పంపిణీ చేసిన సంఘటనలు జరిగాయి. అయితే పోలింగ్ కేంద్రంలోనే ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు చూస్తుండగానే డైరెక్టుగా మహిళా ఓటర్‌కు వైసీపీ నేత డబ్బులు ఇవ్వడంపై సర్వత్రా చర్చ నీయాంశమైంది.

గొట్టిపాటికి ముందస్తు అభినందనలు

పార్టీ కార్యాలయానికి భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు

పంగులూరు, మే 14 : మండలంలోని ముప్పవరం గ్రామంలోని టీడీపీ కార్యాలయానికి మంగళవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు ముందస్తు అభినందనలు తెలిపారు. ఐదు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆయా మండలాలలోని గ్రామాలలో సోమవారం జరిగిన పోలింగ్ సరళి, పార్టీకి వచ్చే ఓట్ల సంఖ్యను నాయకులు గొట్టిపాటికి వివరించారు. ఎన్నికల సందర్భంగా గ్రామ, మండల స్థాయిలో కూటమి అభ్యర్థుల గెలుపునకు కష్టపడి పని చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, పార్టీ కార్యకర్తలకు గొట్టిపాటి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పంగులూరు, అద్దంకి, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు మండలాలకు చెందిన నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పర్చూరు నియోజకవర్గంలో 87.32 శాతం పోల్



పర్చూరు ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

పర్చూరు, మే 14 : సార్వత్రిక ఎన్నికల్లో పర్చూరు నియోజకర్గంలో 87.32 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం 2,29,333 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. అందులో 87.32 శాతం ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రారంభమైన రెండు గంటల వ్యవధిలో 12.01 పోల్ కావడంతో ఓటింగ్ శాతం అనూహ్యంగా పెరుగుతుందని ఆయా పార్టీల నేతలు అంచనా వేసుకున్నారు. అంచనాలకు అనుగుణంగానే పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. మధ్యాహ్నం 1 గంట సయానికి పోలింగ్ శాతం 48.81శాతం చేరింది. మూడు గంటల సమయానికి 64.60 శాతంతో ఓట్ల పోలింగ్ అనూహ్యంగా పెరిగింది. ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తరుణంలో ఒక్కసారిగి, గాలి దుమారంతోపాటు, భారీ వర్షం కురవడంతో ఓటర్ల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయినా గంటల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించి మరీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమయం ముగిసే సమయానికి కేంద్రంలోకి చేరుకున్న వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో సమయం ముగిసే సమయానికి గరిష్ఠంగా 87.32 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎలాంటి వివాదాలు, ఘర్షణలకు తావులేకుండా పోలింగ్ సజావుగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అప్రజాస్వామ్యం రాజ్యమేలుతోంది



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

పేరాల(చీరాలటౌన్), మే 14 : చీరాల నియోజకవర్గంలో అప్రజాస్వామ్యం రాజ్యమేలుతోందని దీనిపై వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు నాయకులు అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమయంలో చీరాల్లో చోటుచేసుకున్న పలు ఘటనలపై నిరసనగా మంగళవారం పేరాల గోలిసదాశివరావు కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఒకేరోజు పేరాలలోని శృంగార పేట వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌పై దాడికి య త్నం, రాత్రి సమయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆమంచి అనుచరుడు మార్పు గ్రెగోరీపై జరిగిన దాడిని వివరించారు. గ్రెగోరీని ఉద్దేశ పూర్వకంగానే చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ దాడిచేసినట్లు ఆరోపించారు. అధికారులు వెంటనే వీటిపై న్యాయపరమైన విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవరపల్లి బాబురావు, పులిపాటి బాబురావు, మల్లెల బుల్లిబాబు, గవిని వేణు, కోటి దాసు, నీలం శ్యామ్యేల్ మోజెస్, చుండూరి వాసు, పాపిశెట్టి సురేష్ నాయుడు, మేరిగ ఇస్సాకు, ఎన్.బాబురావు, డేటా జోసఫ్ తదితర కాంగ్రెస్, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దర్శి అసెంబ్లీలో అత్యధికంగా 90.91 శాతం పోలింగ్

దర్శి, మే 14 : దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 90.91 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కంటే ఇక్కడే అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,26,370 మంది ఓటర్లు ఉండగా 2,05,792 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 1,03,931 మంది ఓటు వేయగా మహిళలు 1,01,860 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడవ రకంకు చెందిన ఒక ఓటు నమోదైంది. నియోజకవర్గంలో అత్యధికంగా దర్శి మండలంలోని చిన్నఉయ్యాలవాడ పోలింగ్ బూత్‌లో 98.64 శాతం పోలింగ్ నమోదైంది. అతి తక్కువగా దర్శి పట్టణంలోని 113 నెంబరు బూత్‌లో 68.59 శాతం ఓట్లు పోలయ్యాయి. దర్శి మండలంలో మొత్తం 72,888 మంది ఓటర్లు ఉండగా 64,372 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలోనే అత్యధికంగా నియోజకవర్గంలో పోలింగ్ నమోదు కావటంతో రాజకీయ వర్గాల్లో విశేష చర్చ జరుగుతోంది. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారోనని అంచనాలు వేస్తున్నారు.

దొనకొండ మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో 92.16 శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం. కురిచేడు మండలంలో 90.90 ఓటర్ల శాతం నమోదైంది.

పీసీపల్లి మండలంలో 86.65శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని 68 పోలింగ్ కేంద్రాలలో నమోదైన ఓటింగ్‌ను లెక్కిస్తే 82.29 శాతం పోలింగ్ నమోదైనట్లు మండల ఎన్నికల అధికారి షాకీర్‌పాష చెప్పారు.

అంతుచిక్కని ఓటరు నాడి..!



గవినివారిపాలెంలో పెద్ద ఎత్తున క్యూలో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

చీరాల, మే 14 : సార్వత్రిక ఎన్నికల ఏపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు గెలుపోటములపై ఓటరు నాడి అంతుచిక్కడం లేదు. నియోజకవర్గ పరిధిలో 2,02,711 ఓటర్లు ఉన్నారు. అందులో 82.61 శాతం ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికలతో పోల్చుకుంటే 2024 ఎన్నికలు అత్యధికంగా పోలయ్యాయి. పార్టీల పరంగా ఆయా ప్రాంతాల ఓటర్లు ఎవరెవరికి ఓటు చేశారనే అంశం పక్కన పెడితే అధికార వైసీపీకి సానుకూలంగా ఓటింగ్ సరళి సాగినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ ప్రక్రియ పైకి కనిపిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వైసీపీకి కూడా గణనీయంగా ఓట్లు పోలయినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గ పరిధిలో మూడు ప్రధాన పార్టీలతో పాటు 12 మంది అభ్యర్థులు స్వతంత్రులుగా పోటీ చేశారు. ఈక్రమంలో పోటీలో నిలిచిన 15 మందితో పాటు నోటాకు ఇచ్చిన ఆప్షన్‌కు 16 శ్రేణుల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం తరువాత జరిగిన పోలింగ్‌పై ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపోటములను రాజకీయ పార్టీల విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద ప్రభుత్వ వ్యతిరేక ఓటు అనుకూలంగా మారనుందా.. లేకుంటే స్థానిక స్థితిగతులపై ప్రభుత్వ వ్యతిరేఖ ఓటుకు సానుకూల స్పందన రానుందా.. అనే అంశంపై బేరీజు జరుగుతుంది.

బల్లికురవలో భారీ వర్షం

ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బల్లికురవ, మే 14 : భానుడి భగ భగలతో అల్లాడుతున్న ప్రజలకు మంగళవారం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. బల్లికురవతోపాటు పలు గ్రామాలలో ఉరుములుతో కూడిన భారీ వర్షం గంట పాటు దంచి కొట్టడంతో రోడ్లు అన్ని జలమయ్యాయి. గతవారం రోజుల నుంచి ఉక్కపోత, ఎండ వేడిమితో ప్రజలు విలవిలలాడుతుండగా ఒక్కసారిగా పెద్ద వర్షం పడడంతో వేసవి కాలంలో వర్షాకాలాన్ని తలపించేలా ఎక్కడ చూసిన రోడ్ల వెంబడి వర్షపు నీరు నిలబడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం ప్రభావం మరో వారం రోజుల వరకు ఎండల నుంచి ఉపసశమనం పొందేలా దోహదపడుతుందని భావిస్తున్నారు. మే ముగిస్తే వాతావరణం చల్లబడుతుందని, ఎండల నుంచి తప్పించుకోవచ్చని ప్రజలు అంటున్నారు. బల్లికురవలో భారీ వర్షం పడడంతో తహసీల్దార్ కార్యాలయంలోకి నీరు భారీగా చేరింది. కార్యాలయం పల్లంలో ఉండడం వల్లే వర్షపు నీరు వెళ్లిందని స్థానికులు తెలిపారు. భారీ వర్షంతో పశువులకు పొలాల్లో పచ్చి మేతతో పాటు నీరు కూడా దొరుకుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ భవనం పూర్తయ్యేదెప్పుడో..?

- నాడు-నేడు కింద పనులు ప్రారంభం
- రెండేళ్లయినా పూర్తికాని వైనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



సంపత్ నగర్‌లో స్లాబ్ దశలో ఉన్న స్కూల్ భవనం

మార్టూరు, మే 14 : నాడు - నేడు కింద దాదాపుగా రెండేళ్ల క్రితం మార్టూరు గ్రామ పంచాయతీలో సంపత్‌నగర్‌లో ఎంపీపీ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ.16 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఐదు సెంట్ల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో రెండు గదులను పడగొట్టి నూతన భవనాన్ని నిర్మాణం చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేశారు. ఒక గదిని మాత్రం ఉంచడంతో గత సీజన్‌లో విద్యార్థులకు ఉపాధ్యాయులు అక్కడే తరగతి గదులను నిర్వహించారు. 1వ తరగతి నుంచి 5వతరగతి వరకు విద్యార్థులను అందరినీ ఒకే గదిలో ఉపాధ్యాయులు అక్కడే చదువు చెప్పడం ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులు చెప్పన్నారు. కాని కొత్తగా నిర్మిస్తున్న రెండు గదుల నిర్మాణం పనులు మాత్రం మందగించాయి. కొంత కాలం నిధులు రాక పోవడం, బిల్లులు మంజూరు కాక పోవడంతో స్కూలు నిర్మాణం పనులు కొన్ని నెలలు పాటు నిలిచి పోయాయి. అయితే ప్రస్తుతం స్లాబు దశకు స్కూలు నిర్మాణం చేరింది. ఇప్పటికి రెండేళ్ల సమయం గడి చింది. కానీ స్కూలు భవన నిర్మాణం ఎపుడు పూర్తవుతుందోనని చెప్పలేని పరిస్థితి. కనీసం వచ్చే నెలలో ప్రారంభం కానున్న స్కూలు తరగతులను సమయానికి కొత్త భవనం నిర్మాణం పూర్తయితే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ విషయమై మంగళవారం ఎంఈవో వస్రాం నాయక్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా స్కూలు భవన నిర్మాణంలో జాప్యం జరిగిన మాట వాస్తవమే నన్నారు. ప్రస్తుతానికి నిధులు కొరత లేదన్నారు. ఈ సీజన్‌లో తరగతులు ప్రారంభయ్యే నాటికి స్కూలు భవన నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు.

గ్రామాల్లో అస్తవ్యస్తంగా డ్రైనేజీ

- ముందుకు కదలని మురుగు
- దుర్గంధం, దోమలతో ప్రజల అవస్థలు
- కాలువలపై కట్టడాలతో సమస్య తీవ్రం
- పట్టించుకోని అధికారులు



ఇందిరా కాలనీలో మురుగునీటి పరిస్థితి ఇలా



ప్రధాన రహదారి వెంట కాలువపై కట్టడం

అంబేద్కర్‌నగర్‌లో కాలువల్లో పేరుకు పోయిన వ్యర్థాలు

పర్చూరు, మే 14 : గ్రామాల్లో మురుగు కాలువల అస్తవ్యస్తంగా ఉండడంతో ఎక్కడ మురుగు అక్కడే అన్న చందాన పరిస్థితి నెలకొంది. మురుగు ముందుకు కదలకపోవడంతో రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో దుర్గంధం, దోమల బెడదతో స్థానికులు నరకం చూస్తున్నారు. దోమల దాడి పెరిగి పోవడంతో ఏం వ్యాధులు వస్తాయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. డ్రైనేజీ కాలువలపై వ్యాపార దుకాణాను ఏర్పాటు చేసుకోవడం, భారీ కట్టడాలను నిర్మించడంతో సమస్య మరింత తీవ్రంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో మురుగు ముందుకు కదలని దుస్థితి ఏర్పడింది. వానలు కురిస్తే సమస్య తీవ్రతరంగా మారుతుందని, మురుగు నీరు రోడ్లపై చేరడంతో రాకపోకలు చే యాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండలంలో ఏగ్రా మం చూసినా ఇదే పరిస్థితి ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లే దు. శివారు కాలనీల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉందని కాలనీ వా సులు వాపోతున్నారు. పర్చూరుతోపాటు, ఇందిరాకాలనీ, చెంచు కాలనీ, అంబేద్కర్‌నగర్, ఉప్పుటూరు, చెరుకూరు, నూతలపాడు, వీరన్నపాలెం తదితర గ్రామాల్లో పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కనీసం మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లుతున్న దాఖలాలు కూడా కానరావడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు వ్యాపారులు తమ దుకాణాల్లోని నీటిని రోడ్లపై యథేచ్ఛగా పోస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆయా గ్రామాల్లోని డ్రైనేజీ వ్యవస్థపై దృష్టిసారించి మురుగు నీరు నిల్వలేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీంతోపాటు, డ్రైనేజీ కాలువలపై ఉన్న కట్టడాలను తొలగించి మురుగునీరు ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





నెల్లూరులోని ప్రియదర్శిని కాలేజీకి చేరుకున్న ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూములకు తరలిస్తున్న సిబ్బంది

మండలం	ఓట్లు	పోలైనవి	శాతం
ఆత్మకూరు	52,981	42,894	80.96
చేజర్ల	27,887	24,672	88.47
ఏఎస్‌పేట	27,643	23,374	84.56
అనంతసాగరం	35,702	29,758	83.35
సంగం	35,824	30,210	84.33
మర్రిపాడు	35,364	28,921	81.78
నెల్లూరు రూరల్	2,80,888	1,90,347	68.0
నెల్లూరు సిటీ	2,39,544	1,71,763	71.72
వెంకటాచలం	52,285	44,290	84.71
తోటపల్లిగూడూరు	41,593	36,127	86.86
పొదలకూరు	59,937	48,553	81.01
ముత్తుకూరు	45,965	38,154	83.01
మనుబోలు	32,231	27,494	85.30
కందుకూరు పట్టణం	47,431	40,147	84.64
కందుకూరు రూరల్	30,605	27,983	91.43
వలేటివారిపాలెం	35,274	31,932	90.53
లింగసముద్రం	30,953	28,015	90.51
గుడ్లూరు	39,760	35,977	90.49
ఉలవపాడు	44,890	39,583	88.18
కోవూరు	65,047	46,579	71.06
బుచ్చిరెడ్డిపాళెం	70,602	53,664	76.01
కొడవలూరు	41,300	33,080	80.09
విడవలూరు	41,880	33,776	80.78
ఇందుకూరుపేట	48,516	41,617	85.78
కావలి అర్బన్	83,239	63,478	76.26
కావలిరూరల్	43,028	38,695	89.93
బోగోలు	39,237	33,007	84.12
అల్లూరు	42,638	35,817	84.0
దగదర్తి	30,411	27,069	89.01
వింజమూరు	33,360	26,278	78.7
సీతారామపురం	19,848	15,290	77.03
జలదంకి	33,375	32,755	87.63

ఉదయగిరి, వరికుంటపాడు, కొండాపురం, కలిగిరి, దుత్తలూరు మండలాల నుంచి పోలింగ్ వివరాలు వెల్లడించలేదు.



ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో బస్సుల కోసం వేచి ఉన్న వలసవాసులు



కలువాయిలో బారులు తీరిన మందుబాబులు



మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

ఓటేశాం.. ఇక వెళ్లొస్తాం !

ఓటు వేసేందుకు స్వగ్రామాలకు తరలివచ్చిన వలసవసులు మంగళవారం తిరుగు పయణమయ్యారు. తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆదివారం స్వగ్రామాలకు వచ్చారు. సోమవారం ఓటు వేసి మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, బస్సుల కొరత కారణంగా ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో వారికి నిరీక్షణ తప్పలేదు. అలాగే ప్రత్యేక వాహనాల్లో వచ్చిన వారు ఓటు వేసిన అనంతరం తిరిగి బయలుదేరగా రోడ్డ వెంట ట్రాఫిక్ ఆగిపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

- ఉదయగిరి

రెండ్రోజుల తర్వాత మద్యం!

ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో రెండు రోజులుగా మూతపడిన ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు మంగళవారం ఉదయం ఓపెన్ అయ్యాయి. శనివారం సాయంత్రం మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు సీల్ వేశారు. పోలింగ్ ప్రక్రియ పూర్తికావడంతో సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో మద్యం దుకాణాలు, బార్లు తెరుస్తామని అధికారులు ప్రకటించారు. అయితే, పోలింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో కలెక్టర్ ఆదేశాలతో దుకాణాలు తెరవలేదు. రెండు రోజులపాటు మద్యం కోసం ఎదురు చూస్తున్న మందుబాబులు మంగళవారం ఉదయం దుకాణాల తలుపులు తెరవకముందే క్యూ కట్టారు. ఆ తర్వాత పోటీపడి మద్యం కొనుగోలు చేశారు.

- నెల్లూరు (క్రైం)

తోటపల్లిలో తెల్లవారుజాము వరకు పోలింగ్

తోటపల్లిగూడూరు మండలం తోటపల్లి పోలింగ్ కేంద్రంలో (99) మంగళవారం తెల్లవారుజాము 3.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఇక్కడ 1150 మంది ఓటర్లు ఉండగా 1039 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గది ఇరుకుగా ఉండటం, ఈవీఎంలు సరిగా పనిచేయకపోవడం, వృద్ధులు అభ్యర్థుల గుర్తులు ఎంచుకునే సమయంలో జరిగిన ఆలస్యం తదితర కారణాలతో ప్రక్రియ ఆలస్యమైంది. మరోవైపు 144 సెక్షన్ నిబంధనలు అమలు కాకపోవడంతో ఏజెంట్లు, స్థానిక నేతలు అధికారుల సూచనలను గాలికి వదిలేశారు. మొత్తం మీద తోటపల్లి పోలింగ్ ప్రక్రియ తెల్లవారుజాము వరకు జరగడం చర్చనాయాంశంగా మారింది.

- తోటపల్లిగూడూరు



భారీ పోలింగ్..
లాభం ఎవరికి!?

ఓటు వేసేందుకు తరలివచ్చిన జనం ● తెల్లవారుజాము వరకూ క్యూలైన్‌లోనే..

పోస్టల్ బ్యాలెట్‌దీ అదే పరిస్థితి ● విజయంపై ఇరు పార్టీల ధీమా

నెల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నమోదైన భారీగా పోలింగ్ ఎవరికి లాభం.. ఎవరికి నష్టం..? అన్న చర్చలు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నాయి. గెలుపుపై ఎన్డీఏ కూటమి, వైసీపీ పక్షాలు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ రాజకీయ విశ్లేషకులు మాత్రం గత చరిత్రను విశ్లేషిస్తూ అంచనాలు వెల్లడిస్తున్నారు. ఇదే ఇప్పుడు అన్ని వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర విభజనకు ముందు ఏపీలో సరాసరి 70 శాతం పోలింగ్ జరిగేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. విభజన నేపథ్యంలో అనుభవజ్ఞుల పాలన అవసరమని భావించిన ప్రజలు భారీగా తరలి వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో 2014లో 74 శాతానికిపైగా (పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి) ఓటింగ్ జరిగింది. ఆ ఎన్నికల్లో టీడీపీకి మెజారిటీ స్థానాలు దక్కగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రజల ఆలోచన స్పష్టంగా అర్థమైంది. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీపై వ్యతిరేకత లేకపోయినా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా 'ఒక్కచాన్స్' అంటూ అడుగుతున్న జగన్మోహన్‌రెడ్డికి ఆ చాన్స్ ఇచ్చేందుకు సముఖత చూపారు. ఈ కారణంగానే 2019లో 78 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. అంత భారీస్థాయిలో ఓటింగ్ జరగడంతో వైసీపీకి భారీ విజయం చేకూరింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పదికి పది స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది.

● ఈసారి 80 శాతం?

అయితే ఈ దఫా ఎన్నికల్లో అంతకు మించి పోలింగ్ నమోదైంది. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 78 శాతానికిపైగా పోలింగ్ జరగ్గా, పోస్టల్ బ్యాలెట్‌తో కలుపుకుంటే అది 80 శాతం దాటుతుందని అంచనా వేస్తున్నారు. అయితే ఇంత భారీస్థాయిలో ఓటింగ్ జరగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రజలు ఇంత కసిగా తెల్లవారుజాము వరకు కూడా ఓపిగ్గా క్యూలో నిల్చొని ఓటు వేయడానికి కారణమేమిటబ్బా.. అంటూ ఎవరికి తగ్గ విశ్లేషణలు వారు చేస్తున్నారు. కానీ రాజకీయ విశ్లేషకులు మాత్రం పెరిగిన పోలింగ్ శాతం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతను చాటుతోందని అంచనా వేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులతో మొదలైన ఈ వేవ్.. సామాన్య ఓటర్లలోనూ కనిపించిందని చెబుతున్నారు. ఉద్యోగులు కూడా గతంలో ఎప్పుడూ లేనంతగా రికార్డు స్థాయిలో 96 శాతానికిపైగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● తరలివచ్చిన యువత

ముఖ్యంగా యువత భారీగా ఓటు వేసేందుకు తరలిరావడాన్ని విశ్లేషకులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి అన్నది వైసీపీ ప్రభుత్వంలో కనిపించలేదని, మరి యువత ఆ స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొన్నారంటే అది వైసీపీపై వ్యతిరేకతతోనేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ ముఖ్యంగా సర్వేపల్లి, నెల్లూరు సిటీ, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో గతాని కన్నా నాలుగైదు శాతం ఎక్కువగా పోలింగ్ నమోదవడం గమనార్హం. సాధారణంగా ఓటు వేశాక ఓటరు తన మనసులోని అభిప్రాయాన్ని బయటపెడుతుంటారని, కానీ ఈదఫా అలా జరగలేదని చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తుంటే జిల్లా ప్రజలు ఎవరివైపు నిలబడ్డారన్నది జూన్ 4వ తేదీన తేలుతుందని అంటున్నారు.



నెల్లూరు శివార్లలోని ప్రియదర్శిని కాలేజీలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు



ఈవీఎం యంత్రాలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్ సీల్ పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు

● పటిష్ట బందోబస్తు

నెల్లూరు(హరనాథపురం), మే 14 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓట్లు నిక్షిప్తం చేసుకున్న ఈవీఎంలు స్ట్రాంగ్ రూములకు చేరాయి. రాజ కీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు, ఎన్నికల స్టాట్యుటరీ మెటీరియల్‌ను పటిష్ట బందోబస్తు మధ్య మంగళవారం స్ట్రాంగ్ రూములలో భద్రపరిచారు.

పోలింగ్‌కు వినియోగించిన ఈవీఎం, ఇతర సామగ్రితో పోలింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం రాత్రి రిసీవింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, సర్వేపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, పోలింగ్ మెటీరియల్‌ను నేరుగా నెల్లూరులోని కనుపర్తిపాడులో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలకు చేర్చారు. ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన పోలింగ్ సామగ్రిని అక్కడి రిసీవింగ్ కేంద్రాల్లో అప్పగించగా అక్కడి నుంచి ప్రత్యేక కంటైనర్లలో ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలకు తరలించారు. స్ట్రాంగ్‌రూములలో వాటిని భద్రపరిచారు. కలెక్టర్ హరినారాయణన్ సోమవారం రాత్రి నుంచి మంగళవారం స్ట్రాంగ్ రూములలో భద్రపరిచే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు. వాటిని భద్రపరచిన తరువాత స్ట్రాంగ్ రూములలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్ సింగ్ బదూరియా, కే జ్యోతి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వామ్మో.. 800 కోట్లా!?

- ఒక్కో నియోజకవర్గంలో సరాసరిన రూ.100 కోట్లు
- భారీగా పెరిగిన అభ్యర్థుల ఖర్చులు
- నామినేషన్లకు ముందే మొదలైన హడావిడి
- డబ్బులు కుమ్మరించిన ప్రధాన పార్టీలు
- అధికారిక లెక్కల్లోనూ భారీగానే చిట్టా

నెల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ఖర్చులు భారీగా పెరుగు తున్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఖర్చుల మొత్తం రెట్టింపు అయినట్టు తెలుస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కో నియోజక వర్గంలో సరాసరి రూ.100 కోట్లకుపైగా ఖర్చులు పెట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాలు, ఎంపీ స్థానం జనరల్ స్థానాలు కావడంతో అభ్యర్థులు పోటీపోటీగా ఖర్చులు పెట్టారు. ప్రధాన పార్టీలు అభ్యర్థులంతా స్వత హాగా ధనవంతులు కావడం కూడా ఖర్చులు పెరగడానికి ఒక కారణంగా విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

నిబంధనలు ఇవీ..


ఎన్నికల నిబంధనల ప్రకారం జనరల్ అసెంబ్లీ స్థానంలో రూ.40 లక్షలు, జనరల్ ఎంపీ స్థానంలో రూ.95 లక్షల వరకు ఎన్నికల కోసం ఖర్చు పెట్టుకోవచ్చు. అయితే ఈ మొత్తం ఏ కోశాన అభ్యర్థులకు సరిపోలేదు. ప్రధాన పార్టీలకు చెందిన ఒక అభ్యర్థి అసెంబ్లీ స్థానంలో దాదాపు రూ.50 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఈ లెక్కలు చూసుకుంటే కళ్లు తిరుగు తున్నా.. ఇది నిజం. చివరి నిముషం లో ఒక్కో ఓటుకు సరాసరి రూ.2 వేల వరకు పంపిణీ చేశారు. ఒక్కో నియోజకవర్గంలో రెండు లక్షల ఓట్లకు డబ్బులు పంపిణీ చేశారు. దీని ప్రకారం చూసు కున్నా రూ.40 కోట్లు ఇక్కడే ఖర్చు చేశారు.

ప్రచారానికే రూ.లక్షల్లో..

మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నుంచి ప్రచారాలు మొదలయ్యాయి. నామినేషన్ల ముందు వరకు ఒక అభ్యర్థికి రోజుకు రూ.5 లక్షల వరకు ఖర్చు ఉండేది. అయితే నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక అది రూ.10 లక్షలకు చేరుకుంది. రోజువారీ ప్రచార నిర్వహణ ఖర్చులు, భోజనాలు, ఆఫీసు అద్దెలు, వెంట ఉండే నాయ కుల ఖర్చులు, ఆపదలో ఉండే నాయకులు, కార్యకర్తలకు సాయం చేయడం... ఇలా అనేక రకాల ఖర్చులు రోజూ జరుగుతుండేవి. ఇలా దాదాపు రెండు నెలలపాటు ప్రచా రం జరిగింది. ఇందుకోసమే ఒక్కో అభ్యర్థి దాదాపు రూ.3 కోట్ల నుంచి 5 కోట్లు వరకు ఖర్చు చేసి ఉంటారని అం చనా. ఇలా ఒక్కో నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీలతోపాటు ఇతర పార్టీలు, స్వతంత్రులు పోటీ చేశారు. వీరందరి లెక్కలను పరిగణలోకి తీసుకుంటే ఒక్కో నియో జకవర్గంలో సరాసరి ఎన్నికల ఖర్చు రూ.100 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంటే 8 నియోజక వర్గాలకు కలిపి సరాసరిన రూ.800 కోట్ల వరకు ఖర్చు చేసి ఉంటారని అంచనా.

ఖర్చులపై ఆరా

ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, వీడియో సర్వేలెన్స్ టీంలు, ఎక్స్‌పెండిచర్ అధికారులు.. రోజూ అభ్యర్థుల లెక్కలను నమోదు చేస్తూ వస్తున్నారు. నామినేషన్ల ముందు వరకూ ప్రచారాల ఖర్చులను పార్టీల లెక్కల్లోకి చేర్చారు. అభ్యర్థి పోటీలో ఖరారయ్యాకనే ఖర్చులను వారి ఖాతాల్లో వేస్తున్నారు. అధికారు లెక్కల ప్రకారం కూడా ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖర్చులు బార్డర్ లైన్‌ను దాటాయి. ఖర్చులు పెరుగుతున్న కారణంగానే కొందరు అభ్యర్థులు చివర్లో ప్రచారాలు తగ్గించి ఖర్చులు తగ్గించారు. మొత్తంగా అభ్యర్థులు రాసుకున్న ఖర్చులకు, అధికారులు రాసుకున్న ఖర్చులకు లెక్కలు సరిపోలాల్సి ఉంది. ఎన్నికలు పూర్తయిన 45 రోజుల్లోపు అభ్యర్థులు తమ ఖర్చులను ఎన్నికల అధికారులు సమర్పించాలి. ఏవైనా హెచ్చు తగ్గులు ఉంటే వాటిపై నిర్ణయం తీసుకునే అధికారం కలెక్టర్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌కు ఉంటుంది.



ఎన్నికల విధుల్లో పస్తులు

అధికారుల తీరుపై అసహనం

వరికుంటపాడు : పోలింగ్ కేంద్రాల్లో ప్రభుత్వ సిబ్బంది రెండు రోజులుగా సరిపడా తిండి లేక అవస్థలు పడ్డారు. నిబంధనల మేరకు రుచికరమైన ప్రత్యేక ఆహారం అందించాల్సి ఉండగా ఆచరణలో చేతులెత్తేశారు. వరికుంటపాడు మండలంలో కనీసం ఏ ఒక్కపూట కూడా మెనూ కనిపించకపోవడంతో అధికారుల తీరుపై సిబ్బంది తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నాసిరకం భోజనం అందించి చేతులు దులుపుకున్నారే తప్ప ఇతర అల్పాహారం గురించి ఏమాత్రం పట్టించుకోలేదనే వాపోయారు. అంతేగాక గంటల తరబడి ఆలస్యంగా సరఫరా చేయడంతో వాసన వస్తున్న ఆ భోజనాన్ని తీసుకునేందుకు అధికశాతం మంది వెనకడుగు వేశారు. చివరకు సొంతంగా ఇతర ప్రాంతాల నుంచి భోజనాలు తెప్పించుకోగా, అలాంటి అవకాశం లేని మరికొంతమంది మాత్రం పస్తులతోనే విధులు నిర్వహించారు.



వరికుంటపాడు : ఓ కేంద్రంలో మిగిలి పోయిన భోజన ప్యాకెట్లు

గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

● విశ్లేషణలో నేతలు ● హోరెత్తిన బెట్టింగులు
● పెదవి విప్పని ఓటర్లు
● ఎలాంటి ఫలితాలు వస్తాయో అని ఉత్కంఠ


ట్రక్కుల్లో నెల్లూరు తరలిస్తున్న ఈవీఎంలు

ఆత్మకూరు, మే 14: నియోజకవర్గంలో హోరాహోరీ ఎన్నికల పోరు నెలకొనడంతో గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. పోలింగ్ సరళిని బట్టి తమ ప్రయత్నాలు ఎంత వరకు ఫలించాయో సమీకరణలు చేసుకోవడంతో తలమునకలవుతున్నారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాల్లో ఓటరు నిర్ణయమేదైనా వర్గాలను కూడకట్టుకుని తాను శాసించగల ఓటర్లను తమ దోవలోకి తెచ్చుకోవడంలో ఎంతవరకు తాము సఫలమయ్యామో లెక్కలు వేసుకుంటున్నారు. ఎలాంటి ఫలితాలు అందిస్తాయనే విషయమై ప్రధాన పార్టీ అభ్యర్థులు అతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రధానపార్టీ నాయకులు గెలుపుధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటరు అంతుపట్టని విధంగా వ్యవహరించటంతో నాయకులు తమపార్టీ అభ్యర్థికే మెజార్టీ వస్తుందని లెక్కలు వేస్తూ సంతృప్తి చెందుతున్నారు. కార్యకర్తలు గ్రామస్థాయిలో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడి ఉంటాయో లెక్కలు కడుతూ తమ నేతకు ఎంత మెజార్టీ వస్తుందనే విషయాన్ని అంచనా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

గెలుపుపై టీడీపీ ధీమా

ఆత్మకూరులో తెలుగుదేశం అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయం తథ్యమని ఆ పార్టీ శ్రేణులు ధీమాగా ఉన్నారు. మండలాల వారీగా... గ్రామాల వారీగా... తమకు వచ్చే ఆధిక్యతను లెక్కకట్టి 10వేల పైబడి ఓట్ల ఆధిక్యతతో విజయం సాధిస్తామని విశ్లేషిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, టీడీపీ సూపర్ సిక్స్, ఉమ్మడి మెనిఫెస్టో తమకు అనుకూలిస్తాయని టీడీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. చేజర్ల, సంగం, ఆత్మకూరు మండలాల్లో ఆధిక్యత వచ్చే పరిస్థితి ఉందని వారు లెక్కలు వేస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి మేకపాటి సొంత మండలం మర్రిపాడు మండలంలో ఎప్పుడు లేని విధంగా ఎదురుగాలి తోలింది. అనూహ్యంగా టీడీపీకి సానుకూల పవనాలు వీచాయని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ, ఏఎస్‌పేట మండలంలో టీడీపీకి స్వల్ప మెజార్టీ లభించే అవకాశాలున్నాయని పార్టీ నేతలు గ్రామాల వారీగా లెక్కలు చెబుతున్నారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో టీడీపీ పుంజుకోవడంతో వైసీపీ ఆధిక్యతకు గండిపడిందని చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ వారు విజయం తమదేనని ధీమాగా చెబుతున్నారు. వైసీపీ నేతలు సైతం గెలుపు తమదేననే ధీమాను వ్యక్తపరుస్తూ లెక్కలు కట్టే పనిలో పడ్డారు. వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి సైతం గెలుపుపై ధీమాగా ఉన్నారు. అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో, ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధి, ఏఎస్‌పేట, సంగం మండలాలతో పాటు ఆత్మకూరు రూరల్‌లో సైతం తమకు స్వల్ప ఆధిక్యత వస్తుందని చెబుతున్నారు.

ఈవీఎంల్లో భవిత

ఉదయగిరి: పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల ఓటర్ల తీర్పు ఈవీఎంలో భద్రంగా నిక్షిప్తమైంది. వారి భవితవ్యం జూన్ 4వ తేదీన తేలనుంది. సోమవారం అర్ధరాత్రి పోలింగ్ ముగియగానే ఈవీఎంలకు సీల్ వేసి కట్టుది ట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం లోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. మంగళవారం ఉదయం ఇక్కడ నుంచి నెల్లూరులోని ప్రియదర్శిని కళాశాలకు తరలించారు. లెక్కింపు తర్వాత ఎవరు ఓడేది, ఎవరూ గెలిచేది తెలిపోతోంది.

ఎక్కడ చూసినా అదే ముచ్చట!

నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు.. ఏ వర్గం ఓట్లు ఎవరికి అనుకూలంగా పడ్డాయి.. ఇదీ ఇప్పుడు జరుగుతున్న ప్రధాన చర్చ. అదే ముచ్చట్లు. ఊరువాడల్లో ఎక్కడ ఇద్దరు గుమిగూడినా ఏ నాయకుడిని పలకరించినా ఎవరు గెలుస్తారనే చర్చ విపరీతంగా సాగుతోంది. ఫోన్‌లో సన్నిహి తులు, ఇతర కార్యకర్తలను పలకరిస్తూ గెలుపోటములపై అందరూ ఆరా తీయడం కనిపిస్తోంది. మరోవైపు ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఈ అంచనాల్లో మునిగి తేలుతున్నారు. నియోజకవర్గంలో పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం, కలిగిరి, వింజమూరు, జలదంకి మండలాల్లో ఓటింగ్‌శాతం ఆధారంగా లెక్కలేస్తున్నారు. ఓవైపు పైకి గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నా.. ఓట్ల తీరును బట్టి ఏ పార్టీకి ఓట్లు పడ్డాయో అంచనాలతో ఓట్లను లెక్కుస్తున్నారు. కూడికలు, తీసివేతలతో గెలుపు అంతరాన్ని నిర్వహిస్తున్నారు. మరోవైపు టీవీల్లో వచ్చిన ఎగ్జిట్‌పోల్స్ కొంతమందిలో ఆశలు నింపగా, మరికొందరు అభ్యర్థుల్లో నిరాశకు గురిచేస్తున్నాయి. పోలింగ్‌శాతం అనుకున్నంతగా పెరగ డంతో ఎవరికి ఇబ్బంది కలిగిస్తుందనే విషయంపై రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికార వైసీపీ, ప్రతిపక్ష పార్టీ టీడీపీ అన్ని స్థానాలు మా వేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటింగ్‌శాతాన్ని బట్టి తమ అభ్యర్థికి బలం చేకూరుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సోమశిలలో 7.842 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మే 14: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. మంగళవారానికి జలాశయంలో 7.842 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారు లు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలు వకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నేటినుంచి సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, మే 14: శకునాలపల్లిలో బుధవారం నుంచి శుక్రవారం వరకు సీతారాముల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహపూజ, గురువారం విశేష అభిషేకా లు, పూజలు, స్వామివార్ల కల్యాణం, శుక్రవారం వసంతోత్సవం, పారువేట ఉంటుందన్నారు. ఉత్సవాల సందర్భం గా అన్నదానంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.

నిస్వార్థంగా పనిచేశారు..!


సీతారామపురం: మాట్లాడుతున్న భోగినేని కాశిరావు

సీతారామపురం, మే 14: మండలంలో మూడు, నాలుగు నెలల నుంచి కాకర్ల సురేష్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గెలుపు కోసం నిస్వార్థంగా కూటమి నాయకులంతా పని చేయడం శుభపరిణామం అని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ భోగినేని కాశిరావు అన్నారు. మంగళవారం స్థానిక జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు కూటమి వైపు నిలబడి ఆశీర్వదించారని, మండలంలో జరిగిన ఓటింగే నిదర్శనం అన్నారు.

మరమ్మతుకు నోచుకోని చేతిపంపు


అనంతసాగరం: గుడిగుంట బస్‌షెల్టర్‌లో మరమ్మతులకు నోచని చేతిపంపు

అనంతసాగరం, మే 14: గుడిగుంట బస్‌సెల్టర్ సమీపంలోని చేతిపంపు భూ మట్టానికి చేరి వినియోగంలో లేదని దాన్ని పైకి లేపి పంపునకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఎండతీవ్రత అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితిలో ఈ పంపు వినియోగంలోకి తెస్తే ప్రయాణికులు, మూగజీవాలకు తాగునీటి సమస్య తీర్చవచ్చని చెబుతున్నారు.

గృహోపకరణాల దగ్ధం

ఉదయగిరి రూరల్, మే 14: ఉదయగిరి ప్రాంతంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పట్టణంలోని బాలాజీనగర్, దిలావర్ భాయ్‌వీధి, సుద్ధబావివీధి, నాగులబావివీధి, చాకలవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పలు నివాషాల్లో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. వాటిలో ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, టీవీలు ఉన్నాయి.

తాటిముంజలకు భలే గిరాకీ

● డజను రూ.60 చొప్పున అమ్మకాలు

ఉదయగిరి, మే 14: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో వింజమూరు, ఊటుకూరు, తక్కెళ్లపాడు గ్రామాల నుంచి కొందరు ప్రతిరోజూ తాటిముంజలు గంపల్లో తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. డజను ముంజలు రూ.60లు చొప్పున, ఒక్కొక్కటి రూ.5ల చొప్పున రూ.10కి రెండు ఇస్తున్నారు. ఖర్చులుపోను తమకు సుమారు రూ.800లు కూలిపడుతుందని వారు చెబుతున్నారు. వేసవి కావడంతో అనేక మంది కొనుగోలు చేస్తున్నారని, వ్యాపారం బాగుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసవి వచ్చిందంటే తాటి ముంజలకు గిరాకీ ఉంటుందని, అనేక ఔషధ గుణాలున్న వీటితో ఎండవేడిమి తాపం తగ్గుతుందని చెబుతున్నారు.

ఆత్మకూరు మినహా అన్ని మండలాల్లో 80శాతం పోలింగ్

● నియోజకవర్గంలో పోలింగ్ శాతం 83.49
● ఆధిపత్య గ్రామాల్లో అధికంగా ఓటింగ్


సంగంలో ఓటింగ్‌కు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

ఆత్మకూరు, మే 14: నియోజకవర్గంలోని టీడీపీ, వైసీపీ ఆధిపత్య గ్రామాల్లో భారీ ఎత్తున పోలింగ్ జరిగింది. తమకు అనుకూలంగా ఓటింగ్ చేసు కోవడంలో ఇరువర్గాల నాయ కులు విజయవంతం అయ్యారు. ఆధిపత్య గ్రామాల్లో జరిగిన భారీ పోలింగ్ ఫలితాలను తారుమారు చేస్తుందన్న అను మానం లేకపోలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గంలో 83.49 శాతం పోలింగ్ జరిగింది. కొన్నిగ్రామాల్లో 90శాతం పైబడి పోలింగ్ జరిగి ఉండటం విశేషం. 2,15,401 మంది ఓటర్లలో 1,79,829 మంది ఓటర్లు తమహక్కును వినియోగించుకున్నారు. అందులో 1,05,815 మంది పురుషుల్లో 88,854 మంది ఓటు వేశారు. అదేక్రమంలో 1,09,578మంది మహిళల్లో 90,974మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. చేజర్ల మండలంలో అత్యధికంగా 88.47శాతం పోలింగ్ నమోదు కాగా ఆత్మకూరు మండలంలో అతితక్కువగా 80.96 శాతం పోలింగ్ నమోదైంది. మర్రి పాడు మండలంలో 81.78శాతం పోలింగ్ నమోదు కాగా సంగం మండలంలో 84.33శాతం, ఏఎస్‌పేట మండలంలో 84.56శాతం, అనంత సాగరం మండలంలో 83.35శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. ఆత్మకూరు మండలం మినహా మిగిలిన అన్నిమండలాల్లో 80శాతం పైబడి పోలింగ్ నమోదవడం నియోజకవర్గ చరిత్రలో రికార్డు సృష్టించి నట్లయ్యింది.

సంగం మండలంలో 84 శాతం పోలింగ్

సంగం: మండలంలో 84.33శాతం పోలింగ్ జరిగింది. మొత్తం ఓటర్లు 35,824 మంది ఉన్నారు. ఇందులో 30,210 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 14803 మంది, మహిళలు 15407 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే 604 మంది మహిళలు హక్కు వినియోగించుకున్నారు. తలుపూరుపాడులో 821 మంది ఓటర్లకు గాను 760మంది ఓటుహక్కును వినియోగించుకుని 93.54 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా, రెండో స్థానంలో జంగాలకండ్రికలో 561 ఓట్లకు గాను 520 మంది ఓటు హక్కు వినియోగించుకుని ద్వితీయ స్థానంలో నిలిచారు. సంగం టౌన్‌లో మాత్రం 77.6 శాతంతో మండలంలో అత్యల్పంగా పోలింగ్ నమోదయ్యింది. పోలింగ్ సరళిని బట్టి ఇరుపార్టీలు ఎవరికి వారు తమకే మెజార్టీ వస్తుందని అంచనా వేసి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకులు మండలంలో తమకు 3వేల పైచిలుకు ఓట్లు మెజార్టీ వస్తుంది, అదేవిధంగా వైసీపీ నేతలు లేదు.. మాకే 3వేల ఓట్ల మెజార్టీ రావడం ఖాయమని చెబుతున్నారు. అయితే ఓటర్లు ఇచ్చిన తీర్పు ఈవీఎంలో భద్రంగా ఉంది. ప్రజలు ఏ పార్టీ పట్ల మొగ్గు చూపారో, ఏ నాయకున్ని ఆదరిస్తారో తెలుసుకోవాలంటే జూన్ 4వ తేదీ వరకు ఆగాల్సిందే.

78.7 శాతం పోలింగ్

వింజమూరు: మండలంలో మొత్తం ఓటర్లు 33,369 మందిలో 26,278మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 78.7శాతం పోలింగ్ అయినట్లు తహసీల్దారు కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

సీతారామపురం: మండలంలో 25 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. మొత్తం 19848 మంది ఓటర్లు ఉండగా 15290 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 77.03 శాతంగా ఓట్లు నమోదయ్యాయి.

మారని మందుబాబుల తీరు..

ఉదయగిరి రూరల్, మే 14: పోలింగ్ ముగిసినా మద్యం షాపుల వద్ద మద్యం కోసం మందుబాబులు క్యూ కడుతూనే ఉన్నారు. ఎన్నికలకు ముందు ఈసీ మద్యం అమ్మకాల్లో ఆంక్షలు విధించింది. అప్పట్లో షాపులకు కేటాయించిన లక్ష్యం మధ్యాహ్నానికే పూర్తవుతుండడంతో షాపులు మూతపడ్డాయి. పోలింగ్ సందర్భంగా ఈ నెల 11న ఉదయం 7గంటల నుంచి 13వ తేదీ 7గంటల వరకు ప్రభుత్వం మద్యం షాపులను సీజ్ చేశారు. మంగళవారం మద్యం షాపులు తలుపులు తెరుచుకోవడంతో గతంలో మాదిరిగానే షాపుల వద్ద మందు కోసం బారులుతీరారు. మరోవైపు షాపులకు పక్కనే కూల్‌డ్రింక్స్ దుకాణాలు అందుబాటులో ఉండడం, అక్కడే సిట్టింగ్ వేసి మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కలువాయి: మందేసి మూడు రోజులైందని మంగళవారం ఉదయం తెరుచుకున్న మద్యం షాపుల ముందు మందుబాబులు బారులుతీరారు. స్వార్వత్రిక ఎన్నికల పోలింగ్ దృష్ట్యా శనివారం నుంచి మద్యం షాపులు మూసివేశారు. అప్పటి నుంచి మద్యం దొరక్క అల్లాడిపోతు న్నారు. ఓట్ల కోసం డబ్బు పంపిణీ చేసి ఉండటంతో జేబు లు నిండా డబ్బు ఉన్నా..మందు లేక వారి అవస్థలు వర్ణాతీ తం. బెల్టు దుకాణాల్లో ఉన్న మద్యం రూ.200ల బాటిలు రూ.500లు అమ్ముకున్నారని వాపోతున్నారు. ఎంత ధర అయినా కానీ మందు దొరక్క అల్లాడిపోయారు. షాపులు మళ్లీ తెర చుకోవడంతో బారులు తీరారు.


ఉదయగిరి: మద్యం కోసం ఎగబడుతున్న మందుబాబులు

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

● అపరిశుభ్రతతో కావలి వాసుల కష్టాలు
● దోపిడీపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై కరువు
● ఐదేళ్లలో ఐదుగురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ
● కుంటుపడ్డ పట్టణాభివృద్ధి


మానస థియేటర్ ఎదురుగా వ్యర్థాలతో నిండిన వరవ కాలువ

మురికి కూపంగా కనకపట్నం!

కావలిటౌన్, మే 14: కావలి కనకపట్నంగా మారుతుందని బ్రహ్మంగారి కాలజ్ఞానంలో చెప్పిన మాటేమోగాని పాలకులు మురికి కూపంగా మార్చారు. పట్టణంలో ఏ వీధి చూసినా.. ఏ కూడలి చూసినా చెత్తాచెదారాలు, వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తోన్నాయి. మురుగు కాలువలు, అందులో సంచరించే పందులతో అపరిశుభ్రత నెలకొంది. ముఖ్యంగా పట్టణ నడిబొడ్డునున్న వరువ కాలువలో చెత్తా చెదారాలు, కోళ్లు, చేపల వ్యర్థాలు, కుక్కలు, కోళ్ల కళేబరాలు వేస్తుండడం, అందులో పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో భరించలేని దుర్గంధంతో ప్రజలు సహజీవనం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పాలకులకు దోపిడీపై ఉన్న శ్రద్ధ పరిశుభ్రతపై లేకపోవడంతో పట్టణ పరిశుభ్రత చిన్నాభిన్నంగా మారింది. పట్టణ పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ ప్రజారోగ్యంపై పర్యవేక్షించాల్సిన ప్రజాప్రతినిధులు, పాలకులు అధికారులనే పావులుగా వాడుకుని దోపిడీలో భాగస్వాములను చేసి తలాపాపం తిలాపిడెకుడుగా వాటాలు పంచుకుంటు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇది లా ఉండగా కారణాలు ఏమైనా కావచ్చుకాని ఐదేళ్ల పాలనలో ఐదుగురు మున్సిపల్ కమిషనర్‌లు మారారు.


పాతూరు రత్నం పాఠశాల ఎదురు రోడ్డులో చెత్తలో సేద తీరుతున్న పందులు

● మున్సిపల్ పరిధిలో ప్రతిరోజు వీధులు, మురుగు కాలువలు శుభ్రం చేయడం, దోమలు లార్వా చేరకుండా దోమల మందు పిచకారి చేయ డం, బ్లీచింగ్ చల్లడం, నీటి ట్యాంకర్ల శుద్ధి తదితర చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అ వేవీ చేయకపోవడంతో పట్టణమంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొని దోమలు, పందులకు మురుగు కాలువలు నిలయాలుగా మారాయి. దీం తో విష జ్వరాలు వ్యాపించడంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడి డెంగ్యూ లాంటి విషజ్వరంతో ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు లేకపోలేదు..

పట్టణ పరిశుభ్రత, ప్రజా ఆరోగ్య పరిరక్షణకు మంజూరయ్యే కోట్ల రూపాయలు నిధులు దుర్వినియోగమై పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో పర్మినెంట్, రోజువారి, కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. పర్మినెంట్ కార్మికుల్లో సగం మంది విధులకు హాజరు కాకుండా తమ స్థానంలో రోజువారి కూలీలను ఏర్పాటు చేసుకుని మున్సిపల్ అధికారులను మేనేజ్ చేసి ఇంట్లో కూర్చుని జీతాలు పుచ్చుకుంటున్నా రు. కాంట్రాక్ట్, రోజువారి కార్మికులతో మున్సిపల్ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల ఇళ్లలో పనులు చేయించుకుని ప్రభుత్వం జీతాలు ఇస్తోంది. ఒకరోజుకు 100 మంది రోజువారి కా

నిధుల దుర్వినియోగం

ర్మికులను పనిలో పెట్టుకుని 150మంది లెక్క చూపించి నిధులు కాజేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీ వారు ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛనీరు సరఫరా చేయాల్సి ఉన్నా కలుషిత నీరు సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. రోజుకు తక్కువ ట్రిప్పులు నీరు సరఫరా చేసి ఎక్కువ ట్రిప్పులుగా దొంగ లెక్కలు రాసుకుని అధికారులు, అధికార పార్టీ నేతలు సొమ్ము చేసుకుం టూ ప్రభుత్వ నిధులు కాజేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై దృష్టి పెట్టని పాలకులు ఐదేళ్లల్లో ఐదుగురు మున్సిపల్ కమిషనర్లను మాత్రం మార్పించారన్న ఆరోపణలుసర్వత్రా వినిపిస్తున్నాయి.

కావలిలో 83.03 శాతం పోలింగ్

● గెలుపుపై ఎవరి ధీమా వారిదే..! ● కూడికలు, తీసివేతలతో నేతల బిజీ ● పార్టీ కార్యాలయాల వద్ద సందడి

కావలి, మే 14: కావలి నియోజకవర్గంలో 2,38,553 మందికి 1,98,066 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్ 83.03 శాతం నమోదైంది. పోలింగ్ శాతం పెరగడంతో గెలుపుపై ప్రధానపార్టీలు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటర్లు ఇద్దరి దగ్గర డబ్బులు తీసుకుని తమ అభిప్రాయం బయట పెట్టకుండా ఎవరడిగినా మనకే కదా అని చెప్పుతుండటంతో ప్రధానపార్టీలలో గెలుపుపై మరింత ధీమా పెరుగుతోంది. ఇదిలా ఉంటే కావలిలో బలమైన ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన పసుపులేటి సుధాకర్, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లను కొంత చీల్చుతారనే ప్రచారం ఉంది. ఆయన చీల్చిన ఓట్ల వలన ఎవరికి నష్టం జరుగుతుందోనని ప్రధాన పార్టీలలో ఉత్కంఠ నెలకొంది. అయినా పోలింగ్ అనంతరం టీడీపీ నాయకులకు గెలుపుపై మరింత ధీమా పెరగగా వైసీపీ నాయకులలో కూడా గెలుపుపై నమ్మకం సన్నగిల్లలేదు. దీంతో రెండు పార్టీల ముఖ్యనాయకులు వారి అనుచరులతో సమావేశమై పట్టణాలు, మండలాలు, వార్డులు, గ్రామాలు ఇంకా బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. కావలి పట్టణంలో మంచి మెజార్టీ వస్తోందని టీడీపీ అంచనా వేస్తుండగా టీడీపీ కన్నా ఒక్క ఓటైనా తమకే మెజార్టీ వస్తోందని వైసీపీ చెపుతోంది. మండలాల వారీగా కావలి రూరల్ దగదర్తి మండలాల్లో టీడీపీ భారీ మెజార్టీ వస్తుందని అంచనా వేస్తుండగా అంత మెజార్టీ రాదని వైసీపీ నేతలు అంటున్నారు. బోగోలు మండలంలో మెజార్టీపై ఇరు పార్టీలు మాకంటే మాకంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నేత, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డిలది అల్లూరు మండలం కావడంతో ఆ మండలంపై వైసీపీ నేతలు కొండంత ఆశలు పెట్టుకుని భారీ మెజార్టీ వస్తుందని అంచనా వేస్తున్నారు. కానీ టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రలది కూడా అల్లూరు మండలం కావడం, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అల్లూరు అల్లుడు కావడంతో వారు కూడా అక్కడ మెజార్టీ వస్తుందని ధీమాగా ఉన్నారు. దీంతో నియోజకవర్గంలో రకరకాల సమీకరణలతో లెక్కలు వేసుకుంటూ గెలుపుపై మాత్రం ఎవరికి వారు ధీమాగా ఉన్నారు.

జలదంకిలో...

జలదంకి : మండలంలో 37,377 ఓట్లు ఉండగా 32,755 ఓట్లు పోలవడంతో 87.63 శాతం నమోదైంది. గతం కంటే ఎక్కువ శాతం నమోదు కావడంతో ఎన్డీఏ కూటమిదే పైచేయి అంటున్నారు. 2019లో కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, ప్రస్తుత కావలి కూటమి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలు వైసీపీకి పనిచేయడంతో పాటుగా అప్పటి టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత తోడై 8500 పైచిలుకు ఓట్ల భారీ మెజార్టీ సాధించింది. ప్రస్తుత జరిగిన ఎన్నికల్లో వంటేరు, కావ్యతో పాటుగా వైసీపీ మాజీ మండల కన్వీనర్ చేవూరి జనార్దన్‌రెడ్డిలు వైసీపీని వీడి టీడీపీ కూటమికి మద్దతివ్వడం, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు, కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీల బలం తోడై వైసీపీ వెనుకంజలో ఉందని విశ్లేషకులు అంటున్నారు.

గెలుపుపై ధీమా!

● కూడికలు, తీసివేతల్లో నేతల నిమగ్నం
● గతం కంటే 0.55 శాతం తగ్గిన పోలింగ్

కందుకూరు, మే 14: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసి అభ్యర్థుల భవిష్యత్తు ఈవీఎంలలో నిక్షిప్తం కావటంతో గెలుపోటములపై అభ్యర్థులు అంచనాలలో తలమునకలవుతున్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థుల కార్యాలయాల వద్ద పోలింగ్ ఏజెంట్లు, గ్రామ, వార్డు స్థాయి నాయకులతో మంగళవారం సందడి నెలకొంది. కందుకూరు నియోజకవర్గంలో నువ్వా నేనా అన్నట్లుగా పోటీ జరగటంతో గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ ఓటింగ్ సరళి, ప్రభుత్వ వ్యతిరేకత, యువత, మహిళలు అత్యధికంగా ఓటుహక్కు వినియోగించుకోవటం తదితర పరిణామాలు తమకు అనుకూలమని టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నారు. అయితే ఇరుపార్టీల వారు కనీసం 1.5 నుంచి 2 శాతం ఓట్ల ఆధిక్యంతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు 0.55 శాతం ఓటింగ్ తగ్గింది. అప్పట్లో మొత్తం 2,18,859 మంది ఓటర్లు ఉండగా 1,95,916 ఓట్లు పోలై 89.51 శాతం నమోదుకాగా ప్రస్తుతం 2,28,913 మంది ఓటర్లు ఉండగా 2,03,637 ఓట్లు పోలై 88.96 శాతం నమోదైంది. గత ఎన్నికల కన్నా స్వల్పంగా పోలింగ్ శాతం తగ్గినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్ల బలాబలాలకు సంబంధించి వలేటివారిపాలెం, లింగసముద్రం, కందుకూరు మండలాలు టీడీపీకి అనుకూలం అని అంచనా వేస్తుండగా ఈ మూడు మండలాల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. ఇక వైసీపీకి అనుకూలంగా ఉంటుందని భావిస్తున్న ఉలవపాడు మండలం, కందుకూరు పట్టణంలో పోలింగ్ శాతం బాగా తగ్గటం తమకు కలిసొచ్చే అంశమని టీడీపీ శ్రేణులు అంచనా వేస్తున్నారు. ఈ అంచనాలకు తోడు పోలింగ్ బూత్ వారీ తమతమ పోలింగ్ ఏజెంట్లు నుంచి మెజారిటీ అంచనాలు తెప్పించుకుని కూడికలు, తీసివేతలు వేసుకున్న ఇరుపార్టీల నాయకులు ఎవరి అంచనాలు వారు చెబుతూ గెలుపు మాదంటే మాదేనని ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

టీడీపీ విజయం తథ్యం

● నియోజకవర్గ ప్రజలకు ఇంటూరి ధన్యవాదాలు

కందుకూరు, మే 14: కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని, ప్రజలు ఎన్డీఏ కూటమికి మద్దతుగా ఓటు వేశారని కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా ఓపికగా క్యూలైన్లలో వేచిఉండి పెద్దసంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకున్న ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అరాచకం పోవాలి చంద్రబాబు రావాలి అన్న కసితో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పోలింగ్ సరళిని బట్టి స్పష్టంగా అర్థమైందని పేర్కొన్నారు. కందుకూరులో నాపై నమ్మకంతో ఎన్డీఏ కూటమికి అధిక శాతం ఓటు వేశారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం వైపు అడుగులు వేసేలా ముందుకు నడిపించిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధవర్గాల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో మీ అందరినీ వ్యక్తిగతంగా కలుసుకుని ముందడుగు వేస్తానని నాగేశ్వరరావు పేర్కొన్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ : యువకుడి మృతి

● మరో ఇద్దరికి తీవ్రగాయాలు


మృతి చెందిన వేణుగోపాల్

లింగసముద్రం, మే 14 : మండలంలోని పెంట్రాల సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్ అండ్‌బీ రోడ్డుపై రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి 7 గంటలకు జరిగింది. ఎస్సై ఎం బాజీబాబు కథనం మేరకు.. మొగిలిచెర్ల గ్రామానికి చెందిన నాగినేని వేణుగోపాల్ (21), అదే గ్రామానికి చెందిన పడిదపు మౌళిలు మొగిలిచెర్ల నుంచి లింగసముద్రంకు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. ఇదే సమయంలో కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన వర్ల హరికృష్ణ తాతాహోటల్ మీదుగా మొగిలిచెర్ల వైపు మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో హరికృష్ణ వేగంగా వెళుతూ సబ్‌స్టేషన్ వద్ద నాగినేని వేణుగోపాల్ మోటారు సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో మోటారు సైకిల్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108కి సమాచారమిచ్చారు. 108 ఇబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లింగసముద్రం పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే వేణుగోపాల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అలాగే మౌళిని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కందుకూరుకు తరలించారు. హరికృష్ణకు స్థానిక పీహెచ్‌సీలోనే ప్రథమ చికిత్స చేశారు. విషయం తెలిసిన ఎస్సై బాజీబాబు పీహెచ్‌సీకి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, వేణుగోపాల్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

కావలి ఈవీఎంలు నెల్లూరుకు తరలింపు


ఎస్కార్ట్ బందోబస్తుతో ఈవీఎంలతో నెల్లూరుకు బయలుదేరిన కంటైనర్లు

కావలి రూరల్, మే 14: ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాలతో కావలి నియోజకవర్గంలోని ఈవీఎంలను మంగళవారం కంటైనర్ లారీలలో నెల్లూరులోని కనపర్తిపాడులో ఉన్న ప్రియదర్శిని కళాశాలకు తరలించారు. కావలి పట్టణ విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణ నుంచి రెండు కంటైనర్ లల్లో ఎస్కార్ట్ భద్రత, నిఘా నేత్రాల నడుమ నెల్లూరు తరలించి స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, మే 14: పట్టణంలోని విప్పగుంట రోడ్డులో రోశయ్య షామిల్లు ప్రాంతంలో లైన్‌వర్క్ ఉన్నందున బుధవారం ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని బలిజపాలెం, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, కనిగిరి రోడ్డు, నాంచారమ్మ కాలనీ, సబ్ కోర్టు ఏరియా, కోవూరు రోడ్డు, సాయినగర్, ఐవీ రావు నగర్, విజయనగర్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.